PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 340 | విజయవాడ, శనివారం 13 జులై 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 13 July 2024 | Rs

తక్షణం రోడ్ల మరమ్మతులు

- అత్యవసర పనులకు టెండర్లు
- చంద్రబాబు ఆదేశం

లోపలి పేజీలో..

విశ్వాసపరీక్షలో ఓడిన ప్రచండ

ఖాట్మండు : నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహల్-ప్రచండ శుక్రవారం విశ్వాస పరీక్షలో ఓడిపోయారు. మాజీ ప్రధాని కె.పి. శర్మ ఓలి నేతృత్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ (సిపిఎన్-యుఎంఎల్) ప్రభుత్వానికి తన మద్దతును ఉపసంహరించుకున్న నేపథ్యంలో ఈ బల పరీక్ష జరిగింది. 275 మంది సభ్యులు కలిగిన నేపాల్ ప్రతినిధుల సభలో ప్రచండకు అనుకూలంగా 63 ఓట్లు మాత్రమే వచ్చాయి. 194 మంది తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఓట్లు వేశారు. బలపరీక్షలో నెగ్గాలంటే కనీసం 138 ఓట్లు కావాల్సి వుంది. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పార్లమెంట్‌లోని అతిపెద్ద పార్టీలైన నేపాలీ కాంగ్రెస్, నేపాలీ కమ్యూనిస్ట్ పార్టీ (యుఎంఎల్) మధ్య ఒప్పందం కుదరడంతో కెపి ఓలి తదుపరి ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. నేపాలి కాంగ్రెస్‌కు 88 సీట్లు, సిపిఎన్ (యుఎంఎల్)కు 78 సీట్లు ఉన్నాయి. ఈ రెండు పెద్ద పార్టీలు కలసి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవడం పట్ల ప్రచండ విరుచుకుపడ్డారు. ఈ కూటమి తిరోగమనపూరితమని వ్యాఖ్యానించారు.

పెత్తందార్ల క్రౌర్యం

కర్నూలు జిల్లాలో దళిత మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశారు

నిందితులను కఠినంగా శిక్షించండి : కెవిపిఎస్



ప్రజాశక్తి- ఆదోని (కర్నూలు జిల్లా)

కర్నూలు జిల్లా ఆదోని మండలంలో పెత్తందారులు చెలరేగిపోయారు. భూ వివాదం నేపథ్యంలో దళిత మహిళపై ట్రాక్టర్ ఎక్కించి హత్య చేశారు. ఆమెకు సహాయంగా వచ్చిన మరో వ్యక్తిని తీవ్రంగా గాయపరిచారు. అనంతరం గ్రామం విడిచి పారిపోయారు. శుక్రవారం పట్టపగలు జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులకు దారి తీసింది. పోలీసులు నిందితులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదుచేసి, గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. సిఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నాగనాతనహళ్లి గ్రామానికి చెందిన దళిత మహిళ గుండమ్మ(55) అదే గ్రామానికి చెందిన రాఘవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డిల సమీప బంధువు (పిన తల్లి) తిరుపతమ్మ వద్ద కొంత కాలం క్రితం నాలుగు ఎకరాల పొలాన్ని కొనుగోలు చేశారు. అయితే, ఆ పొలంలో తమకు వాటా ఉందంటూ రాఘవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి కోర్టులో దావా వేశారు. భూ వివాదం కోర్టు పరిధిలో ఉండగానే పొలం దున్నేందుకు రాఘవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మరో నలుగురు వ్యక్తులు ట్రాక్టర్‌తో పొలానికి వెళ్లారు. వీరిని గుండమ్మ అడ్డు కున్నారు. కొద్ది సేపు వివాదం అనంతరం పొలం దున్నడానికి తీసుకువచ్చిన ట్రాక్టర్‌ను గుండమ్మపైకి ఎక్కించారు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ఆమెకు తోడుగా వెళ్లిన పురుషోత్తంరెడ్డి అనే మరో వ్యక్తిపైనా రాఘవేంద్ర రెడ్డి, శ్రీధర్ రెడ్డి అనుచరులు దాడి చేసి గాయపరిచారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తీవ్రంగా గాయపడిన పురుషోత్తం రెడ్డిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుండమ్మ మతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ కేసులో రాఘవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డితోపాటు మరో నలుగురు వ్యక్తులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కింద కేసు నమోదు చేశామన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి: కెవిపిఎస్

దళిత మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి దారుణంగా హత్య చేసిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, తిక్కప్ప డిమాండ్ చేశారు. ఆదోని ఏరియా ఆస్పత్రిలో గుండమ్మ మృతదేహాన్ని కెవిపిఎస్ నేతలు సందర్శించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు.

ప్రాంతీయ పార్టీల భుజాలెక్కి స్వారీ

కేంద్రంలో మోడీ నడుపుతున్నది సంకీర్ణ ప్రభుత్వం

- ఎన్నికల్లో బిజెపిని తిరస్కరించిన ప్రజలు
- మతతత్వ రాజకీయాలకు కట్టడి
- రాజ్యాంగ పరిరక్షణకు ఓటు
- బాబు, నితీష్ ఆలోచించుకోవాలి
- దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరిస్తున్న బిజెపి
- సిపిఎం విస్తృత సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి



సిపిఎం రాష్ట్ర విస్తృత సమావేశం ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎంఎబేబి. వేదికపై బివి రాఘవులు, విశ్రీనివాసరావు, ఎంఎ గపూర్, పి మధు, రాంభూపాల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


కేంద్రంలో గత పదేళ్లుగా బిజెపి, మోడీ అనుసరించిన మతతత్వ రాజకీయాలను, రాజ్యాంగ విధ్వంసాన్ని సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారని, అందువల్లే బిజెపి గతం కంటే గణనీయంగా సీట్లు కోల్పోయిందని, సొంతంగా ప్రభుత్వ ఏర్పాటుకు మెజారిటీ రాలేదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబీ అన్నారు. రెండు రోజులపాటు జరిగే సిపిఎం రాష్ట్ర విస్తృత సమావేశం శుక్రవారం ఉదయం వడ్డేశ్వరంలోని సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో ప్రారంభమైంది. సమావేశ ప్రారంభసూచకంగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు వై.కేశవరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభలో ఎం.ఎ.బేబీ మాట్లాడుతూ గత పదేళ్లుగా తీవ్ర మతోన్మాద విధానాలు అనుసరించిన బిజెపి, సంఘపరివార్ శక్తులకు ఈ ఎన్నికల్లో అడ్డుకట్ట పడిందని అన్నారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్‌ను నెలకొల్పి 2025లో వందేళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో దేశంలో హిందూ రాజ్యాన్ని ఏర్పాటు చేసేందుకు బిజెపి విశ్వప్రయత్నాలు చేసిందని పేర్కొన్నారు. దీనిలో భాగంగా దేశంలో ఉన్న ఇతర ప్రాంతీయ పార్టీలను కలుపుకుని మెజార్టీ సాధించాలని ప్రయత్నించిందన్నారు. అయితే దేశంలో అనేక పార్టీలు బిజెపి తీరును తీవ్రంగా వ్యతిరేకించాయని, వ్యతిరేకించిన ఇద్దరు సిఎంలను జైల్లో పెట్టించి నియంతృత్వంగా వ్యవహరించిందని విమర్శించారు. వీటిని ప్రజలు సహించలేదని, రాజ్యాంగాన్ని మార్చి మత రాజ్యాన్ని ఏర్పాటు చేయాలన్న బిజెపి, సంఘ పరివార్ కుయుక్తులను ప్రజలు ఎన్నికల్లో అడ్డుకున్నారని తెలిపారు. గతం కంటే బిజెపి పార్లమెంటులో 20 శాతం సంఖ్యాబలాన్ని కోల్పోయిందని అన్నారు. అయితే టిడిపి, జెడియు లాంటి పార్టీల భుజాలపైకెక్కి బిజెపి స్వారీ చేస్తోందని, వారు పునరాలోచించుకోవాలని కోరారు. ఒక్కసారి బిజెపితో పొత్తు పెట్టుకుంటే ధృతరాష్ట్ర కౌగిలిలో ఇరుక్కున్నట్లేనని హెచ్చరించారు. బిజెపి ఫాసిస్టు విధానాలను అర్థం చేసుకోలేని కొన్ని ప్రాంతీయ పార్టీల వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో బిజెపి ఓట్లు పెరిగాయని, దీని ప్రభావాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి అప్రమత్తం కావాలని అన్నారు. కేరళలో బిజెపి గెలిచిన త్రిస్సూర్‌లో కాంగ్రెస్ ఓట్లు తగ్గాయని, లెఫ్ట్ ఓట్లు చెదరలేదని, దీన్నిబట్టి కాంగ్రెస్ ఓట్లు బిజెపికి బదిలీ అయినట్లు అర్థమవుతోందని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లో గతంలో ఉన్న బిజెపి సీట్లు తగ్గాయని, ఆ పార్టీకి రాజకీయ అస్త్రంగా మారిన అయోధ్యలో బిజెపి అభ్యర్థి ఓడిపోయారని పేర్కొన్నారు. ఒకవైపు పార్లమెంటులో పూర్తి మెజార్టీ లేకపోయినా నియంతృత్వ విధానాలను బిజెపి కొనసాగిస్తోందని, 150 మంది ఎంపిలను ఒకేసారి సస్పెండ్ చేసిన ఓం బిర్లా లాంటి వ్యక్తిని మరలా స్పీకర్‌ను చేసిందని సంఘపరివార శక్తులకు మంత్రివర్గంలో ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. బిజెపి ప్రమాదాన్ని ఎపిలో చంద్రబాబు, బీహార్లో నితీష్ గుర్తించాలని, లేకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. గత ఎన్నికలతో పోలిస్తే వామపక్షాలు, సిపిఎం స్వల్పంగా బలపడ్డాయని, వచ్చిన సీట్ల, ఓట్ల సంఖ్య పెరిగిందని అన్నారు. ఆ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై నిలబడి పోరాడాలని, మతతత్వ రాజకీయాలను ఎదుర్కోవాలని సూచించారు. రాష్ట్రంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యరేతికిస్తామని చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు దానిని కాపాడటం ఆయన బాధ్యతని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును, అమరావతి రాజధానిని పూర్తి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రిపై ఉందని అన్నారు. ప్రారంభ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, మాజీ ఎంపి పి.మధు పాల్గొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సమావేశాలకు ఎం.ఎ.గఫూర్, కె.లోకనాథం, డి.రామదేవి, పి.అప్పలనర్స అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. తొలుత పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సమావేశానికి ఆహ్వానం పలికి, నిర్వహణ కమిటీలను ప్రకటించారు.

హామీల అమలుకు షెడ్యూల్

- టిడిపి కూటమి ప్రభుత్వానికి సిపిఎం డిమాండ్

2

జిపిఎస్ అమలుకు గెజిట్ నోటిఫికేషన్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్)లోకి తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023 అక్టోబర్ 20 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది. జిపిఎస్ అమలు చేస్తూ జూన్ 12వ తేదీన జిఓ 54ను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఈ జిఓ బయటకు రాలేదు. ఇప్పుడు జిపిఎస్ చట్టం అమల్లోకి తీసుకొస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ గెజిట్ విడుదలపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సిపిఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) అమలు చేయాలని ఏళ్ల తరబడి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన నిర్వహిస్తున్నారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామన్న గత వైసిపి ప్రభుత్వం జిపిఎస్ పేరుతో కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ఈ విధానం సిపిఎస్ కంటే నష్టదాయకమని, దీనిని వెంటనే రద్దు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర ఆందోళనలు నిర్వహించారు. అయినా వైసిపి సర్కారు ఏకపక్షంగా జిపిఎస్ విధివిధానాలను తీసుకొచ్చింది. అయితే అమలుకు ఉత్తర్వులు విడుదల చేయలేదు.

సిపిఎస్/జిపిఎస్ విధానాన్ని పున:సమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచింది. ఇందుకు భిన్నంగా జిపిఎస్ అమలు చేసేందుకు జిఓను, గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

రద్దు చేయాలి : యుటిఎఫ్

9


త్వరలో 'తల్లికి వందనం' మార్గదర్శకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తల్లికి వందనం పథకం మార్గదర్శకాలు, విధి విధానాలను త్వరలోనే తెలియజేస్తామని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. అప్పటి వరకు ఎటువంటి అవాస్తవ కథనాలను నమ్మొద్దని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆధార్ నిబంధనలకు అనుగుణంగా ఈ నెల 9న జిఓ 29ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ జిఓ పేరుతో తల్లికి వందనం పథకంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అటువంటి వాటిని నమ్మొద్దని పేర్కొన్నారు. మార్గదర్శకాలు, విధి విధానాలను ప్రభుత్వం రూపొందించిన తరువాత తెలియజేస్తామని తెలిపారు.

కేజ్రీవాల్‌కు ఇడి కేసులో బెయిల్

- సిబిఐ కేసులో జైల్లోనే..



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. లిక్కర్ కేసులో తనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం, కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు పూర్తిస్థాయి విచారణ కోసం ఐదుగురు సభ్యుల విస్తృత ధర్మాసనానికి నివేదించింది. మొత్తం ఐదు షరతులతో సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చింది. సిఎం కార్యాలయాన్ని సందర్శించడానికి మిగతా 5లో

నెల్లూరులో ఉపాధి సంక్షోభం

- కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ మూసివేత

8

సుస్థిరాభివృద్ధిలో కేరళ అగ్రగామి

- ఆరో స్థానంలో ఎపి, తెలంగాణ
- నీతి ఆయోగ్ వెల్లడి

5

జగన్ సహా ఐదుగురిపై కేసు

- ఐపిఎస్‌లు సునీల్‌కుమార్, సీతారామాంజనేయులు పైనా..
- కస్టడీలో చంపబోయారని మాజీ ఎంపి రఘురామ ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ సిఎం వైఎస్ జగన్‌తో పాటు సిఐడి మాజీ డిజిపి వి.సునీల్‌కుమార్, ఇంటెలిజెన్స్ మాజీ అదనపు డిజిపి సీతారామాంజనేయులు, అప్పటి సిఐడి అదనపు ఎస్‌పి విజయ్‌పాల్, గుంటూరు జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిపై గుంటూరు నగరంపాలెం పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు శుక్రవారం వెలుగుచూశాయి. 2021 మే 14న విచారణ పేరుతో అదుపులోకి తీసుకున్న సిఐడి అధికారులు తనపై హత్యాయత్నం చేశారని, తీవ్రంగా కొట్టారని పేర్కొంటూ మాజీ ఎంపి, ప్రస్తుత ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణం రాజు ఫిర్యాదు చేశారు. తనను కస్టడీలోకి తీసుకున్న సిఐడి అధికారులు రబ్బర్ బెల్టు, లాఠీలతో కొట్టారని, కానీ కోర్టుకు, కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇచ్చారని, తనను తీవ్రంగా వేధించి, భయపెట్టారని, తనపై హత్యాయత్నం జరిగిందని ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటనపై గురువారం సాయంత్రం గుంటూరు నగరంపాలెం పోలీసులకు ఆయన ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. బైపాస్ సర్జరీ జరిగినట్టు చెప్పినా ఛాతిపై కూర్చుని తనను చంపడానికి ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్ పాస్‌వర్డ్ చెప్పాలని ఇష్టమొచ్చినట్టు కొట్టారని ఆరోపించారు. తనకు చికిత్స చేసిన జీజీహెచ్ డాక్టర్ ప్రభావతిపై కూడా పోలీసుల ఒత్తిడి మేరకు తప్పుడు మెడికల్ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ఆరోపణలు చేశారు. జగన్‌ను విమర్శిస్తే చంపుతామని సునీల్‌కుమార్ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు వైఎస్ జగన్, సునీల్‌కుమార్, సీతారామాంజనేయులు, విజయ్‌పాల్, డాక్టరు ప్రభావతిపై సెక్షన్ 120బి, 166, 167, 197, 307,326, 465, 508(34) ప్రకారం కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్‌పి తుషార్ దూడి పర్యవేక్షణలో డిఎస్‌పి కె.వి.మహేష్ ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.మధుసూధనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్‌పై ద్వేషంతోనే తప్పుడు కేసు : పొన్నవోలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ద్వేషంతోనే తప్పుడు కేసును బనాయించారని మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో రఘురామ కృష్ణరాజు అరెస్టు అంతా చట్ట ప్రకారమే జరిగిందన్నారు.

హామీల అమలుకు షెడ్యూల్

- టిడిపి కూటమి ప్రభుత్వానికి సిపిఎం డిమాండ్
- అమరావతి, పోలవరంతో పాటు ఇతర అంశాలకూ ప్రాధాన్యమివ్వాలి
- ప్రజల కోసం ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం
- బిజెపి విషయంలో టిడిపి, జనసేన, వైసిపి వైఖరి ఒక్కటే
- పొంచి ఉన్న మతతత్వ ప్రమాదం
- లౌకిక వాదులను కూడగట్టి విశాల వేదికల ఏర్పాటు


సిపిఎం రాష్ట్ర విస్తృత సమావేశం ప్రారంభ సూచికంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు కేశవరావు, చిత్రంలో ఎంఎ బేబీ, బివి రాఘవులు, వి శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగుదేశం, కూటమి పార్టీల నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు, సూపర్ సిక్స్ పథకాల అమలుకు షెడ్యూలు ప్రకటించాలని సిపిఎం డిమాండ్ చేసింది. శుక్రవారం వడ్డేశ్వరంలో ప్రారంభమైన పార్టీ రాష్ట్ర విస్తృత సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీర్మానం ప్రతిపాదించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి ఇచ్చిన హామీలు, చేసిన వాగ్దానాల అమలును వెంటనే ప్రారంభించాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల సంక్షేమానికి ప్రకటించిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీలో భాషా వలంటీర్లు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, అసంఘటిత కార్మికుల సంక్షేమం, కనీస వేతనాలు, కార్మిక చట్టాల అమలుపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలని అన్నారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమ బోర్డు, ప్రమాదకర ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కిందిస్థాయి ఉద్యోగులను బలవంతంగా తొలగించడం, వేధించడం, రేషన్ డీలర్లను తొలగించడం, తమ పార్టీ వారిని నియమించుకునే పనులు చేస్తున్నారని అన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్లను స్థానిక సంస్థలకు బదలాయిస్తామని ప్రకటించారని, ప్రతిపక్షాలపై కక్షపూరితంగా వ్యవహరించబోమని ప్రజాస్వామ్య హక్కులను గౌరవిస్తామని తెలుగుదేశం ఉన్నత నాయకత్వం ప్రకటించిందని, మరోవైపు రెడ్‌బుక్ పేరుతో బెదిరింపులూ కొనసాగుతున్నాయని తెలిపారు. పాత ప్రభుత్వ కీలకస్థానాల్లో నియమించిన అనేక మంది ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను భారీగా ట్రాన్స్‌ఫర్లు చేసిందని, కొందరిని లూప్‌లైన్లో పెడితే కొందరు రాజీనామా చేసి వెళ్లిపోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో విభజన హామీలు, కడప స్టీలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ప్రస్తావన చేయలేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం తెలుగుదేశం, జెడియుపై అధారపడి ఉందని, నితీష్‌కుమార్ ప్రత్యేక హోదా డిమాండు చేస్తుంటే చంద్రబాబు నోరెత్తడం లేదని అన్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలుగుతుందని పేర్కొన్నారు. ఉక్కుపై తెలుగుదేశం కేంద్రంతో రాజీపడిందని వార్త రాసిన డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై విశాఖలో టిడిపి కార్యకర్తలు దాడి చేశారని అన్నారు. రాష్ట్రంలో జనసేన ముఖ్యపాత్ర పోషిస్తోందని, అదే సమయంలో బిజెపి, జనసేన మధ్య బంధం బలపడుతోందని తెలిపారు. జనసేన యువతను ఉపయోగించుకుని బలపడేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని, పవన్ మాట్లాడుతున్న తీరు, వాడుతున్న భాష బిజెపి మతోన్మాదానికి ఊతమిచ్చేలా ఉందని పేర్కొన్నారు.

సరళీకరణ విధానాలను చురుగ్గా ప్రతిఘటించాలి

కొత్త ప్రభుత్వం సరళీకరణ విధానాలు చురుకుగా అమలు చేసే అవకాశం ఉందని, ప్రజలకు హాని చేసే అంశాలపై పార్టీ, ప్రజా సంఘాలు చురుకుగా ప్రతిఘటించాలని అన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు హిందూత్వ భావజాలాన్ని వ్యాపింపజేసేందుకు మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు అధికారంలో భాగస్వామ్యాన్ని ఉపయోగించుకుని ప్రయత్నిస్తాయని, వాటి ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు లౌకికశక్తులను కూడగట్టి విశాల ఐక్యవేదికను నిర్మించాలని తెలిపారు. రాష్ట్రాల హక్కులను కాలరాసే కేంద్ర విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని తెలిపారు. టిడిపి, జనసేన, వైసిపిలు బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్న ప్రమాదకర వైఖరిని బట్టబయలు చేయాలని సూచించారు. ప్రజలను వేధిస్తున్న తక్షణ సమస్యలపై ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులు, ప్రజా రంగాల్లో పనిచేస్తున్న పార్టీ కార్యకర్తలు చురుకుగా కదిలి, ఆందోళనలు పోరాటాలు నిర్వహించాలని, ప్రజలకు అండగా నిలబడాలని కోరారు. కొత్త ఇసుక పాలసీలో రవాణా, లోడింగ్, జిఎస్‌టి, సహా హ్యాండ్లింగ్ ఛార్జీలతో వినియోగదారులకు తక్కువ ఉపశమనం కలుగుతోందని అన్నారు. మెగా డిఎస్‌సి ప్రకటించినా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు న్యాయం జరిగే విధంగా వ్యవహరించలేదని తెలిపారు. జిఓ3ను పునరుద్ధరించి స్పెషల్ డిఎస్‌సిని నిర్వహించాలని నిరుద్యోగులు మంత్రికి విన్నవించారని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం యువతలో అనేక ఆశలు కల్పించిందని, డ్రగ్స్ నిరోధంపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధ్యతను విస్మరించిన వైసిపి

ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసిపి తన బాధ్యతను విస్మరించిందని, ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించకపోతే అసెంబ్లీకి రాను అని జగన్ చెప్పడం బాధ్యతారాహిత్యమైన చర్యని పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని వ్యతిరేకిస్తూనే, అది భాగస్వామిగా ఉన్న కేంద్రాన్ని బలపరుస్తున్నారని తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ కేంద్రానికి అంశాలవారీ మద్దతు ప్రకటించిందని, స్పీకర్ ఎన్నికల సమయంలోనూ మద్దతు ప్రకటించిందని తెలిపారు. డిప్యూటీ స్పీకర్‌ను ప్రతిపక్షాలను కేటాయించాలన్న సాంప్రదాయాన్ని పాటించే విషయంలో తెలుగుదేశం, జనసేన మౌనంగా ఉన్నాయని విమర్శించారు. బిజెపి విషయంలో రాష్ట్రంలో ఉన్న మూడు ప్రాంతీయ పార్టీల వైఖరుల్లో ఎటువంటి మార్పులేదని అన్నారు. పరిపాలనలో భాగస్వామ్యంగా ఉండటం రాష్ట్ర ప్రయోజనాలతోపాటు, రాజ్యాంగ మౌలిక లక్ష్యాలకు దెబ్బ తగులుతుందని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర హక్కులు, అభివృద్ధి, లౌకికతత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటాన్ని కొనసాగించాలని సూచించారు.

రాజధాని నిర్మాణంలో జాగు వద్దు

అమరావతి రాజధాని, పోలవరం ప్రాధాన్యతగా ప్రకటించారని, మాస్టర్‌ప్లాను పేరుతో జాగు చేయకుండా రాజధాని అవసరాల మేరకు సౌకర్యాలను తక్షణం ఏర్పాటు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని, భవిష్యత్‌లో అనిశ్చితికి తావులేని విధంగా చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐదు సంవత్సరాల్లో పూర్తయ్యే పనులు పూర్తి చేయాలన్నారు.

నిర్వాసితులకు భరోసా కల్పించలేదు

గత ప్రభుత్వ తప్పుడు విధానాలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నారని, దీనిలో పోలవరం నిర్వాసితులకు ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పించలేకపోయిందని అన్నారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చెబుతున్నా దానిపై విచారణకు సిద్ధపడటం లేదని పేర్కొన్నారు. అమరావతి, పోలవరమే కాకుండా రాష్ట్రాభివృద్ధికి సమగ్రమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రత్యేకించి వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో స్మార్ట్ మీటర్లు, విద్యుత్ భారాల తగ్గింపుపై హామీనిచ్చినా శ్వేతపత్రంలో వాటి ప్రస్తావన లేదని అన్నారు. అదానీ లాంటి కంపెనీలకు భూముల కేటాయింపు, తప్పుడు కేటాయింపులపై సమీక్షకు ఈ ప్రభుత్వం సిద్ధపడటం లేదని అన్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణను విరమించుకోవాలి

- పోరాట కమిటీ



ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1247వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ట్రాఫిక్ విభాగం, ఆర్‌ఎండి, కన్‌స్ట్రక్షన్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి తన పర్యటనలో ఉక్కు కార్మికులు, కర్మాగారం పట్ల మంచి ఉద్దేశాన్ని కలిగి ఉన్నామని చెప్పడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా త్వరితగతిన ప్రధానితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇప్పటికే కేంద్రం పలు ఆంక్షలు విధించి ప్లాంట్‌కు రా మెటీరియల్ అందకుండా చేస్తోందన్నారు. పూర్తి స్థాయిలో ఉత్పత్తి జరగకపోవడంతో ప్లాంట్ నష్టాలబారిన పడుతోందన్నారు. ప్రజల ఆకాంక్షను గుర్తెరిగి ప్లాంట్ పరిరక్షణకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాసరావు, లక్ష్మణరావు, హరనాథ్ పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ సభ్యులు గంగయ్య మృతి

ప్రజాశక్తి - చీరాల (బాపట్ల జిల్లా)

సిపిఎం సీనియర్ సభ్యులు, పోస్టల్ యూనియన్ నాయకులు గండూరి గంగయ్య (78) అనారోగ్యంతో శుక్రవారం వేకువజామున బాపట్ల జిల్లా చీరాలలో ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయన మరణానికి సిపిఎం, సిఐటియు నాయకులు సంతాపం తెలిపారు. వివిధ ఉద్యోగ, కార్మిక ఉద్యమాల్లో గంగయ్య కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సిపిఎం చీరాల డివిజన్ కమిటీ సభ్యునిగా చీరాల పట్టణంలో జరిగిన ఇళ్ల స్థలాల ఆందోళనలు, పోస్టల్, మున్సిపల్ కార్మికుల ఆందోళనల్లో పాల్గొన్నారు. ఆయన అంత్యక్రియలలో సిపిఎం నాయకులు పి.కొండయ్య, ఏం వసంతరావు, నారపరెడ్డి పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో ప్రజాసంఘాల నాయకులు డి.నాగేశ్వరరావు, ఎం.రాంబాబు, కోటయ్య, ఆంజనేయులు,. బి.శ్రీనివాసరావు, బి.సుబ్బారావు ఉన్నారు.

నేడు సిఎం ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఉదయం 9:15 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విడుదల చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 7306199999 ద్వారా ఫిర్యాదు చేసిన వారి నుంచి చంద్రబాబు వినతులు స్వీకరించనున్నారు. ఫిర్యాదులు చేసినవారు ఉదయం 9:15 లోపు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని టిడిపి కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదులు చేసిన వారు ముఖ్యమంత్రిని కలిసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు.

సిఇఒగా వివేక్ యాదవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిగా 2008 బ్యాచ్ ఐఎఎస్ అధికారి వివేక్ యాదవ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ శర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఎన్నికల ప్రధానాధికారిగా ఎంకె మీనా వ్యవహరించారు.

తక్షణం రోడ్ల మరమ్మతులు

- అత్యవసర పనులకు టెండర్లు
- చంద్రబాబు ఆదేశం


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో తక్షణం రోడ్ల మరమ్మత్తు పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం ఆయన రోడ్ల భవనాల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రోడ్లపై కనీసం గుంతలు కూడా పూడ్చకుండా పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని అన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు. ఆ పరిస్థితిని ఇప్పుడు పూర్తిగా మార్చివేయాలన్నారు. రోడ్లపై వున్న గుంతల పనులు వెంటనే చేపట్టాలన్నారు. అత్యంవసరంగా బాగు చేయాల్సిన రోడ్లపైనా దృష్టి పెట్టాలని సూచించారు.

అత్యవసర పనుల కోసం వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని సూచించారు. రోడ్ల మరమ్మతులు, నిర్మాణంలో కొత్త, మెరుగైన సాంకేతికతను వినియోగించే విషయంపై ఈ సందర్భంగా ఐఐటి ప్రొఫెసర్‌లతో ముఖ్యమంత్రి చంద్రబాబు చర్చించారు. తిరుపతి ఐఐటి, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు, ప్రభుత్వ అధికారులు, నిర్మాణ రంగ నిపుణులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. తక్కువ ఖర్చుతో, మన్నిక ఉండేలా రోడ్ల నిర్మాణానికి జరిగిన పరిశోధనల వివరాలను సమీక్షలో వారు ముఖ్యమంత్రికి వివరించారు. సాంప్రదాయ పద్ధతిలో కాకుండా పలు రకాల మెటీరియల్స్ ఉపయోగించి రోడ్ల నిర్మాణం చేపడితే కలిగే ప్రయోజనాలను చెప్పారు. నేల తీరు, ట్రాఫిక్ రద్దీ, వర్షాలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందన్నారు. వర్షాకాలంలో కూడా రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టే సాంకేతికపైనా నిపుణులు సాధ్యాసాధ్యాలను వివరించారు.

7,087 కి.మీ మేర తక్షణమే పనులు

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 7,082 కి.మీ మేర తక్షణమే పనులు చేపట్టాల్సిఉందని సిఎం దృష్టికి తీసుకువచ్చారు. 4,151 కిలోమీటర్ల మేర రోడ్లపై గుంతల సమస్య ఉందని, తక్షణమే మరమ్మతులు చేయాల్సిన రోడ్లు మరో 2,936 కిలోమీటర్లు మేర ఉన్నాయని వివరించారు. వీటి కోసం కనీసం రూ 300 కోట్ల నిధులు అవసరమౌతాయని తెలిపారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బి శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

తీర ప్రాంత కోత ప్రమాద నివారణపై దృష్టి

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్
- ఎన్‌సిసిఆర్, ఎపిసిజడ్ఎంఎ మధ్య అవగాహన ఒప్పందం


పవన్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి 973 కిలోమీటర్లు సుదీర్ఘ సముద్ర తీరం ఒక వరమని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అన్నారు. రాష్ట్రంలో సముద్రపు కోత ప్రమాదాన్ని నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. మంగళగిరిలోని నివాసంలో నేషనల్ సెంటర్ ఫర్ కోస్టర్ రీసెర్చ్ (ఎన్‌సిసిఆర్) తయారుచేసిన ప్రణాళికను పవన్‌కల్యాణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన సమక్షంలో ఎన్‌సిసిఆర్, ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీలు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ సమావేశంలో పిసిబి సభ్య కార్యదర్శి బి శ్రీధర్, అటవీశాఖ ఉన్నతాధికారులు శరవణన్, పివి చలపతిరావు, ఎన్‌సిసిఆర్ శాస్త్రవేత్తలు ఎంవి రమణమూర్తి, వి రామనాథన్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు

ఇంటింటికీ కుళాయి ద్వారా ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు సరఫరా చేయడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో మంగళగిరిలోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ప్రపంచ బ్యాంకు జలవనరుల విభాగం సలహాదారు రమేష్‌ముకల్లా, మాథ్యుస్ ముల్లికల్ పాల్గొన్నారు.

ఎస్ఎల్ఆర్ఎం పైలెట్ ప్రాజెక్టుగా పిఠాపురం

చెత్తతో గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.2,643 కోట్ల సంపద సృష్టితో పాటు 2.45 లక్షల మందికి ఉపాధి కల్పించవచ్చని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఇందుకు సంబంధించిన పైలెట్ ప్రాజెక్టును పిఠాపురంలో ప్రారంభిస్తామన్నారు. ఘన, ద్రవ వ్యర్థాలను 12 గంటల్లోపు సేకరించగలిగితే సంపద వస్తుందని, వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయంగా చేపట్టాలని తెలిపారు. తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రధాన కార్యాలయంలో ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్టు గురించి గార్బేజ్ టు గోల్డ్ పేరుతో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవం సందర్భంగా పవన్‌కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలను గత పాలకులు నిర్వీర్యం చేశారని, బ్లీచింగ్ పౌడర్‌కు కూడా డబ్బులు లేని పరిస్థితి తీసుకొచ్చారన్నారు. ఈ సమీక్షలో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనరు కన్నబాబు, ఎస్-ఎల్ఆర్ఎం ప్రాజెక్టు డైరెక్టరు సి శ్రీనివాసన్ పాల్గొన్నారు.

అన్ని అనర్థాలకూ కారణం ఆ ఐఎఎస్‌నే..

పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో ఏ సమీక్ష చేసినా అన్ని అనర్థాలకూ ఒక ఐఎఎస్ కారణమని చెబుతున్నారని, ఆయన ప్రస్తుతం సర్వీసులో లేరని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఎవరిని బాధ్యులను చేయాలి? ఎలా రికవరీ చేయాలి? కేవలం కేసులు పెట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలంతేనన్నారు. గ్రామీణ రోడ్లు కోసం మ్యాచింగ్ గ్రాంటు కూడా ఇవ్వలేదని, ప్రభుత్వం గ్రాంట్ రిలీజ్ చేయకపోవడంతో మన రాష్ట్రానికి రావాల్సిన నిధులు విడుదల కాలేదన్నారు.


సచివాలయంలో వ్యవసాయమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అచ్చెన్నాయుడు

23 నుంచి 'పొలం పిలుస్తోంది'

- మత్స్యకారులకు డీజిల్ రాయితీ పథకం పునరుద్ధరణ
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 23 నుంచి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో నాలుగు నెలలపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు అవసరమైన అన్ని రకాల వ్యవసాయ పరికరాలు, పనిముట్లు అందజేస్తామన్నారు. సచివాలయంలో శుక్రవారం ఆయన వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆరు ఫైళ్లపై తొలి సంతకాలు చేశారు. గత ప్రభుత్వం జారీ చేసిన జిఓలు 144, 217ను రద్దు చేస్తూ సంతకం చేసినట్లు మంత్రి తెలిపారు. మత్స్యకారులకు అందజేసే డీజిల్ రాయితీ పథకాన్ని పునరుద్ధరిస్తూ రూ.10 కోట్లు మంజూరు చేశారు. కౌలురైతులకు కార్డులు జారీ చేసే రుణాలు అందజేయడమే కాకుండా, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ, సహకారాలు అందజేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, మత్స్యశాఖ కార్యదర్శి అహ్మద్‌బాబు, పశు సంవర్ధకశాఖ కార్యదర్శి ఎమ్ఎమ్ నాయక్, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనరు హరికిరణ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

జర్నలిస్టులకు హెల్త్ స్కీం పొడిగింపు

- సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టరు హిమాన్షు శుక్లా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టరు హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టు హెల్త్ స్కీమ్‌ను పొడిగిస్తూ శుక్రవారం జిఓ నెంబరు 82ను విడుదల చేసిందని తెలిపారు. ఈ హెల్త్ స్కీమ్‌తో జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైతే ప్రతిసారీ రూ.2 లక్షల వరకు విలువ చేసే వైద్యసేవలు అందుతాయని తెలిపారు. ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లయినా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని జర్నలిస్టులు పొందవచ్చని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ తరహాలో వైద్య సేవలు పొందవచ్చన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా పొందే వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అదే విధంగా నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత ఓపి సేవలు కూడా పొందవచ్చని ఆయన వివరించారు. ఈ పథకానికి నందమూరి తారక రామారావు వైద్య సేవ ట్రస్ట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా వుందని, సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తారని తెలిపారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

భవనాల పటిష్టతపై ఐఐటి నిపుణులతో అధ్యయనం : మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో వివిధ దశల్లో నిలిచిపోయిన భవనాల పటిష్టతపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఆయా భవనాలను పట్టించుకోకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. తిరిగి నిర్మాణ పనులను ప్రారంభించే ముందు ఐఐటి నిపుణులతో కట్టడాల పటిష్టతపై అధ్యయనం చేయించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఫౌండేషన్ పూర్తి చేసుకున్న ఐకానిక్ భవనాలతో పాటు ఇతర నిర్మాణాలనూ ఐఐటి ఇంజినీర్లతో అధ్యయనం చేయిస్తామని, మరోవైపు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల క్వార్టర్ల పటిష్టత నిర్ధారణ కోసం ఐఐటి హైదరాబాద్‌కు బాధ్యతలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అమరావతిలో నిర్మాణాల కోసం గతంలో 47 మంది కన్సల్టెంట్స్‌ను నియమించగా, వారంతా వెనక్కి వెళ్లిపోయారన్నారు. మళ్లీ కన్సల్టెంట్ల నియామకం కోసం టెండర్లు పిలుస్తామన్నారు. సిఆర్‌డిఎలో గతంలో ఉన్న సిబ్బంది కంటే ప్రస్తుతం 528 మంది తక్కువగా ఉన్నారన్నారు. సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉండకూడదు

- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సరాఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా చూడాలని అధికారులను ఇంధన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడం, విద్యుత్ సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలని తెలిపారు. వ్యవసాయానికి నిరంతరం 9 గంటల విద్యుత్ సరాఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సంస్థల అధికారులతో కలిసి విద్యుత్ సరఫరాపై విజయవాడలోని విద్యుత్ సౌదలో శుక్రవారం ఆయన సమీక్షించారు. కోతలు లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను, ఉత్తమ సర్వీసు అందించేందుకు కృషి చేయాలని చెప్పారు. 33కెవి సబ్‌స్టేషన్లలో వచ్చే లో ఓల్టేజ్ సమస్యను కెపాసిటర్ బ్యాంక్స్ ఉపయోగించి పరిష్కరించాలన్నారు. అంతరాయాలపై డిస్కంలు రోజువారీ నివేదిక అందించాలని, వీటిని ప్రతి వారం సమీక్షించుకోవాలని చెప్పారు. లైన్‌మ్యాన్ నుంచి చీఫ్ ఇంజినీరు వరకు విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విద్యుత్ సరాఫరా, వినియోగదారుల సమస్యలు పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఉంటేనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. విద్యుత్ సరాఫరాలో ఎలాంటి అంతరాయాలుంటే వినియోగదారుడు నివేదించేలా కిందిస్థాయి నుంచి వ్యవస్థను పటిష్టపరచాల్సిన అవసరం ఉందన్నారు. దీనివల్ల విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు దోహదపతుందని పేర్కొన్నారు. ఆర్‌డిఎస్‌ఎస్, ఇతర అంశాలపైనా ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు, డిస్కంల సిఎమ్‌డిలు ఐ పృథ్వీతేజ్, కె సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

- యుఇఇయుతో గొట్టిపాటి

ప్రజాశక్తి-ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఇఇయు) నాయకులతో అన్నారు. సచివాలయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను యూనియన్ నాయకులు శుక్రవారం కలిశారు. విద్యుత్ ఉద్యోగులు, ఎనర్జీ అసిస్టెంట్లు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంత్రిని కోరారు. త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి సుదర్శన్ రెడ్డి, కోశాధికారి ఎల్ రాజు, నాయకులు నాయబ్ రసూల్, వెంకటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కారుకు నిప్పంటించుకుని వృద్ధుడు సజీవదహనం

ప్రజాశక్తి -పులివెందుల రూరల్ (వైఎస్ఆర్ జిల్లా)

మద్యం మత్తులో కారుకు నిప్పటించుకుని ఓ వృద్ధుడు సజీవదహనమయ్యారు. ఈ సంఘటన వైఎస్ఆర్ జిల్లా పులివెందులలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బొగుడిపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి (80) కొద్ది రోజులుగా మతిస్థిమితం కోల్పోయారు. ఈ క్రమంలో మద్యం మత్తులో తన కారులోకి వెళ్లి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నారు. కారు దహనమవ్వడాన్ని చూసిన స్థానికులు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో కారుతోపాటు ప్రభాకర్‌రెడ్డి దహనమయ్యారు. ఈ ఘటనపై పులివెందుల సిఐని వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు. సుమోటోగా కేసు నమోదు చేయాల్సిన పోలీసులు పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు.

సోలార్ పవర్‌పైనే గురి!

ఆ దిశగానే మూడో దశ విద్యుత్ సంస్కరణలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం అమలు చేయనున్న మూడో దశ విద్యుత్ సంస్కరణల్లో సోలార్ విద్యుత్‌కే ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మూడో దశ విద్యుత్ సంస్కరణలు అమలవుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా వెల్లడించిన విషయం తెలిసిందే. సోలార్ రంగంలో పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంచే విధంగా చర్యలు ఉంటాయని తెలిపారు. గృహ వినియోగదారులకు, వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం మొగ్గుచూపుతోంది. ఇంటిపై కప్పుపై కేంద్రప్రభుత్వ సోలార్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి పథకం అనుసంధానం ద్వారా విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని, అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ప్రజల నుంచి కొనుగోలు చేస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచింది. సోలార్ ద్వారా రోజు ఉత్పత్తి అయ్యే విద్యుత్ వినియోగదారునికి అవసరాలకు పోనూ మిగిలింది డిస్కంలకు అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్రప్రభుత్వం పిఎం సూర్యఘర్ కార్యక్రమం కింద ఇప్పటికే ఇళ్లకు రూఫ్‌టాప్ బిగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి ఒక కిలోవాట్ కనెక్షన్ కావాలంటే సోలార్ ప్యానెల్స్ బిగించినందుకు రూ.75వేలు, 2 కిలోవాట్‌కు రూ.1.5లక్షలు, 3 కిలోవాట్‌కు రూ.2.25లక్షల ఖర్చు



అవుతోంది. ఒక కిలోవాట్‌కు ప్రభుత్వ సబ్సిడీ కింద రూ.30వేలు, 2 కిలోవాట్‌కు రూ.60వేలు, 3కిలోవాట్‌కు రూ.78వేల సబ్సిడీ వస్తుంది. మిగిలిన మొత్తాన్ని వినియోగదారునికి బ్యాంకు రుణం అందిస్తుంది. ఐదేళ్ల పాటు బ్యాంకు ప్రతి నెలా వినియోగదారుని నుంచి ఈఎంఐ పద్ధతిలో వసూలు చేస్తుంది. అయితే ఈ పథకానికి వినియోగదారులు ఒప్పుకుంటారా? లేదా? అనే అనుమానం ప్రభుత్వ వర్గాల్లో ఉంది. కేంద్రం ఇచ్చే రాయితీకి అదనంగా రాష్ట్రప్రభుత్వం కూడా రాయితీ ఇస్తుందా అనే అంశం పరిశీలించాల్సి ఉంది. 2014-19 టిడిపి హయాంలో కూడా ఎన్టీఆర్ జలసిరి కింద వ్యవసాయ పంపుసెట్ల వద్ద సోలార్ ప్యానెల్స్ బిగించింది. రాయితీ పోనూ రైతుల నుంచి సుమారు రూ.50వేల వరకు వసూలు చేసింది. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సాహిస్తే ఈ ప్యానెల్స్ తయారు చేసే కంపెనీలకు డిమాండ్ పెరుగుతుంది. ఈ కంపెనీలకు ప్రభుత్వం ఏమైనా ప్రోత్సాహకాలు అందిస్తుందా అనేది చూడాలి. చంద్రబాబు చేపట్టిన రెండో దశ సంస్కరణల్లో కూడా సోలార్ విద్యుత్‌కే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. దీర్ఘకాలిక పిపిఎల పేరుతో పెట్టుబడీదారులకు భారీ రాయితీలు ఇచ్చి ప్రోత్సాహించారు.

సెకీ సంగతేంటి?

వ్యవసాయ పంపుసెట్లకు కూడా సోలార్ ప్యానెల్స్ బిగిస్తామని సిఎం వెల్లడించారు. అయితే వీటికయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తుందా? రైతులే భరించలా? అనేది చూడాల్సి ఉంది. పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్లను బిగించి రైతులకు ఉచిత వ్యవసాయ విద్యుత్‌ను 25ఏళ్ల పాటు అందిస్తామని గత వైసిపి ప్రభుత్వం అదానీ ఉత్పత్తి చేసే విద్యుత్‌ను తీసుకునేందుకు సోలార్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)తో అడ్డగోలుగా 7వేల మెగావాట్ల(మెవా) ఒప్పందం చేసుకుంది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి 3వేల మెవా సెకీ నుంచి రానుంది. పంపు సెట్లకు సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేస్తే ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్, సెకీ నుంచి వచ్చే విద్యుత్‌ను ప్రభుత్వం ఏం చేస్తుందో చూడాల్సి ఉంది. స్మార్ట్‌మీటర్లను, సెకీ ఒప్పందాన్ని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి తీవ్రంగా వ్యతిరేకించింది. సెకీ ఒప్పందాన్ని నాటి పిఎసి చైర్మన్, ప్రస్తుత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రంగా వ్యతిరేకించారు.



హిమాన్షు శుక్లా బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమాచార, పౌరసంబంధాల శాఖ డైరెక్టరుగా 2013 బ్యాచ్ ఐఎఎస్ అధికారి హిమాన్షు శుక్లా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండు, ఎన్‌టిఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, రెండో అంతస్తులోని సమాచారశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐఅండ్‌పిఆర్ శాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం శాఖాపరమైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సమాచార, పౌరసంబంధాలశాఖ అడిషనల్ డైరెక్టరు ఎల్ స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు పి కిరణ్‌కుమార్, తేళ్ల కస్తూరి, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీరు మధుసూదన్, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్లు సివి కృష్ణారెడ్డి, నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్లు ఎం భాస్కర్ నారాయణ, జివి ప్రసాద్, వెంకటరాజు గౌడ్, ఎఫ్‌డిసి జనరల్ శేషసాయి, ఐఅండ్‌పిఆర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్టయిపెండ్ రూ. 15వేలు ఇవ్వాలి

- శ్రీ వెంకటేశ్వర పశువైద్య విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

రూ. ఏడువేల నుంచి రూ.15 వేలకు స్టయిపెండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ మేరకు తరగతలు బహిష్కరించి క్యాంపస్ ప్రధాన బిల్డింగ్ ఎదుట పశువైద్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అంతకుముందు మెయిన్ బిల్డింగ్ నుంచి యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు జూనపూడి ఎజ్రా మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా రూ. ఏడు వేలు స్టైఫండ్ ఇస్తున్నారని, ప్రస్తుతం పెరిగిన ధరల నేపథ్యంలో రోజువారీ అవసరాలకు అది సరిపోవడం లేదన్నారు. స్టయిపెండ్‌ను రూ. 15వేలకు పెంచి, ప్రతి నెలా మొదటి తేదీన విద్యార్థుల అకౌంట్‌లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఆకాష్, వైస్ ప్రెసిడెంట్ పవన్‌నాయక్ పాల్గొన్నారు.

రొట్టెల పండుగకు సర్వం సిద్ధం

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

ఈ నెల 17 నుంచి ఐదు రోజులపాటు రొట్టెల పండుగ నిర్వహించనున్నట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులతో కలిసి దర్గాను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ..అధికారులు, ముస్లిం మతపెద్దలు, దర్గా కమిటీ సభ్యుల సూచనలు, సహాయ సహకారాలతో రొట్టెల పండుగను విజయవంతం చేస్తామన్నారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పనులు జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, బారాషాహీద్ దర్గా ఉత్సవ కమిటీ చైర్మన్ ఖాదర్ బాషా, ముస్లిం మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రాటెక్ ఘటనలో మరొకరు మృతి

- మూడుకు చేరిన మృతుల సంఖ్య

ప్రజాశక్తి - జగ్గయ్యపేట (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడలోని అల్ట్రాటెక్ బాలాజీ సిమెంట్ ఫ్యాక్టరీలో ఈ నెల 7న జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పరిటాల అర్జున్‌రావు (40) గురువారం అర్ధరాత్రి మరణించారు. ఆయనకు భార్య నాగలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో శాశ్వత ఉద్యోగి అయిన అర్జున్‌రావు మృతదేహాన్ని శుక్రవారం బూదవాడలోని స్వగృహానికి తీసుకొచ్చారు. అనంతరం గ్రామ సమీపంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అల్ట్రాటెక్ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆవుల వెంకటేష్ ఈ నెల 8న, బాణావతి స్వామి నాయక్ ఈ నెల 10న మరణించిన విషయం తెలిసిందే. ఇంకా తీవ్రంగా గాయపడిన 13 మంది గొల్లపూడిలోని ఆంధ్రా, తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.



పరిటాల అర్జున్‌రావు

పలువురు నివాళులు

అర్జున్‌రావు మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళు లర్పించారు. జగ్గయ్య పేట శాసన సభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, సిపిఎం నాయకులు దంతాల వెంకటేశ్వర్లు, షేక్ గౌస్‌మియా, కోట రవికుమార్, ఎస్.రామనాథం తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రూ.50 లక్షల చెక్కు అందజేత

ప్రమాదంలో గాయపడి మరణించిన అర్జునరావు కుటుంబ సభ్యులకు నందిగామ ఆర్‌డిఒ రవీంద్రరావు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ రూ.50 లక్షల చెక్కును అందజేశారు.



ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు

లభ్యం కాని బాలిక మృతదేహం

- పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన తల్లిదండ్రులు, బంధువులు

ప్రజాశక్తి-పగిడ్యాల (నంద్యాల)

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ఎల్లాల గ్రామంలో హత్యకు గురైన బాలిక మృతదేహం ఇప్పటి వరకూ లభ్యం కాలేదు. మృతదేహం కోసం శుక్రవారమూ గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులైన ముగ్గురు బాలురను ముచ్చుమర్రి గ్రామానికి పోలీసులు తీసుకొచ్చి గ్రామ పరిధి కెసికెనాల్ గట్టు వెంట గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ ప్రజలు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చారు. డిఐజి వాహనాన్ని, పోలీసు బృందాలను గ్రామస్తులను అడ్డుకుంటారని భావించి నిందితులను ముచ్చుమర్రి గ్రామంలోకి తీసుకురాకుండా వనములపాడు, పగిడ్యాల మీదుగా నందికొట్కూరుకు పోలీసులు తరలించారు. ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌ను బాలిక కుటుంబసభ్యులు, బంధువులు ముట్టడించారు. దాదాపు వారం రోజులవుతున్నా బాలిక మృతదేహం ఇంత వరకు లభ్యం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా అమ్మాయి మృతదేహాన్ని మాకు అప్పజెప్పండి..నిందితుల కుటుంబాల జోలికి వెళ్ళబోమని, మాకు మా పాప మృతదేహాన్ని అప్పజెప్పితే చాలు" అని పోలీసులని కోరారు. శనివారం ఉదయం కల్లా సమస్యను పరిష్కరిస్తామని ఎస్ఐ జయశేఖర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతురాలి కుటుంబ సభ్యులను రాష్ట్ర మహిళా కమిషనర్ సభ్యులు రుకియా బేగం పరామర్శించారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నిందితులను శిక్షించాలని విద్యార్థి సంఘా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

ఎకోఫీ, మహీంద్రా సంస్థ భాగస్వామ్యం

ముంబయి : విద్యుత్ వాహనాలు, సోలార్ రంగాల్లోని చిన్న, మధ్యతరహా సంస్థలకు రుణాలు అందించే ఎకోఫి తాజాగా మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయినా మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ లిమిటెడ్ (ఎంఎల్ఎంఎంఎల్)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. దీంతో విద్యుత్ త్రిచక్ర వాహనాలకు వినూత్న ఫైనాన్సింగ్ సొల్యూషన్స్‌ను అందించనున్నట్లు పేర్కొంది. ఈ రంగంలో పెరుగుతున్న ఇవి త్రిచక్ర వాహనాల డిమాండ్‌కు ప్రోత్సాహాన్ని అందించాలని నిర్దేశించుకున్నట్లు ఎకోఫీ సహ వ్యవస్థాపకులు, సిఇఒ రాజశ్రీ నంబియర్ పేర్కొన్నారు. దేశంలో ఇవి త్రిచక్ర వాహనాల వినియోగాన్ని పెంచడం తమ భాగస్వామ్య ఉద్దేశ్యమని ఎంఎల్ఎంఎంఎల్ సిఇఒ సుమన్ మిశ్రా తెలిపారు.

ఎఐ టూల్స్‌తో ఒప్పో రెనో 12 సిరీస్ ఫోన్లు

న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ల తయారీ కంపెనీ ఒప్పో కొత్తగా ఎఐ టూల్స్‌తో కూడిన రెండు స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. కృత్రిమ మేధా కలిగిన రెనో12, రెనో 12ప్రో ఫోన్లను అందుబాటులోకి తెచ్చినట్లు శుక్రవారం ఆ సంస్థ తెలిపింది. ప్రధాన కెమెరా 50 ఎంపి టెలిఫోటో సహా 2ఎంపి, 8ఎంపి కెమెరాలతో ఆవిష్కరించినట్లు పేర్కొంది. సెల్ఫీ కోసం 32 ఎంపి కెమెరాను కలిగి ఉంది. రెనో 12 ప్రో 12జిబి ర్యామ్, 256జిబి స్టోరేజ్ ధరను రూ.36,999గా, 12జిబి, 256జిబి ఒప్పో రెనో ధను రూ.32,999గా నిర్ణయించింది.

కొవ్వాడ అణుపార్కు పనుల అడ్డగింత

- పూర్తి ప్యాకేజీ చెల్లించాలని నిర్వాసితుల డిమాండ్

ప్రజాశక్తి - రణస్థలం (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని కొవ్వాడ అణువిద్యుత్కేంద్రం పనులను గ్రామస్తులు, నిర్వాసితులు శుక్రవారం అడ్డుకున్నారు. అణువిద్యుత్కేంద్ర అధికారులు ఎస్.జి.ఆర్ పురం-టెక్కలి గ్రామ సరిహద్దుల్లో ప్రహరీ నిర్మాణం కోసం ఐదడుగుల వెడల్పు, ఐదు అడుగుల లోతుగా యంత్రాలతో సుమారు 20 మీటర్ల మేర తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న నిర్వాసితులు, యువకులు అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. నిర్వాసితులకు ఇస్తామన్న పూర్తి ప్యాకేజీ, పునరావాసం లేకుండా పనులు చేపట్టవద్దని స్పష్టం చేశారు. అణుపార్కు ఏర్పాటు కోసం భూములు, ఇళ్లు ఇచ్చామని, పరిహారం మాత్రం ఇంత వరకు చెల్లించలేదని తెలిపారు. పునరావాసం ఊసే లేకుండా పోయిందని వాపోయారు. ఇస్తామన్నవి ఇవ్వకుండా పనులు మాత్రం చేపడుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో తమకు ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. దీంతో అధికారులు పనులు నిలుపుదల చేసి వెనుదిరిగారు.



పనులను అడ్డుకున్న కొవ్వాడ గ్రామస్తులు

ఎన్నికల నెలల్లో భారీ వ్యయం

- రెండు నెలల్లోనే 49 వేల కోట్లు ఖర్చు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల నెలల్లో రాష్ట్రంలో భారీ వ్యయం నమోదైంది. ఏప్రిల్, మే నెలల్లోనే 49 వేల కోట్ల రూపాయలు ఖర్చు అయినట్లు అధికారులు తేల్చారు. ఇందులో సగం కన్నా ఎక్కువ నిధులను రుణాల రూపంలోనే సేకరించారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు, జిఎస్‌టి, సొంత పన్నులు మిగిలిన మొత్తంలో ఉంది. ఆర్థికశాఖలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారుల్లో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. 'నవరత్నాలకు సంబంధించిన ఆరు పథకాలకు చెల్లింపులపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించడంతో కొంత ఖర్చు తగ్గినట్లు కనిపిస్తోంది. లేదంటే మొత్తం వ్యయం 60 కోట్లు దాటిపోయి ఉండేది.' అని ఒక అధికారి వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో రూ.49,320 కోట్లు ఆదాయంగా సమకూరగా, అందులో పన్నుల ద్వారా 19,436 కోట్లు వచ్చింది. జిఎస్‌టి వాటాగా 8 వేల కోట్ల వరకు రాగా, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా 3,500 కోట్లు చేతికందాయి. ఎన్నికల నియమావళి కారణంగా కేంద్రం నుంచి గ్రాంట్లు గణనీయంగా తగ్గిపోయి కేవలం 1,800 కోట్ల వరకు మాత్రమే వచ్చాయని అధికారుఅలు అంటున్నారు. ఇదికాక, రెండు నెలల అవసరాలకుగాను ఏకంగా 27,209 కోట్లు రుణాలుగా సేకరించారు. ఇలా అన్ని కోణాల్లో సేకరించిన నిధులతో మొత్తం 49,406 కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. ఇందులో రూ. 49,292 కోట్లు రెవెన్యూ వ్యయంగానే ఖర్చు అయింది.

తొలి రెండు నెలల్లో ఆదాయ, వ్యయాల వివరాలు (రూ. కోట్లలో)

విభాగం	2024-25
మే వరకు	
మొత్తం ఆదాయం	49,320
పన్నుల ద్వారా	19,436
జిఎస్‌టి	8,101
సేల్స్‌టాక్స్	2,975
స్టేట్ ఎక్సయిజ్	2,573
పన్నుల్లో వాటా	3,500
కేంద్ర గ్రాంట్లు	1,811
అప్పులు	27,209
మొత్తం వ్యయం	49,406
రెవెన్యూ వ్యయం	49,292
కేపిటల్ వ్యయం	1,114

ఏసర్ బ్రాండ్‌తో ఇండ్‌కల్ టెక్నాలజీ జట్టు

న్యూఢిల్లీ : సాంకేతిక సంస్థ అయిన ఇండ్‌కల్ టెక్నాలజీస్ కొత్తగా గ్లోబల్ ఐటిసి దిగ్గజం ఏసర్ సంస్థతో ట్రేడ్‌మార్క్ లైసెన్సింగ్ ఒప్పందం కుదర్చుకున్నట్లు తెలిపింది. దీంతో స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. ఈ ఒప్పందంతో ఇండ్‌కల్ భారతదేశంలో ఏసర్ బ్రాండ్ క్రింద స్మార్ట్ ఫోన్ల రూపకల్పన, తయారీ, పంపిణీ చేస్తుందని ఇండ్‌కల్ టెక్నాలజీస్ సిఇఒ ఆనంద్ దూబే తెలిపారు. ఈ వెంచర్ ద్వారా రూ.15,000- 50వేల మధ్య విలువ చేసే స్మార్ట్‌ఫోన్లపై దృష్టి సారించనున్నామన్నారు.

రాజమండ్రి, నెల్లూరుకు ఉబెర్ విస్తరణ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఉబెర్ తాజాగా తన సేవలను రాజమండ్రి, నెల్లూరుకు విస్తరించినట్లు ప్రకటించింది. తమ ద్విచక్ర వాహన సేవలు అయినా ఉబెర్ మోటోను ఆయా నగరాల్లో అందుబాటులోకి తెచ్చినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇది మా డ్రైవర్లకు గణనీయమైన ఆదాయ మార్గాలను సృష్టించే ప్రయత్నాలకు మద్దతును అందించనుందని ఉబెర్ ఇండియా రీజినల్ బిజినెస్ ఆపరేషన్స్ హెడ్ అభిషేక్ పాధ్యే తెలిపారు.

నికోన్ నుంచి సరికొత్త కెమెరా

హైదరాబాద్ : ప్రముఖ ఫోటోగ్రఫీ ఉత్పత్తుల కంపెనీ నికోన్ శుక్రవారం హైదరాబాద్‌లో తన జడ్6III ఫుల్ ఫ్రేమ్ మిర్రర్‌లెస్ కెమెరాను ఆవిష్కరించింది. దీని ద్వారా ఇమేజింగ్‌ను విప్లవాత్మకంగా మార్చనున్నట్లు నికోన్ ఇండియా ఎండి సజ్జన్ కుమార్ తెలిపారు. పూర్తి ఫ్రేమ్ మిర్రర్‌లెస్ కెమెరా పోర్ట్‌ఫోలియో పట్ల తమ నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. సరికొత్త ఈ కెమెరా ధరను రూ.2,47,990గా నిర్ణయిం చామన్నారు.

సంపాదకీయం


ప్రభుత్వ రంగంలోనే 'ఉక్కు'

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రశ్నే లేదని విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖామాత్యులు హెచ్‌డి కుమారస్వామి మీడియా సమావేశంలో పేర్కొనడం సంతోషకరమే! అయితే వెనువెంటనే ఆయన 'ప్రధాని అనుమతి లేకుండా ఈ విషయం నేను చెప్పలేను.. ఇక్కడి స్థితిగతులను ఆయనకు నివేదించి, ఈ కర్మాగారాన్ని ఎలా పునరుద్ధరించాలన్నది వివరించవలసి వుంద'ని అన్నారు. అంటే 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' అని నినదించి 32 మంది యువ కిశోరాల ప్రాణ త్యాగంతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా ఉండాలంటే ప్రధాని విస్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. దాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించాలి. ఇదీ జరగాల్సిన ప్రక్రియ. అదే రోజున విశాఖ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలాగైనా ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకుంటాం...అన్నారు కానీ ప్రైవేటుపరం కానివ్వం అని స్పష్టంగా పేర్కొనలేదు. గతంలో వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ప్రైవేటీకరణ ప్రయత్నాలు చేస్తే అప్పుడు దాన్ని నిలువరించి ఉక్కు ఫ్యాక్టరీకి మేలు చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించామని చంద్రబాబు చెబుతూ వచ్చారు. గురువారం కూడా ఆ విషయాన్ని గుర్తు చేశారు కానీ ఇప్పుడు 'ఉక్కు'ను కాపాడుకోవడం అన్నారు తప్ప ప్రైవేటు కానివ్వం అని లేదా ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూస్తాం అని స్పష్టంగా చెప్పకపోవడం సందేహాలకు తావిస్తుంది. వారి మద్దతుపైనే ఆధారపడిన ప్రభుత్వం కేంద్రంలో ఉన్న సమయంలో రాష్ట్రానికి ప్రతిష్టాత్మకమైన విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించేలా సిఎం పట్టుబట్టలేరా?

విశాఖ ఉక్కు కర్మాగారంలో ప్రభుత్వ వాటాలు అమ్మేసి ప్రైవేటుకు అప్పగిస్తామని కేంద్ర ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ శాఖ (దీపమ్) కార్యదర్శి ప్రకటన వెలువడినప్పటి నుండి గడచిన మూడున్నరేళ్లకు పైగా ఉక్కు కార్మికులు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. విశాఖ, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలతోబాటు యావత్ రాష్ట్రంలో ఆందోళనలు జరిగాయి. ఆ తరువాత కేంద్ర మంత్రులు ఎవరు మాటాడినా ప్రైవేటీకరణ తప్పదంటున్నారు కానీ ఆ పని చేయడానికి మాత్రం కేంద్రం సాహసించలేకపోయింది. ఇప్పుడు సాక్షాత్తూ ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి కార్మిక సంఘాల ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతూ 'విశాఖ స్టీల్‌ప్లాంటును పరిశీలించాను. దేశ ఆర్థిక అభివృద్ధికి ఈ ప్లాంట్ సహాయపడుతోందని దీనిపై ప్రధానికి వివరిస్తా.' అని తెలపడం శుభ పరిణామం. ప్లాంట్ మూతబడుతుందని ఎవరూ భయపడవద్దని కూడా ఆయనన్నారు. 'ఉక్కు' మూతబడుతుందన్న భయం ఎవరికీ లేదు. దాన్ని ప్రైవేటుపరం చేస్తారన్నదే అసలు భయం. అయితే, కుమారస్వామి స్థూలంగా భరోసా ప్రకటించినా స్టీల్‌ప్లాంట్‌కు కీలకమైన సొంత గనుల సంగతి ఏమిటి? లేక ముడి ఖనిజం ఎన్‌ఎండిసి నుండి సరఫరా చేస్తారా? మధ్యే మార్గంగా సెయిల్‌లో విలీనం చేస్తారా? వంటి విషయాలేమీ చెప్పనేలేదు. కనుక ప్రైవేటీకరణపై సందిగ్ధత కొనసాగుతున్నట్టే!

అశేష త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కాకుండా కాపాడడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. ఉక్కు కర్మాగారం, ఉద్యోగుల క్వార్టర్సు వున్న గాజువాక అసెంబ్లీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ లభించింది. కాబట్టి అధికార కూటమికి ఆ బాధ్యత మరింత పెరిగింది. అక్కడ గెలిచిన ఎమ్మెల్యే టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కూడా కావడం గమనార్హం. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు మూడున్నరేళ్లుగా పోరాడుతున్నారు. 'ఉక్కు'ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కేంద్రంలో టిడిపి మద్దతుపైనే ఆధారపడి ఎన్‌డిఎ సర్కారు మనుగడ సాగుతున్నందున దానిపై ఒత్తిడి తెచ్చి ఉక్కు ప్రైవేటీకరణను ఉపసంహరింపజేయడం తెలుగుదేశం పార్టీ విద్యుక్త ధర్మం. రాష్ట్ర ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులైన చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని, ప్రధానిని ఒప్పించి లేదా ఒత్తిడి తెచ్చి, అవసరమైతే వివిధ రాజకీయ పార్టీల సహకారం తీసుకొని ఏవిధంగానైనా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా చూడాలి. దాని మనుగడకు అవసరమైన సొంత గనులు, ముడి ఖనిజ లభ్యత, వర్కింగ్ క్యాపిటల్ తదితర సమస్యలనూ పరిష్కరించాలి. ఇది రాష్ట్ర ప్రజలందరి ఆకాంక్ష.

మహనీయుల మాట



మన విజయాన్ని అడ్డుకునేది
మనలోని ప్రతికూల ఆలోచనలే.
కింద పడ్డామని ప్రయత్నం ఆపితే
చేసే పనిలో ఎన్నటికీ
విజయం సాధించలేం.

-ఎ.పి.జె. అబ్దుల్ కలాం,
భారత పూర్వ రాష్ట్రపతి.

ఫ్రాన్స్ ఎన్నికల్లో పచ్చి మితవాదుల నిలవరింత

వ్యాఖ్య

ఫ్రాన్స్ ప్రజానీకం పార్లమెంటు ఎన్నికలలో పచ్చి మితవాద శక్తులకు వ్యతిరేకంగా ఓటు చేశారు. అనేక ఒపీనియన్ పోల్స్ చెప్పినదానికి భిన్నంగా లీపెన్ నాయకత్వంలోని నేషనల్ ర్యాలీ కేవలం 143 సీట్లు మాత్రమే తెచ్చుకోగలిగింది. న్యూ పాపులర్ ఫ్రంట్ పేరిట కొత్తగా ఏర్పాటైన వామపక్ష కూటమి 182 స్థానాలతో అతి పెద్ద గ్రూపుగా విజయం సాధించింది. అధ్యక్షుడు మాక్రాన్‌కు చెందిన ఎన్‌సెంబ్లె 163 సీట్లు తెచ్చుకుంది. ఈ అనిశ్చిత తీర్పు కారణంగా ఏ ఒక్క కూటమి గానీ పార్టీగానీ స్పష్టమైన మెజార్టీ సాధించలేకపోయాయి. న్యూ పాపులర్ ఫ్రంట్‌కు మెజార్టీకి వందకు పైగా సీట్లు తక్కువైనాయి. జూన్‌లో జరిగిన యూరోపియన్ పార్లమెంటు ఎన్నికలలో తన పార్టీ దెబ్బ తినడంతో మాక్రాన్ ఈ ఎన్నికలు జరిపించారు. ఇ.యు ఎన్నికల వెనువెంటనే వచ్చిన ఈ ఎన్నికలలో పచ్చి మితవాదుల పెరుగుదల పట్ల ఆందోళన చెందిన ఫ్రాన్స్ ప్రజానీకం దేశవ్యాపితంగా భారీ సంఖ్యలో కదం తొక్కారు. ఈ పచ్చి మితవాదుల విభజన విధానాలు అభివృద్ధి నిరోధక విధానాల పట్ల చాలా స్పష్టంగా వారు తమ వ్యతిరేకత ప్రకటించారు. అనేక వామపక్ష పార్టీలు ప్రజల ఆలోచనా ధోరణిని సరిగానే బేరీజు వేసి కూటమి కట్టి న్యూ పాపులర్ ఫ్రంట్‌గా ఏర్పడ్డాయి. జాన్ లూక్ మెలాంకన్ ఆధ్వర్యంలోని ఫ్రాన్స్ అన్‌బౌడ్, సోషలిస్టు పార్టీ, గ్రీన్స్, కమ్యూనిస్టులు ఈ న్యూ పాపులర్ ఫ్రంట్‌లో చేరాయి. అధికారానికి వస్తే అమలు జరిపే 150 అంశాల కార్యక్రమాన్ని కూడా ప్రకటించారు. ఈ కూటమి ఎన్నికలకు కొద్ది రోజు ముందే ఏర్పడినప్పటికి గట్టి ఫలితాలు సాధించగలిగింది. పచ్చి మితవాదులను నిలవరించగల శక్తిగా ముందుకొచ్చింది. తొలి దశ ఎన్నికలలో లీపెన్ పార్టీ 33.1 శాతం ఓట్లు తెచ్చుకుని ప్రథమ స్థానంలో నిలిచింది. దాని తర్వాత 28 శాతం ఓట్లతో న్యూ పాపులర్ ఫ్రంట్ నిలిచింది. 21 శాతం ఓట్లతో మాక్రాన్ గ్రూపు ఆ తర్వాత వచ్చింది. ఎవరికీ కచ్చితమైన మెజార్టీ రాకపోవడంతో రెండవ దశ పోలింగ్ అవసరమైంది. తొలి దశలో 12.5 శాతం ఓట్లు తెచ్చుకున్నవారు మాత్రమే పోటీ చేయడానికి అనుమతి లభించింది. దీనివల్ల పై మూడు కూటముల అభ్యర్థులకే పోటీ పరిమితమైంది. పచ్చి మితవాద పార్టీలపై ప్రజలకున్న వ్యతిరేకత కారణంగా పోటీ పడిన పార్టీలు వారిని ఓటమికి అనువైన ఎత్తుగడలు రూపొందించుకోవలసిన స్థితి ఏర్పడింది. తదనుగుణంగానే తొలిదశలో మూడవ స్థానంలో నిలిచిన 200 మంది అభ్యర్థులు విరమించుకున్నారు. అయినా మాక్రాన్ గ్రూపు అభ్యర్థులందరూ ఈ విధమైన సద్భావన కనబరచలేదు. వారిలో అనేకమంది మెలంకాన్ వామపక్ష వర్గమైన ఫ్రాన్స్ అన్‌బౌడ్, లీపెన్ నేషనల్ ర్యాలీ ఒకటేనంటూ పోటీ నుంచి తప్పుకోవడానికి నిరాకరించారు.

> లీపెన్ పార్టీ మెజార్టీ సాధించలేక పోయినప్పటికీ పార్లమెంటులో స్థానాలు దాదాపు రెట్టింపు చేసుకోగలిగింది. కరుడుగట్టిన మితవాద భావజాలం సమాజంలో ఎంత లోతుగా చొచ్చుకు పోయిందో ఒళ్లు గగుర్పొడిచేలా గుర్తు చేసే వాస్తవమిది. ఈ విభజనలు ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటు లోనూ తమ ప్రభావం చూపిస్తాయి. ముందస్తు ఎన్నికలకు వెళ్లడమనే తన వ్యూహం విఫలమైనా మాక్రాన్ ప్రభుత్వాధికారంపై తన పట్టు వదులుకోవడానికి సిద్ధంగా లేడు. వామపక్ష కూటమి ఏర్పాటు, ఎన్నికలలో అది ఇంత బలంగా రావడం ఆయన ముందుగా ఊహించి వుండకపోవచ్చు. ఆయన చేపట్టిన పలు విధానాల వల్లనే పచ్చి మితవాద శక్తులు పెరిగాయి గనక ఆయనకు ఆ భావజాలమేదో పెద్ద ప్రమాదంగా కనిపించదు. ఫ్రెంచి పాలక వర్గాలు కూడా వామపక్షాలు అధికారంలోకి రాకుండా చేయడం కోసం సహజంగానే మితవాదులైన కన్సర్వేటివ్‌లకూ పచ్చి మితవాదులకూ మధ్య పొత్తుకే మొగ్గు చూపుతాయి. అలాంటి కూటమితోనైతే నయా ఉదారవాద విధానాలు కొనసాగించుకో గలుగుతారు.

ప్రజల తీర్పు వెనక

ఇలాంటి అవరోధాలు ఎదురైనప్పటికీ ఫలితాలు చూశాక పచ్చి మితవాదులను మూడో స్థానానికి నెట్టినట్టు విదితమైంది. వారు అధికార పగ్గాలు చేపట్టకుండా ప్రజలు మరోసారి నిరోధించారు. పచ్చి మితవాదుల విధానాలపై ప్రజల ప్రతికూలతకు తోడు విశ్వసనీయమైన ప్రత్యామ్నాయాలు అందుబాటులో వుండటంతో వారిని ఓడించగలిగారు. జాతీయ అసెంబ్లీలో ఆధిక్యత వున్న మాక్రాన్ నయా ఉదారవాద నిర్దేశాలతో పొదుపు చర్యలు అమలు చేశారు. సంపన్నులపై పన్ను వేయడానికి నిరాకరించిన ప్రభుత్వం శ్రామిక ప్రజానీకంపై మాత్రం అన్ని రకాల పన్నులు మోగించింది. ఉద్యోగులు పదవీ విరమణ వయస్సు పెంచింది. పెన్షన్ సంస్కరణలు తెచ్చింది. ఈ చర్యలను కార్మికులు, రైతులు వ్యతిరేకించారు. భారీ ప్రదర్శనలు నిరతర పోరాటాలు నడిపారు. అనేక మాసాల పాటు సాగిన శ్రామిక పోరాటాలు, రైతులు నిర్వహించిన ఎల్లో వెస్ట్స్ (పచ్చ ఛాతీలు) ఉద్యమం మాక్రాన్ ప్రభుత్వంపై ప్రజాగ్రహాన్ని పెద్ద ఎత్తున ప్రతిబింబించాయి. ప్రభుత్వ విధానాలపై పెరిగిన అసంతృప్తి పైనే పచ్చి మితవాద శక్తులు పెరిగాయి. వలసదారులే ఈ సమస్యలన్నిటికీ మూల కారణమని నిందించాయి. ప్రజలలో జాతి మత విద్వేషం జొప్పించి సమాజంలో చీలికలు పెట్టాయి. వ్యవస్థను సమర్థించే సంప్రదాయ పార్టీలైన కన్సర్వేటివ్‌లు, సోషలిస్టుల వంటి పార్టీలన్నీ విఫలం కావడం, కమ్యూనిస్టులు పర్యావరణ వాదుల వంటి వారి బలహీనత కూడా ఇందుకు తోడై పచ్చి మితవాద పార్టీలు పుంజుకున్నాయి. లీపెన్ గానీ ఆమె పార్టీ గానీ పెన్షన్ సంస్కరణలనూ పదవీ విరమణ వయస్సు పెంపును ఏనాడూ వ్యతిరేకించింది లేదు. పాలక వర్గాలను సమర్థించే అనేక బడా కార్పొరేట్లు లీపెన్‌ను, ఆమె పార్టీని బలపర్చాయి. ఏది ఏమైనా ప్రజల్లో అసంతృప్తి వల్ల వామపక్షాలు ప్రయోజనం పొందకూడదని గట్టిగా పని చేశాయి.



న్యూ పాపులర్ వాగ్దానాలు

లీపెన్ నయా ఉదారవాద విధానాల పట్ల లీపెన్ విధేయత, దానికి తోడు ఆమె విభజన రాజకీయాలు ప్రజల్లో సందేహం పెంచాయి. ఒకసారి ఎన్నికల్లో అధికారానికి వస్తే అలాంటి పార్టీ తమ సమస్యలేవీ పరిష్కరించదు సరికదా సమాజ చట్రాన్ని విచ్ఛిన్నం చేసి కొత్త సమస్యలు తెస్తుందని వారు గుర్తించారు. ఫాసిజం, నాజీయిజం ఘోరాలు వారు మర్చిపోలేదు. మళ్లీ అలాంటి అవకాశం ఇవ్వడానికి సిద్ధం కాలేదు. న్యూ పాపులర్ ఫ్రంట్ తన ఆర్థిక ఎజెండా కారణంగానే ప్రజల ఆమోదం పొందగలిగింది. పచ్చి మితవాద శక్తులను ఎదుర్కొనడానికి అది సిద్ధంగా వుండటం కూడా కారణమైంది. కొన్ని సామాజిక సంక్షేమ కార్యక్రమాల పునరుద్ధరణ, కొన్ని నయా ఉదారవాద విధానాలను ప్రత్యేకించి పొదుపు చర్యలనేవాటిని ఉపసంహరిస్తామని వారు వాగ్దానం చేశారు. పదవీ విరమణ వయస్సు పెంపు తగ్గిస్తామన్నారు. పెన్షన్ సంస్కరణల రద్దు, సంపన్నులపై పన్ను విధింపు వంటి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ ఏర్పాటు ఎలా?

సమాజం ఎంతగా విచ్ఛిన్నమై వుందో కూడా ఫ్రాన్స్ ఎన్నికలు నిరూపించాయి. లీపెన్ పార్టీ మెజార్టీ సాధించలేక పోయినప్పటికీ పార్లమెంటులో స్థానాలు దాదాపు రెట్టింపు చేసుకోగలిగింది. కరుడుగట్టిన మితవాద భావజాలం సమాజంలో ఎంత లోతుగా చొచ్చుకు పోయిందో ఒళ్లు గగుర్పొడిచేలా గుర్తు చేసే వాస్తవమిది. ఈ విభజనలు ఇప్పుడు ప్రభుత్వ ఏర్పాటు లోనూ తమ ప్రభావం చూపిస్తాయి. ముందస్తు ఎన్నికలకు వెళ్లడమనే తన వ్యూహం విఫలమైనా మాక్రాన్ ప్రభుత్వాధికారంపై తన పట్టు వదులుకోవడానికి సిద్ధంగా లేడు. వామపక్ష కూటమి ఏర్పాటు, ఎన్నికలలో అది ఇంత బలంగా రావడం ఆయన ముందుగా ఊహించి వుండకపోవచ్చు. ఆయన చేపట్టిన పలు విధానాల వల్లనే పచ్చి మితవాద శక్తులు పెరిగాయి గనక ఆయనకు ఆ భావజాలమేదో పెద్ద ప్రమాదంగా కనిపించదు. ఫ్రెంచి పాలక వర్గాలు కూడా వామపక్షాలు అధికారంలోకి రాకుండా చేయడం కోసం సహజంగానే మితవాదులైన కన్సర్వేటివ్‌లకూ పచ్చి మితవాదులకూ మధ్య పొత్తుకే మొగ్గు చూపుతాయి. అలాంటి కూటమితోనైతే నయా ఉదారవాద విధానాలు కొనసాగించుకో గలుగుతారు.

మిగిలే వున్న ముప్పు

న్యూ పాపులర్ ఫ్రంట్‌లో అధికారం ఎలా పంచుకోవాలనే దానిపై ఏకాభిప్రాయం లేదు. ఫ్రంట్‌లో మెలంకాన్ పార్టీకి అత్యధిక సీట్లు వచ్చినా ఆయనను నాయకుడుగా ఆమోదించడానికి సోషలిస్టు పార్టీ, గ్రీన్స్ సిద్ధంగా లేవు. ఆర్థిక విధానాలపైనా కొన్ని తీవ్ర విభేదాలు వున్నాయి. మెలంకాన్‌ను అతి తీవ్ర వామపక్షంగా పెట్టుబడిదారీ వ్యతిరేకిగా పరిగణిస్తున్నారు. ఈ విభేదాలను ఉపయోగించుకుని వారిని వామపక్ష మధ్యేవాద కూటమికి నుంచి దూరంచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాంటి ప్రయత్నాలన్నీ ప్రజల తీర్పును అగౌరవ పర్చడానికే దారితీస్తాయి. ప్రజలు మాక్రాన్‌కూ లీపెన్‌కూ ఉభయులకూ వ్యతిరేకంగా ఓటేశారు. పచ్చి మితవాదానికీ నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ఓటేశారు. ఏ ప్రభుత్వ ఏర్పాటైనా ఈ వాస్తవాన్ని గౌరవించే విధంగా జరగాల్సి వుంటుంది. ఆ విధంగా మాత్రమే వారు ప్రజల ఆకాంక్షలు అందుకోగలుగుతారు. ఇందుకు మరే విధంగా భిన్నమైన అడుగువేసినా వినాశకరమవుతుంది. పచ్చి మితవాద శక్తులను బలోపేతం చేయడానికి దారితీస్తుంది. ఎందుకంటే పచ్చి మితవాద శక్తుల ముప్పును ప్రస్తుతానికి నిలవరించడమే గాని పూర్తిగా తొలగిపోలేదు.

(జులై 10 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ఆర్‌ఎస్‌ఎస్ హిందూత్వం విద్వేషపూరితం


విశ్లేషణ

> **ఆర్‌ఎస్‌ఎస్ సావర్కర్‌ను అనుసరించి...ఇస్లాం, క్రైస్తవ మతాలను విదేశీ మతాలుగా పరిగణిస్తూ, ప్రాచీన పవిత్ర మత గ్రంథాలను (మనుస్మృతి వంటివి) సమర్థిస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ తన మతంలో భాగంగా హింసను సృష్టించింది. తన ప్రధాన కార్యాలయం వివిధ ఆయుధాలను ప్రదర్శించి, దసరా పండుగ రోజున వాటికి పూజలు నిర్వహిస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ శాఖలు ఖిల్జీ, బాబర్, ఔరంగజేబు లాంటి ముస్లిం రాజులను క్రూర పాలకులుగా చిత్రించడం ద్వారా, రాణా ప్రతాప్, శివాజీ, పృథ్వీరాజ్ చౌహాన్ లాంటి హిందూ రాజులను కీర్తించడం ద్వారా ద్వేషాన్ని వ్యాప్తి చేశాయి. అన్ని మతాలకు చెందిన ప్రజలంతా జాతీయోద్యమంలో పాల్గొన్న కారణంగా ఆ ఉద్యమాన్ని కూడా ఆర్‌ఎస్‌ఎస్ విమర్శించింది.**

పాలక పార్టీ ప్రాధాన్యత మసకబారడం, ప్రతిపక్షం బలం పుంజుకోవడం లాంటి కారణాల రీత్యా నూతన పార్లమెంట్‌లో ప్రతిపక్షం తన స్వరాన్ని పెంచింది. ప్రారంభ సభను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించిన తరువాత జరిగిన చర్చలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యల్ని తన ప్రసంగంలో లేవనెత్తడం ద్వారా స్పందించారు. తన ప్రసంగంలోని ఒక (బహుశా తొలగించబడిన) భాగం హిందూ మతం స్వభావానికి సంబంధించినది. ఆయన చెప్పే దాని ప్రకారం, హిందూ మతం సత్యం, అహింసపై ఆధారపడి ఉంటుంది.

"భారతదేశం అహింసా మార్గాన్ని అనుసరించే దేశం, భయానికి సంబంధించిన దేశం కాదు. మన మహాపురుషులు అహింస గురించి, భయాన్ని అధిగమించే విషయం గురించి మాట్లాడారు."

"హిందువులమని చెప్పుకునే వారు రోజంతా హింస, ద్వేషం, అసత్యాల గురించే మాట్లాడుతున్నార"ని రాహుల్ గాంధీ బిజెపి ఎంపీల వైపు చూపిస్తూ మాట్లాడారు.



రామ్ పునియాని

అనేక మంది సాధువులు రాహుల్ గాంధీ ప్రకటనలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అహ్మదాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడి చేశారు. రాహుల్ గాంధీ, హిందువులందర్నీ హింసావాదులన్నారని, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అనుబంధ సంస్థలు పట్టణాలకు వెళుతున్నాయి. మరోవైపు హిందూ మతం అంటే సత్యం, అహింస, ప్రేమలపై ఆధారపడుతుందంటూ రాహుల్ గాంధీ వివరణ ఇచ్చారు. రాహుల్ గాంధీ, అతని కుటుంబ సభ్యులపై (అంటే మన దేశానికి ప్రధానమంత్రులుగా సేవలందించిన జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలపై)... ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్తలు విమర్శలు చేస్తూ, వీరి భావజాలం సత్యానికి దూరంగా ఉంటుందంటున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ మొదటితరం కేవలం మైనార్టీలు, వారి ఓటు బ్యాంకును కాపాడే విషయం గురించే ఆందోళన చెందుతూ వచ్చింది.

హిందూ మతం యొక్క మానవీయ కోణాన్ని వివరించిన రాహుల్ గాంధీకి 'ఇండియా' వేదికకు చెందిన వారు చాలా మంది మద్దతుగా నిలిచారు. ప్రస్తుతం హిందూ మతం, హిందూత్వ పద ప్రయోగం మధ్య కొంత సందిగ్ధత ఉంది. నెహ్రూ మతతత్వానికి వ్యతిరేక ప్రచార పనిని ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగానే ప్రారంభించాడని ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్తలు విమర్శిస్తున్నారు.

సోమనాథ్ దేవాలయాన్ని నాటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ప్రారంభించడాన్ని నెహ్రూ వ్యతిరేకించినందుకు కూడా వారు ఆయనను వ్యతిరేకిస్తున్నారు. దయానంద సరస్వతి, స్వామి వివేకానంద, బంకించంద్ర చటర్జీ, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీల నుండి ఆర్‌ఎస్‌ఎస్ హిందూత్వ ఏర్పడిందని వారు వాదిస్తారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి, దయానంద సరస్వతి, స్వామి వివేకానంద భావజాలానికి ఎలాంటి సంబంధమూ లేదు. కేవలం వారి భావజాలాన్ని కప్పిపుచ్చేందుకు మాత్రమే వారి పేర్లను ఉపయోగిస్తున్నారు.


హిందూ మతం - హిందూత్వ

హిందూ మతం అనేది ఒక ప్రవక్త ఆధారిత మతం కాదు కాబట్టి హిందూ మతం గురించి అనేక వివరణలు వున్నాయి. హిందూ మతానికి చెందిన పవిత్ర గ్రంథాలుగా భావించే వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత లేక మనుస్మృతులలో హిందూ అనే పదమే లేదు. ఈ పదాన్ని సింధూ పశ్చిమ ప్రాంతం నుండి వచ్చిన వారు సృష్టించారు. వారు "స" అనే శబ్దాన్ని "హ" గా పలకడం వలన "సింధూ", "హిందూ"గా మారింది. మొదట్లో ఈ పదం సింధూ నది నుండి సముద్రం వరకు వ్యాపించిన ప్రాంతాన్ని సూచించింది. ఇక్కడ వైదిక మతం, తంత్ర, అజివికాస్, నాథ్, శైవ, బౌద్ధ, జైన పూర్వ మత ధోరణులు కూడా ప్రధానంగా ఉన్నాయి.

తరువాత కాలంలో "హిందూ" అనే పదం ఇక్కడ ఉన్న విభిన్న ధోరణుల (జైన, బౌద్ధ మతాలను మినహాయిస్తే) సమ్మేళనంగా మారింది. బ్రాహ్మణ వాదాన్ని మినహాయించి, మిగిలిన ధోరణులను శ్రమణులు అన్నారు. బ్రాహ్మణవాదంలో కుల, లింగ శ్రేణీగత వ్యవస్థ ఉండడమే బ్రాహ్మణ మతానికి, శ్రమణులకు మధ్య ఉండే ప్రధానమైన వ్యత్యాసం. "హిందూ మతం" అనే పద నిర్మాణం గురించి ప్రముఖ చరిత్రకారుడు డి.ఎన్.ఝా, 2006లో జరిగిన ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌లో తన అధ్యక్షోపన్యాసంలో చక్కగా వివరించారు. "హిందూ అనే పదం వలస రాజ్యానికి ముందు భారతదేశంలో వాడుకలో ఉంది. కానీ ఇది 18వ శతాబ్దం చివరలో, 19వ శతాబ్దం ప్రారంభంలో లేదు. దీనిని బ్రిటీష్ స్కాలర్లు తమ స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నార"ని ఆయన పేర్కొన్నాడు. అప్పటి నుండి ఇది చాలా విస్తృత వినియోగంలో ఉంది. ఈ పదాన్ని ఉపఖండంలో సిక్కులు, జైనులు, బౌద్ధులు, ముస్లింలు, క్రైస్తవులు తప్ప అందరికీ ఉపయోగిస్తున్నారు.

కఠినమైన సరిహద్దులేమీ లేకపోవడం వల్ల బ్రాహ్మణ స్రవంతి వేదాలను, మనుస్మృతిని పవిత్రమైన గ్రంథాలుగా ముందుకు తెచ్చింది. హిందూ మతానికి చెందిన ప్రధానమైన అవగాహనలు కూడా మారాయి. అంబేద్కర్ దృష్టిలో హిందూ మతంపై బ్రాహ్మణవాదం ఆధిపత్యం చెలాయించింది. అదే, ఆయన మనుస్మృతిని తగులబెట్టడానికి దారి తీసింది. మరోవైపు గాంధీజీ తనను తాను సనాతన హిందువుగా చెప్పుకున్నాడు. ఎవరి విశ్వాసాల ప్రకారం వారు మతాలను ఆచరించవచ్చని, ఇతర మతాలతో శాంతియుతంగా జీవించాలని 1921 అక్టోబర్ 6న 'యంగ్ ఇండియా'లో ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు రాహుల్ గాంధీ హిందూ మతం గురించి మాట్లాడుతూ...హిందూ మతానికి సత్యం, అహింస, ప్రేమ ప్రధానమైన లక్షణాలని అదే పనిగా చెప్తున్నారు.

'హిందూత్వ' అనే పదాన్ని 1892లో చంద్రనాథ్ బసు సృష్టించి, దానిని ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని సాధించే ఆదర్శానికి అనుసంధానం చేశాడు. రాజకీయపరంగా 'హిందూత్వ' అనే పదాన్ని 1923లో సావర్కర్ తన "ఎసెన్షియల్స్ ఆఫ్ హిందూత్వ" రచనలో సృష్టించి, నిర్వచించాడు. ఈయన హిందూత్వ ఆర్యన్ జాతి, ఈ పవిత్ర భూమి (సింధూ నుండి సముద్రాల వరకు), బ్రాహ్మణ సంస్కృతిపై ఆధారపడి ఉంది. సావర్కర్ బౌద్ధమతం బోధించే అహింసను చాలా తీవ్రంగా విమర్శిస్తూ, భారతదేశ బలహీనతకు బౌద్ధమతం ప్రచారం చేసిన అహింసే ప్రధాన కారణమని అన్నాడు. ఇది పూర్తిగా మన చరిత్ర అవగాహనకు వక్రీకరణ. ఆధునిక భావంలో దేశం అనేది లేదు. ఒకవేళ మనం దేశంతో సమానమైన సామ్రాజ్యాలను ఆమోదించాలంటే, అశోకుడు బౌద్ధమతాన్ని స్వీకరించాడు. ప్రాచీన భారతదేశంలో ఆయన సామ్రాజ్యమే అతి పెద్దదనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. ఎవరైతే ఈ భూమిని తన పితృభూమిగా, పవిత్ర భూమిగా పరిగణించాడో అతడే హిందువు అని సావర్కర్ నిర్వచించాడు.



ఆర్‌ఎస్‌ఎస్ సావర్కర్‌ను అనుసరించి...ఇస్లాం, క్రైస్తవ మతాలను విదేశీ మతాలుగా పరిగణిస్తూ, ప్రాచీన పవిత్ర మత గ్రంథాలను (మనుస్మృతి వంటివి) సమర్థిస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ తన మతంలో భాగంగా హింసను సృష్టించింది. తన ప్రధాన కార్యాలయం వివిధ ఆయుధాలను ప్రదర్శించి, దసరా పండుగ రోజున వాటికి పూజలు నిర్వహిస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ శాఖలు ఖిల్జీ, బాబర్, ఔరంగజేబు లాంటి ముస్లిం రాజులను క్రూర పాలకులుగా చిత్రించడం ద్వారా, రాణా ప్రతాప్, శివాజీ, పృథ్వీరాజ్ చౌహాన్ లాంటి హిందూ రాజులను కీర్తించడం ద్వారా ద్వేషాన్ని వ్యాప్తి చేశాయి. అన్ని మతాలకు చెందిన ప్రజలంతా జాతీయోద్యమంలో పాల్గొన్న కారణంగా ఆ ఉద్యమాన్ని కూడా ఆర్‌ఎస్‌ఎస్ విమర్శించింది. ఇది దేవాలయాల విధ్వంసం, గొడ్డుమాంసం, బలవంతపు మత మార్పిడులు లాంటి భావోద్వేగ సమస్యల్ని చేపట్టింది కాబట్టి తనను తాను హిందువుల ప్రతినిధిగా చెప్పుకుంటుంది. 1948లో ఆర్‌ఎస్‌ఎస్ పై నిషేధం విధించిన తరువాత సర్దార్ వల్లభాయ్ పటేల్, అది వ్యాప్తి చేసిన విద్వేషాన్ని ఎత్తి చూపుతూ ఇలా అన్నాడు: "వారి ప్రసంగాలు మొత్తం మతోన్మాద విషంతో నిండి ఉన్నాయి. ఆ విషం యొక్క చివరి ఫలితంగా, దేశం అమూల్యమైన గాంధీజీ జీవితాన్ని త్యాగం చేయాల్సి వచ్చింది."

సావర్కర్-ఆర్‌ఎస్‌ఎస్ లు ద్వేషపూరిత మార్గాన్ని అనుసరించిన ఫలితంగా హింసా మార్గంలో ప్రయాణం చేస్తున్నాయి. అంబేద్కర్, హిందూ ఆచరణలో బ్రాహ్మణ ఆధిపత్యానికి వ్యతిరేకంగా నిలబడగా...మహాత్మా గాంధీ, రాహుల్ గాంధీకి...హిందూ మతానికి అందరినీ కలుపుకొనిపోయే, అహింసాయుతమైన అర్థాన్నిచ్చాడు.

('ద వైర్' సౌజన్యంతో)

జనవాక్యం

కేసుల పురోగతి ఏదీ?

మూడు సంవత్సరాల క్రితం జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు చేయడంతో పలు అవకతవకలు వెలుగు చూడటం, కొంత మంది బాధ్యులను గుర్తించడం జరిగింది. అయితే దర్యాప్తు అసంపూర్తిగా జరగడం, అసలు సూత్రధారులను గుర్తించకుండానే విషయం మరుగున పడిపోయింది. ఆపైన తాజాగా జరిగిన ఎన్నికల సందర్భంలో కూడా ఓటర్ల నమోదు, తొలగింపు, జాబితాల తయారీలో అనేక అక్రమాలు వెలుగు చూడటం, కేసులు నమోదు కావడం చూశాం. అలాగే నామినేషన్ పత్రాల పరిశీలనలో, ఎన్నికల ప్రచారం లోనూ, పోలింగ్ రోజున పోలీసులు, ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు నియమించ బడిన రాష్ట్ర ప్రభుత్వ అధికారులు విధి నిర్వహణలో పాలక పార్టీకి వెన్నుదన్నుగా నిలవడం, దీనిపై ఎన్నికల సంఘానికి పలు ఫిర్యాదులు చేయడం జరిగింది. వీటన్నింటిలో ఎన్నికల సంఘం వారు ఎటువంటి తదుపరి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ఎన్నికల సంఘం పూర్తి స్థాయి విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఇవిఎంలు ధ్వంసం చేసిన వారు, దానిపై ఉదాసీనంగా వ్యవహరించిన పోలింగ్ సిబ్బంది, పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- గరిమెళ్ల రామకృష్ణ,
ఏలూరు, ఏలూరు జిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

రాయల్ వీటోను ఉపయోగిస్తున్న మాక్రాన్

- ఫ్రాన్స్ వామపక్షాల విమర్శలు

పారిస్ : గత వారాంతంలో ఫ్రాన్స్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా సీట్లు గెలిచిన వామపక్ష కూటమి నుండి ప్రధానిని నియమించేందుకు తిరస్కరించడం ద్వారా అధ్యక్షుడు మాక్రాన్ రాయల్ వీటోను ఉపయోగిస్తున్నారని వామపక్ష పార్టీలు విమర్శించాయి. అత్యధికంగా సీట్లు గెలిచిన కూటమికి అధికారం ఇవ్వకుండా అధ్యక్షుడు తన విచక్షణాధికారంతో తిరస్కరించడాన్ని రాయల్ వీటో అంటారు. కొత్త ప్రధానిని ప్రకటించడానికి ముందుగా నేషనల్ అసెంబ్లీలో 'రిపబ్లికన్' (ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన) మెజారిటీని సాధించాల్సిందిగా దేశ రాజకీయ పార్టీలను మాక్రాన్ కోరారు. ప్రభుత్వ సంస్థలు, చట్టబద్ధ పాలనకు, పార్లమెంటరీ నిబంధనలకు, యూరోపియన్ అనుకూల దృక్పథానికి, ఫ్రెంచ్ స్వాతంత్య్ర రక్షణకు కట్టుబడి వుండాలని అందుకు అవసరమైన మెజారిటీని సమకూర్చుకోవాలని ఆయన ఉచిత సలహా ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఒక లేఖ రాశారు. ఈ సూత్రాలన్నింటికీ కట్టుబడి వుండాలని అప్పుడే ప్రధాని నియామకంపై నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ఫ్రాన్స్ పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకీ మెజారిటీ రాలేదు. 577 సీట్లు గల పార్లమెంటులో వామపక్ష పార్టీల కూటమి న్యూ పాపులర్ ఫ్రంట్ 193సీట్లతో అతి పెద్ద కూటమిగా అవతరించింది. మాక్రాన్ పార్టీ రినైజాన్స్‌కు 164 సీట్లు రాగా, మితవాద లీపెన్ పార్టీకి 143సీట్లు లభించాయి. మాక్రాన్ తీరుపై సోషలిస్టు పార్టీ చీఫ్ ఒలీవర్ ఫార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రెంచి ప్రజల తీర్పును, ఓటును హైజాక్ చేసేందుకు అధ్యక్షుడు యత్నిస్తున్నారని విమర్శించారు. మరో రాడికల్ నేత జీన్ లూస్ మెలెంచెన్ మాట్లాడుతూ, మాక్రాన్‌పై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. రాయల్ వీటో తిరిగి ప్రయోగించారని వ్యాఖ్యానించారు. 2022 ఎన్నికల్లో మాక్రాన్ పార్టీ నేతృత్వంలోని కూటమి 174సీట్లు గెలిచిన అధికారం అప్పగించారు. ఇప్పుడు ఎన్‌ఎఫ్‌పి 193సీట్లు వచ్చినా ఆ కూటమి అభ్యర్థిని ప్రధానిగా అంగీకరించేందుకు తిరస్కరిస్తున్నారని విమర్శించారు. అధ్యక్షుడు తన చర్యల ద్వారా దేశాన్ని గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టేస్తున్నారని ఫ్రాన్స్‌లోని అతిపెద్ద కార్మిక సంఘం సమాఖ్య అధ్యక్షురాలు సోఫీ బినెట్ విమర్శించారు.

బైడెన్ తడబాటు

- జెలెన్‌స్కీని 'ప్రెసిడెంట్ పుతిన్'గా పరిచయం
- కమలా హారిస్‌ను 'వైస్ ప్రెసిడెంట్ ట్రంప్'గా..

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అప్పటికే తన జ్ఞాపకశక్తి, వయస్సుపై అనుమానాలు ఎదుర్కొంటున్న అధ్యక్షుడు, డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ మరోసారి వరసగా తడబాటుకు గురయ్యారు. వాషింగ్టన్‌లో గురువారం జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశ ముగింపు కార్యక్రమం సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని 'ప్రెసిడెంట్ పుతిన్'గా బైడెన్ పరిచయం చేయడంతో అక్కడ ఉన్న వారంతా ఆశ్చర్యపోయారు. తరువాత జరిగిన న్యూస్ కాన్ఫరెన్స్‌లో వైస్ ప్రెసిడెంట్ కమలాహారిస్‌ను 'వైస్‌ప్రెసిడెంట్ ట్రంప్'గా బైడెన్ పేర్కొన్నారు. దీంతో బైడెన్ అభ్యర్థిత్వంపై మళ్లీ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బైడెన్ అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకోవాలని మరో ముగ్గురు డెమొక్రటిక్ నేతలు డిమాండ్ చేశారు.

లా కోర్సులో మనుస్మృతిపై కేంద్రం యూటర్న్

న్యూఢిల్లీ : ఢిల్లీ యూనివర్సిటీలో న్యాయ విద్యార్థులకు మనుస్మృతిని బోధించాలని ప్రతిపాదనపై కేంద్రప్రభుత్వం వెనక్కి తగ్గింది. దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తడంతో కేంద్రం యూటర్న్ తీసుకుంది. న్యాయ విద్యార్థులకు మనుస్మృతిని బోధించాలని ప్రతిపాదనను ఢిల్లీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యోగేష్ సింగ్ గురువారంతో తిరస్కరించారని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం వెల్లడించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగం యొక్క నిజమైన స్ఫూర్తిని నిలబెట్టడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, లా కోర్సులో మనుస్మృతిని చేర్చే ప్రసక్తే లేదని చెప్పారు.

సుస్థిరాభివృద్ధిలో కేరళ అగ్రగామి

- రెండు, మూడు స్థానాల్లో తమిళనాడు, గోవా
- అత్యంత దిగువన బీహార్
- ఆరో స్థానంలో ఏపి, తెలంగాణ



ఎస్‌డిజి ఇండియా ఇండెక్స్ 2023-24 నివేదికను విడుదల చేస్తున్న నీతి ఆయోగ్ బృందం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుస్థిరాభివృద్ధిలో కేరళ అగ్రగామిగా నిలిచింది. బీహార్ అత్యంత దిగువన ఉంది. సామాజిక, ఆర్థిక, పర్యావరణ, పేదరికం నిర్మూలన, విద్య, ఆకలి, వైద్యం వంటి 16 అంశాల్లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరు అంచనా వేసే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డిజి) ఇండియా ఇండెక్స్ 2023-24 రిపోర్టును శుక్రవారం నీతి ఆయోగ్ విడుదల చేసింది. ఉత్తరాఖండ్, కేరళ అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలుగా నిలిచాయి. బీహార్ పనితీరు అధ్వాన్నంగా నిలిచింది. కేరళ, ఉత్తరాఖండ్ 79 స్కోర్‌తో అగ్రగామిగా ఉన్నాయి. తమిళనాడు 78 స్కోర్ సాధించి రెండో స్థానంలో ఉంది. గోవా 77 స్కోర్‌తో మూడో స్థానంలో ఉంది. బీహార్ 57 స్కోర్, జార్ఖండ్ 62 స్కోర్, నాగాలాండ్, మేఘాలయ 63 చొప్పున స్కోర్ చేసి అట్టడుగున ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో చండీగఢ్, జమ్మూకాశ్మీర్, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, ఢిల్లీ మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్ 75 స్కోర్‌తో ఆరో స్థానంలో నిలిచాయి.

ఎస్‌డిజి కింద నిర్దేశించిన 16 లక్ష్యాలలో ఇండియా గణనీయమైన మెరుగుదలను సాధించిందని, 71 స్కోర్ నమోదైందని నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రమణ్యం తెలిపారు. లింగ సమానత్వంలో 49 స్కోర్ నమోదైంది. ఆకలిలో 52 స్కోర్ వచ్చింది. ఈ రెండు విభాగాల్లోనే అత్యంత తక్కువ స్కోర్ నమోదయ్యాయి. పేదరికం నిర్మూలనలో తెలంగాణ (91 స్కోర్), ఎపి (86 స్కోర్)తో రెండు, మూడో స్థానాల్లో నిలిచాయి. ఆకలి సూచి (జీరో హంగర్)లో ఎపి 67 స్కోర్‌తో పదో స్థానంలో నిలిచింది. తెలంగాణ 58 స్కోర్‌తో దారుణంగా ఉంది. ఆరోగ్యంలో ఎపి 78 స్కోర్‌తో ఆరో స్థానంలో ఉండగా, తెలంగాణ 73 స్కోర్‌తో తొమ్మిదో స్థానంలో నిలిచింది. నాణ్యమైన విద్యలో ఎపి 52 స్కోర్‌తో 15వ స్థానంలో అత్యంత దారుణంగా ఉండగా, తెలంగాణ మాత్రం 64 స్కోర్‌తో ఎనిమిదో స్థానంలో నిలిచింది.

లింగ సమానత్వంలో ఎపి 51 స్కోర్‌తో 12వ స్థానంలో ఉండగా, తెలంగాణ 49 స్కోర్‌తో 13వ స్థానంలో నిలిచింది. మంచినీరు, పారిశుధ్యంలో ఎపి 91 స్కోర్‌తో 8వ స్థానంలో ఉండగా, తెలంగాణ 90 స్కోర్‌తో 9వ స్థానంలో నిలిచింది. సరసమైన, క్లీన్ ఎనర్జీలో ఎపి, తెలంగాణ 100 స్కోర్‌తో అగ్రగామిగా నిలిచాయి. మంచి పని విధానం, ఆర్థిక వృద్ధిలో ఎపి 69 స్కోర్‌తో పదో స్థానంలో ఉండగా, తెలంగాణ 84 స్కోర్‌తో మూడో స్థానంలో నిలిచింది.

పరిశ్రమలు, ఆవిష్కరణ, మౌలిక సదుపాయాల్లో ఎపి 49 స్కోర్‌తో 14వ స్థానంలో ఉండగా, తెలంగాణ 60 స్కోర్‌తో ఎనిమిదో స్థానంలో నిలిచింది. అసమానతల తగ్గుదలలో ఎపి 67 స్కోర్‌తో 12వ స్థానంలో ఉండగా, తెలంగాణ 65 స్కోర్‌తో 14వ స్థానంలో నిలిచింది. స్థిరమైన నగరాలు, కమ్యూనిటీల్లో ఎపి 85 స్కోర్‌తో ఆరో స్థానంలో ఉండగా, తెలంగాణ 86 స్కోర్‌తో ఐదో స్థానంలో నిలిచింది. వినియోగం, ఉత్పత్తిలో ఎపి 93 స్కోర్‌తో నాలుగో స్థానంలో ఉండగా, తెలంగాణ 75 స్కోర్‌తో 13వ స్థానంలో నిలిచింది. వాతావరణ చర్యలలో ఎపి 70 స్కోర్‌తో ఏడో స్థానంలో ఉండగా, తెలంగాణ 59 స్కోర్‌తో 14వ స్థానంలో నిలిచింది.

బ్లూ వాటర్ (సముద్రం, మెరైన్ వనరులు)లో ఎపి 95 స్కోర్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఇందులో సముద్ర తీర ప్రాంత రాష్ట్రాలే ఉన్నాయి. అటవీ భూమిని కాపాడటం (లైఫ్ ఆన్ ల్యాండ్)లో ఎపి 77 స్కోర్‌తో 11వ స్థానంలో ఉండగా, తెలంగాణ 82 స్కోర్‌తో ఏడో స్థానంలో నిలిచింది. శాంతి, న్యాయం, బలమైన సంస్థల్లో ఎపి 79 స్కోర్‌తో ఎనిమిదో స్థానంలో ఉండగా, తెలంగాణ 67 స్కోర్‌తో 17వ స్థానంలో నిలిచింది.

2060 నాటికి భారత్ జనాభా 170 కోట్లు

- ఐరాస అంచనా

ఐరాస : 2060 ప్రారంభం నాటికి భారతదేశ జనాభా గరిష్టంగా 170 కోట్లకు చేరుతుందని, తర్వాత 12 శాతం క్షీణిస్తుందని ఐక్యరాజ్యసమితి (యుఎన్) అంచనావేసింది. ఈ శతాబ్దంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ నిలుస్తుందని పేర్కొంది. వరల్డ్ పాప్యులేషన్ ప్రాస్పెక్ట్ 2024 నివేదికను ఐరాస గురువారం విడుదల చేసింది. 50-60 సంవత్సరాలలో ప్రపంచ జనాభా పెరుగుతూనే ఉంటుందని, 2024లో 820 కోట్లు నుండి 2080ల మధ్యలో సుమారు 1,030 కోట్లకు చేరుకుంటుందని తెలిపింది. గరిష్ట స్థాయికి చేరుకున్న తర్వాత, క్రమంగా క్షీణించడం ప్రారంభిస్తుందని, శతాబ్దం చివరి నాటికి 1,020 కోట్లకు పడిపోతుందని పేర్కొంది. గతేడాది ప్రపంచంలో అత్యధిక జనాభాను కలిగిన దేశంగా చైనాను అధిగమించిన సంగతి తెలిసిందే. శతాబ్దంలో ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా కలిగిన దేశంగా నిలుస్తుందని భావిస్తున్న భారత్, 2060ల ప్రారంభంలో దాదాపు 170 కోట్లకు చేరుకుంటుందని, ఆ తర్వాత 12 శాతం క్షీణిస్తుందని యుఎన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ అఫైర్స్ (డిఇఎస్ఎ), పాప్యులేషన్ డివిజన్ తెలిపింది. భారత దేశ జనాభా 2024లో 145 కోట్లకు చేరుతుందని నివేదిక అంచనావేసింది. 2054లో 169 కోట్లకు చేరుకుంటుందని తెలిపింది. 2100 నాటికి 150 కోట్లకు తగ్గుతుందని, భారత్ అప్పటికీ భూమిపై అత్యధిక జనాభా కలిగిన దేశంగా కొనసాగుతుందని వెల్లడించింది.

నేపాల్ నదిలో కొట్టుకుపోయిన బస్సులు

- 66మంది గల్లంతు

ఖాట్మండు : నేపాల్‌లో కొండచరియలు విరిగిపడి రెండు బస్సులు నదిలో కొట్టుకుపోవడంతో ఆ బస్సుల్లో ప్రయాణిస్తున్న 66మంది గల్లంతయ్యారని అధికారులు శుక్రవారం తెలిపారు. కుండపోతగా కురుస్తున్న వర్షాలతో, కొండచరియలు విరిగిపడి దారులు మూసుకుపోవడంతో ప్రయాణికులను కాపాడేందుకు చేపట్టిన సహాయక చర్యలు కూడా ముందుకు సాగలేదని ప్రభుత్వ ప్రతినిధి ఖిమా నందా భూసల్ తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున 3గంటల సమయంలో బస్సులు కొట్టుకుపోయాయి. సమాచారం తెలిసిన వెంటనే అదనపు సహాయక సిబ్బందిని, భద్రతా బలగాలను అక్కడకు పంపారు. ప్రమాదం జరిగినపుడు ఒక బస్సులో 24మంది మరో బస్సులో 42మంది వున్నారు. మార్గమధ్యంలో బస్సులో మరికొంతమంది ఎక్కివుండవచ్చని భావిస్తున్నట్లు భూసల్ చెప్పారు. జూన్ నుండి సెప్టెంబరు వరకు వర్షాకాలంలో భారీగా వర్షాలు కురవడం, కొండచరియలు విరిగిపడడం సర్వసాధారణం. గత కొద్ది రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలతో నదులన్నీ పొంగి పొర్లుతున్నాయి. మధ్యాహ్నం వరకు బస్సుల ఆచూకీ తెలియరాలేదు. బహుశా బస్సులు మునిగిపోయి త్రిశూలి నదిలో దిగువ ప్రాంతానికి కొట్టుకుపోయి వుండవచ్చునని భావిస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఈ ప్రమాదాల పట్ల నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహాల్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

గాజా వీధుల్లో చెల్లాచెదురుగా మృత దేహాలు

- సుజయె జిల్లాలో 60 మృత దేహాలు లభ్యం
- ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించాలన్న టర్కీ

గాజా : గురువారం ఇజ్రాయిల్ ఆర్మీ ముమ్మర దాడులతో విరుచుకుపడింది. రెండు వారాల నుండి భీకరంగా దాడులు కొనసాగుతున్న సుజయె జిల్లాలో 60 మృత దేహాలను కనుగొన్నట్లు పౌర రక్షణ సంస్థ తెలిపింది. ఈ దాడులతో సుజయె ప్రాంతం దారుణంగా ధ్వంసమైందని సంస్థ ప్రతినిధి మహమూద్ బసల్ చెప్పారు. సుజయె నుండి ఆర్మీ వైదొలగగానే స్థానికులు, పౌర రక్షణ బలగాలు కలిసి వీధుల్లో చెల్లా చెదురుగా పడి వున్న మృత దేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇక సుజయె జిల్లాలో తమ ఆపరేషన్ ముగిసిందని ఇజ్రాయిల్ ప్రకటించింది. టెల్ అల్ హవా, సబ్రా జిల్లాల్లో ప్రజలు



చాలామంది ఇళ్లల్లోనే చిక్కుకుపోయి మరణించారని వార్తలు అందాయని పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. అక్కడకు సహాయక సిబ్బంది వెళ్ళే పరిస్థితికూడా లేదని తెలిపింది. టెల్ అల్ హవాలో 30మంది వరకు మరణించారని, వారి మృత దేహాలను కూడా వీధుల్లో నుండి తీయలేదని సివిల్ ఎమర్జన్సీ సర్వీస్ తెలిపింది. ఈ దాడుల కారణంగా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి జరుగుతున్న చర్చలు మళ్ళీ ప్రతిష్టంభనలో పడే అవకాశముందని హమాస్ హెచ్చరించింది. అసలు చర్చలు ఏ దశలో వున్నాయో ఇంకా తమకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపింది. కాగా, ఒప్పందం కుదరడానికి ఇంకా జరగాల్సిన కసరత్తు చాలా వుందని వైట్‌హౌస్ జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ గురువారం తెలిపారు. తక్షణమే ఒప్పందం కుదిరే పరిస్థితి వుందని చెప్పలేమన్నారు. అందరి సంకల్ప బలంతోనే త్వరలోనే ఈ ఒప్పందం కుదరగలదని ఆశిస్తున్నట్లు ఆయన విలేకర్లతో చెప్పారు.

యుద్ధ నేరాలకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించాలని టర్కీ అధ్యక్షుడు తైయిప్ ఎర్డోగన్ డిమాండ్ చేశారు. నాటో సదస్సు కోసం వాషింగ్టన్ వచ్చిన ఆయన మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఆస్పత్రులు, స్కూళ్ళు, సహాయక కేంద్రాలపై ఇజ్రాయిల్ చేసే దాడులన్నీ యుద్ధ నేరాల కిందకే వస్తాయన్నారు. అంతర్జాతీయ చట్టాలను ఇంతలా ఉల్లంఘించినా అమెరికా ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం లేదన్నారు. పైగా ఇజ్రాయిల్‌కు మద్దతునిస్తున్నారన్నారు. ఇలాంటి తరుణంలో ఇజ్రాయిల్‌పై ఆంక్షలు విధించేది ఎవరని ఆయన ప్రశ్నించారు.

బీహార్‌లో పిడుగుపాటుతో ఐదుగురు మృతి

పాట్నా : బీహార్‌లోని పలు ప్రాంతాల్లో గత 24 గంటల్లో పిడుగుపాటుకు గురై ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలో మూడురోజుల క్రితం పిడుగులు పడి 12 మంది మరణించారు. దీంతో, ఈ ఘటనల వల్ల మృతుల సంఖ్య 17కి పెరిగింది. బత్నాహ్ గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో పిడుగుపడటంతో అక్కడ పనులు చేస్తున్న మకున్ సూఫీ, అషినా ఖాతూన్ ద్దరు, ఖుతౌనా మరణించారు. దుమారియా గ్రామంలో సంగీతాదేవి, మంజుదేవిలు కూడా పిడుగుపాటుకు గురై చనిపోయారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ మృతులకు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. తరారీ బ్లాక్ పరిధిలోని బర్కాగావ్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో పిడుగుపడటంతో 18 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వారంతా సదర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.



ఉత్తరప్రదేశ్‌లో 38 మంది పిడుగుపాటుతో మరణించిన ఘటనలు మరవకముందే బీహార్‌లోనూ అలాంటి ఘటనలే జరగడం గమనార్హం.

ఎట్టకేలకు దిగొచ్చిన అండమాన్ ప్రభుత్వం

- మృతురాలి భర్తకు ఉద్యోగం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల ఆందోళనలు, నిరసనలతో అండమాన్ నికోబార్ ప్రభుత్వం దిగివచ్చింది. మృతురాలి భర్తకు ఉద్యోగం, లెఫ్టినెంట్ గవర్నర్ రిలీఫ్‌ఫండ్, ఎంపి ఫండ్స్ నుంచి సాయానికి హామీ ఇచ్చింది. ఆందోళన చేస్తున్న మత్స్యకారులపై ఈనెల పదో తేదీన లాఠీఛార్జి చేయడంతో పాటు టియర్‌గ్యాస్, వాటర్ కెనాన్లు ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 50 మందికి పైగా మత్స్యకారులు గాయపడ్డారు.

వివరాల్లోకి వెళ్తే పోర్టుబ్లెయిర్‌లో తిరుపతిమందిర్ ప్రాంతంలో నివాసముంటున్న శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం ఇసకలపాలెంకు చెందిన మత్స్యకారుడు కె.కృష్ణారావు భార్య విమల (21) తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. ఈనెల ఆరో తేదీన కుటుంబసభ్యులు ఆమెను పోర్టుబ్లెయిర్‌లోని జిబిపంత్ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. నర్స్ ఇచ్చిన ఇంజక్షన్ వికటించి ఆమె మరణించారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మృతిపై విచారణకు, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల ఏడో తేదీన ఆసుపత్రి వద్ద దీక్షలు ప్రారంభించారు. పదో తేదీన ఇచ్చిన పోస్టుమార్టం రిపోర్టులో వైద్యుల తప్పిదం లేదని ఇవ్వడంతో మత్స్యకారుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆ రోజు సాయంత్రం పోర్టుబ్లెయిర్‌లోని నాలుగు రోడ్ల కూడలి వద్ద రహదారిని దిగ్బంధించారు. ఆందోళనా ప్రాంతానికి అధికారులు చేరుకున్నారు. ధర్నా విరమించాలని, న్యాయం చేస్తామంటూ అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. రాతపూర్వకంగా హామీ ఇస్తేనే



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ఆందోళన విరమిస్తామని ఆందోళనకారులు తేల్చిచెప్పారు. సరిగ్గా రాత్రి ఏడు గంటల ప్రాంతంలో విద్యుత్ దీపాలను ఆపేసి మత్స్యకారులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జి చేశారు. ఈ దాడిలో 50 మందికిపైగా మత్స్యకారులు గాయపడ్డారు. మత్స్యకార మహిళ మృతి విషయం, పోలీసుల లాఠీఛార్జి అన్ని ప్రాంతాలకు విస్తరించడంతో తెలుగు మత్స్యకారులతో పాటు తమిళలు భారీ ర్యాలీ చేశారు. వీరికి సిపిఎం, టిడిపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు అక్కడి మత్స్యకార సంఘాలు సంఘీభావం తెలిపాయి. మృతురాలి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, తెలుగు వారికి కోసం ఆసుపత్రిలో తెలుగు అనువాదకులను నియమించాలని, పోర్టుబ్లెయిర్‌లోని ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. దీనిపై అక్కడ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేశవచంద్ర హామీ ఇవ్వడంతో మత్స్యకారులు శాంతించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించడంతో శుక్రవారం మృతురాలికి అంత్యక్రియలు చేశారు. ఆమెకు ఏడాదిన్నర వయసున్న బాబు ఉన్నారు.

చొరవ చూపిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

పోర్టుబ్లెయిర్‌లో చోటుచేసుకున్న ఘటనపై ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, అక్కడి మత్స్యకారులు.... కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అక్కడి అధికారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. మృతురాలి భర్త కృష్ణరావుకు ఉద్యోగం, లెఫ్టినెంట్ గవర్నర్ రిలీఫ్‌ఫండ్, ఎంపి ఫండ్స్ నుంచి సాయం చేస్తామని వార్డు కమిటీ, అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపి బిష్ణు పదరే హామీ ఇచ్చారు.

భద్రతా మండలి, డబ్ల్యూటిఒల్లో సంస్కరణలు అవసరం

- బ్రిక్స్ పార్లమెంటరీ సమావేశాల్లో ఓం బిర్లా

మాస్కో : ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటిఒ) వంటివి మరింత ప్రజాస్వామ్యబద్ధంగా మారాలని భారత లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన 10వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరంలో బిర్లా ప్రసంగించారు. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లను, అభివృద్ధి చెందుతున్న దేశాలను ఏకం చేయడానికి భారత్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పరస్పర గౌరవం, అవగాహన, సమానత్వం, సంఘీభావం, సమగ్రత, ఏకాభిప్రాయ సూత్రాల పట్ల భారతదేశం అంకితభావంతో ఉంటుందని బిర్లా చెప్పారు. 'బ్రిక్స్ పార్లమెంటరీ పరిమాణం: అంతర్-పార్లమెంటరీ సహకారాన్ని బలోపేతం చేయడానికి అవకాశాలు' అనే అంశంపై జరిగిన మొదటి ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌లోకి ఈజిప్టు, ఇథియోపియో, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అనే నాలుగు కొత్త సభ్యులను బిర్లా స్వాగతించారు. 'బ్రిక్స్ ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఐరాస భద్రతా మండలి, డబ్ల్యూటిఒ వంటి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలకు కృషి చేస్తుంది' అని బిర్లా అన్నారు.



1959 జులై1న విప్లవ వీరుడు చే గువేరాకు ఢిల్లీలోని తన అధికారిక నివాసమైన తీన్ మూర్తి భావన్‌లో స్వాగతం పలుకుతున్న భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ

చే భారత్ సందర్శనకు 65 ఏళ్లు

- విశేషాలను పంచుకున్న చమన్‌లాల్

హవానా: విప్లవ పోరాట యోధుడు, ఫైడెల్ కాస్ట్రోకు అత్యంత సన్నిహితుడు అయిన చే గువేరా భారత్ సందర్శించి 65 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ చారిత్రాత్మక పర్యటన విశేషాలను కొన్నిటిని జెఎన్‌యు రిటైర్డు ప్రొఫెసర్ చమన్‌లాల్ గుర్తు చేసుకున్నారు. క్యూబా విప్లవం విజయవంతమైన తరువాత ఆఫ్రో-ఆసియా దేశాలతో ఆర్థిక, దౌత్య సంబంధాలను ఏర్పరచుకోడానికి కాస్ట్రో తన సహచరుడు చే ను ఆయా దేశాలకు పంపారు. చే భారత్‌లో రెండు వారాల పాటు పర్యటించాడని, భారత దేశ అధికారిక పత్రాలు 'క్యూబా ప్రతినిధి బృందానికి కమాండెంట్ ఎర్నెస్టో ' అని పేర్కొంటున్నాయి. ఆ పర్యటన సందర్భంగా చే గువేరాను భారతీయ జర్నలిస్టు ఆర్ భానుమతి ఆలిండియా రేడియోలో ఇంటర్వ్యూ చేశారు. తరువాత దానిని తన పుస్తకంలో ప్రచురించారామె. 2007లో హిందీ దినపత్రిక 'జనసత్తా' ఎడిటర్ ఓం థాన్వి క్యూబాకు వెళ్లి చే భారత్ పర్యటనకు సంబంధించిన మరిన్ని విషయాలను తెలుసుకున్నారు. చే ఢిల్లీ, కొల్‌కతా (అప్పటి కలకత్తా) నగరాలను సందర్శించారని, ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకులను కలుసుకుని, బహిరంగ సభలో ప్రసంగించి ఉంటారని చమన్‌లాల్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఛాయా చిత్రాలు తక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు.

రాజ్యాంగ హత్యా దినంగా జూన్ 25

న్యూఢిల్లీ : 1975లో ఎమర్జెన్సీ విధించిన జూన్ 25వ తేదీని ఇక నుంచి ప్రతి ఏటా 'రాజ్యాంగ హత్యా దినం (సంవిధాన్ హత్యా దివస్)'గా పాటించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ప్రతి ఏటా జూన్ 25న 'రాజ్యాంగ హత్యా దినం' పాటించడం ద్వారా 1975 ఎమర్జెన్సీ సమయంలో ప్రజలు అనుభవించిన వేదనను, దాన్ని ఎదిరించి నిలబడిన యోధులను గుర్తు చేసుకుందాం' అని పేర్కొన్నారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో అత్యయిక స్థితి విధించి ప్రజాస్వామ్యం గొంతు నులిమారని విమర్శించారు. ఎలాంటి కారణం లేకుండానే లక్షల మందిని జైలులో పెట్టారని, మీడియా గళాన్ని అణగదొక్కారని, ఆ చీకటి రోజులకు నిరసనగానే 'రాజ్యాంగ హత్యా దినం' పాటించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్రమోడీ స్పందిస్తూ, 'భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కితే ఏం జరుగుతుందో ఈ రోజు గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ఈ విషయమై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ స్పందిస్తూ, పదేళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ విధించిన ప్రధాని నైతిక ఓటమి దినంగా, మోడీ ముక్తి దివస్‌గా 2024 జూన్ 4 నిలిచిపోతుందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ సూత్రాలు, విలువలు, సంస్థలపై మోడీ ప్రభుత్వం క్రమబద్ధమైన దాడి చేస్తోందని విమర్శించారు.

ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తున్న నాటో

- శాంతి ఉద్యమం విమర్శ

వాషింగ్టన్ : నాటో విస్తరణవాదం వల్లే అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు చెలరేగుతున్నాయని, యుద్ధ భయాలు పొంచి వున్నాయని శాంతికాముకులు, ప్రచార కార్తకర్తలు హెచ్చరించారు. స్టాప్ ది వార్ కొయిలేషన్ జాతీయాధికారి క్రిస్ నినెహమ్ మాట్లాడుతూ, లెబనాన్‌లో హిజ్బుల్లాపై కొత్తగా ఇజ్రాయిల్ యుద్ధం మొదలుపెట్టడం, మరోవైపు అమెరికా చర్యలు, విధానాలతో ప్రపంచం ప్రమాదకరంగా తయారైందని ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారని అన్నారు. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తర్వాత దశాబ్దాల కాలంలో తూర్పు దిశగా నాటో చేపట్టిన విస్తరణవాదం వల్లనే ఇదంతా జరుగుతోందన్న విషయం మనం మరిచిపోరాదన్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని సృష్టించింది ఈ పరిస్థితులేనన్నారు. పైగా ఇటీవల ఈ విస్తరణ మరింత వేగం పుంజుకుందన్నారు. యూరప్‌వ్యాప్తంగా ఆయుధాలపై పెట్టే వ్యయం విపరీతంగా పెరిగిపోతోందన్నారు. పీస్ ప్లెడ్జ్ యూనియన్ ప్రతినిధి మాట్లాడుతూ, అంతర్జాతీయంగా అస్థిరతా భావం నెలకొంద న్నారు. అణు ముప్పు వాస్తవికంగా పొంచి వుందన్నారు. వీటివల్ల సైనిక ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతాయని, మనలో ప్రతి ఒక్కరికీ సురక్షితంగా లేమనే భావన పెరగడానికి కారణమవుతుందన్నారు. బ్రిటన్ మిలటరీ వ్యయం ప్రపంచంలోనే ఆరవ స్థానంలో వుందన్నారు. ఇటువంటి సమయంలో ఉక్రెయిన్, రష్యాల్లోని శాంతి ప్రచార కర్తలు చెప్పేది కూడా ప్రభుత్వాలు వినాలని వారు కోరారు. తక్షణమే ఈ దాడులను, యుద్ధాలను ఆపేసి, అన్ని పక్షాలు అర్ధవంతమైన చర్చల్లో పాల్గొనాలని, అదొక్కటే ఈ భయంకరమైన ఘర్షణలన్నింటికీ పరిష్కారమని వారు స్పష్టం చేశారు.

ఎస్ఎన్‌జెపిసి సిఫార్సులు అమలు చేయరేం?

- 16 రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సమన్లు

న్యూఢిల్లీ : 'రెండో నేషనల్ జ్యుడిషియల్ పే కమిషన్' (ఎస్ఎన్‌జెపిసి) సిఫార్సులను అమలు చేయని 16 రాష్ట్రాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఆర్థికశాఖ కార్యదర్శులు ఆగస్టు 23న స్వయంగా కోర్టుకు హాజరుకావాలని సమన్లు ఇచ్చింది. కోర్టు సహాయకునిగా (అమికస్ క్యూరీ) వ్యవహరిస్తున్న న్యాయవాది కె.పరమేశ్వర్ ఇచ్చిన నివేదికను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, కేరళ, రాజస్థాన్, పంజాబ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు సర్వోన్నత న్యాయస్థానం సమన్లు జారీ చేసింది.

పదవీవిరమణ పొందిన జ్యుడిషియల్ అధికారులకు పే కమిషన్ సిఫార్సుల మేరకు పింఛను బకాయిలు, ఇతర ప్రయోజనాలు కల్పించడంలో ఈ రాష్ట్రాల అలసత్వం తదితర అంశాలపై అసహనం వ్యక్తంచేసింది. ఎస్ఎన్‌జెపిసి సిఫార్సుల అమలుకు ఏడుసార్లు అవకాశాలిచ్చినా పూర్తిస్థాయిలో అమలు చేయడంలో అనేక రాష్ట్రాలు విఫలమయ్యాయని, ప్రధాన కార్యదర్శులు, ఆర్థిక కార్యదర్శులు వ్యక్తిగతంగా హాజరు కాకపోతే ధిక్కరణ చర్యలు చేపట్టాల్సి ఉంటుందని సిజెఐ ధర్మాసనం హెచ్చరించింది.

కేజ్రీవాల్‌కు ఇడి కేసులో బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

వీల్లేదని, గవర్నర్ అనుమతి లేకుండా అధికారిక ఫైళ్లపై సంతకం చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. బెయిల్ కోసం రూ.50,000 వ్యక్తిగత పూచీకత్తు చెల్లించాలని పేర్కొంది. ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించి ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని, సాక్షులు ఎవరితోనూ మాట్లాడకూడదు లేదా కేసుతో సంబంధించిన ఫైల్స్ జోలికి వెళ్లొద్దని స్పష్టం చేసింది. ఈ మధ్యంతర బెయిల్‌ను పొడిగించవచ్చు లేదా ఎక్కువ మంది సభ్యులతో కూడిన బెంచ్ రీకాల్ చేయవచ్చునని సుప్రీంకోర్టు పేర్కొంది.


ఈ కేసులో ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు జూన్ 20న బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీ హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లేందుకు బెయిల్ ఉత్తర్వులపై 48 గంటలపాటు నిలుపుదల చేయాలన్న ఇడి అభ్యర్థనను ప్రత్యేక జడ్జి నియయ్ బిందు తిరస్కరించారు. రూ.లక్ష వ్యక్తిగత బాండ్ పూచీకత్తుపై కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని ఆదేశించారు. ట్రయల్ కోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జూన్ 21న ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు, ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపై స్టే విధించింది. దీనిని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం తాజాగా మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు ఇచ్చింది.

సిబిఐ కేసులో కస్టడీ మరో 14 రోజులు పొడిగింపు

సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ కేజ్రీవాల్ జైల్లోనే ఉండాల్సి ఉంటుంది. ఇదే కేసులో కేజ్రీవాల్ ప్రస్తుతం సిబిఐ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. ఆయన జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజులు రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఇడి కేసులో తీహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను జూన్ 21న సిబిఐ అరెస్టు చేసింది. ఆ తరువాత నుంచి జ్యుడీషియల్ కస్టడీని సిబిఐ కోరిక మేరకు కోర్టు పొడిగిస్తూ వస్తోంది. జ్యుడీషియల్ కస్టడీ గడువు శుక్రవారం నాటికి ముగియడంతో సిబిఐ అధికారులు ఆయనను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చారు. కేజ్రీవాల్‌ను మరింత విచారించాల్సిన అవసరం ఉన్నందున కస్టడీని పొడిగించాలని సిబిఐ కోరడంతో, జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజులు పొడిగిస్తున్నట్లు కోర్టు తెలిపింది.

అదానీ పవర్ ప్లాంట్‌తో నష్టం తీవ్రం

- అది అంచనా వేసిన దానికంటే ఎక్కువే
- యుపిలో పర్యావరణ నిపుణులు, కార్యకర్తల ఆందోళన



న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ అటవీ ప్రాంతం అనేక రకాల చెట్లు, ఔషధ మొక్కలు, వన్య ప్రాణులకు కేంద్రం. ఈ డివిజన్‌లోని దాద్రీ ఖుర్ద్ ప్రాంతంలో.. మీర్జాపూర్ థర్మల్ ఎనర్జీ(యుపి) లిమిటెడ్ అనే సంస్థ 1,600 మెగావాట్ల బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించటానికి పర్యావరణ అనుమతిని పొందే దిశగా మొదటి అడుగులు వేసింది. ఈ కంపెనీ అదానీ గ్రూపునకు కొత్త అనుబంధ సంస్థ. జూన్ 28న నిపుణుల అంచనా కమిటీ ముందు సదరు కంపెనీ సమర్పించిన సమాచారం ప్రకారం.. అక్కడ దాని స్వంత భూమిలో 365.19 హెక్టార్లలో ప్లాంట్‌ను నిర్మించాలని కంపెనీ ప్రతిపాదన. .

ఇక్కడున్న 365.19 హెక్టార్లలో.. కంపెనీ దాదాపు 12 హెక్టార్ల అటవీ భూమికి 'అనుమతులు' కోరుతున్నది. ఇది ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలనుకుంటున్న భూమిలో కేవలం 12 హెక్టార్లు మాత్రమే అటవీ భూమి అని చెప్తున్నది. అయితే ఇది తప్పుదోవ పట్టించేలా ఉన్నదని పర్యావరణ నిపుణులు, కార్యకర్తలు అంటున్నారు. "దాద్రీ ఖుర్ద్‌లోని 665 హెక్టార్ల భూమి ప్రాజెక్ట్ సైట్ పరిధిలోకి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఈ భూమి ప్రత్యేకంగా 1952 రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో అటవీ ప్రాంతంగా నమోదు చేయబడింది" అని వారు ఎత్తి చూపారు. సుప్రీం కోర్టు 1996 గోదావర్మన్ తీర్పు ప్రకారం యాజమాన్యంతో సంబంధం లేకుండా ప్రభుత్వ రికార్డులో అటవీ ప్రాంతంగా నమోదు చేయబడిన ఏదైనా ప్రాంతాన్ని అటవీ భూమిగా పరిగణించాలి.

పర్యావరణ మంత్రిత్వ శాఖకు జూన్ 28న రాసిన లేఖలో మిర్జాపూర్‌లోని వింధ్యన్ ఎకాలజీ అండ్ నేచురల్ హిస్టరీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, పర్యావరణవేత్త దేబాదిత్యో సిన్హా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 1952 నోటిఫికేషన్ ఆధారంగా ఇండియన్ ఫారెస్ట్ యాక్ట్ 1927లోని సెక్షన్ 20 కింద 665 హెక్టార్లను అటవీగా ప్రకటించాల్సి ఉన్నదని వివరించారు. 106 హెక్టార్లు నోటిఫై చేయగా, 558 హెక్టార్లు ఇంకా నోటిఫై చేయాల్సి ఉన్నదని పేర్కొన్నారు. యుపిలో అటవీ శాఖ కేటాయించిన భూమిలో 27 శాతం ఇంకా అధికారికంగా అటవీగా ప్రకటించాల్సి ఉన్నదని సిన్హా తన లేఖలో పేర్కొన్నారు. ఒక్క మీర్జాపూర్ ఫారెస్ట్ డివిజన్‌లోనే రాష్ట్ర రికార్డుల్లో అటవీ భూమిగా వర్గీకరించబడిన 7,300 హెక్టార్లకు పైగా అటవీ భూమిగా ప్రకటించబడలేదని ఇంకా నోటిఫికేషన్ వెలువడలేదు.

ఇదే దాద్రీ ఖుర్ద్ స్థలంలో థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రతిపాదించడం ఇది రెండోసారి కావటం గమనార్హం. 2014లో పర్యావరణ మంత్రిత్వ శాఖ అదే స్థలంలో 1,320-మెగావాట్ల బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించటానికి వెల్స్పన్ ఎనర్జీకి పర్యావరణ అనుమతిని మంజూరు చేసింది.

సంపద సృష్టి ఎక్కడ?

- **మాజీ మంత్రి పేర్ని నాని**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికలకు ముందు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టేసిందని, తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తానంటూ ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల రోజుల్లో అప్పులు చేయడం తప్ప సంపద సృష్టి ఎక్కడ చేశారో చెప్పాలని మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం ఈ నెల రోజుల కాలంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించి తప్పుడు లెక్కలు, అసత్యాలతో శ్వేతపత్రాలు విడుదల చేస్తూ కాలం వెళ్లదీస్తోందని అన్నారు. గత ప్రభుత్వంపై నిందలు మోపడమే లక్ష్యంగా పనిచేస్తోందని విమర్శించారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులపై శ్వేతపత్రాల్లో కూడా స్పష్టత ఇవ్వలేకపోయారని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అని చెప్పి ఇప్పుడు ఒక్కరికే ఇస్తామంటున్నారని అన్నారు. అలాగే ఉచిత ఇసుక కూడా అబద్ధమేనన్నారు. వైసిపి ప్రభుత్వం వుంటే ఈ పాటికి అమ్మఒడి, మత్స్యకార భరోసా, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను ప్రజలకు అందించేవారని తెలిపారు. రాష్ట్ర అప్పులు రూ.4 లక్షల కోట్లు అని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి ప్రకటన చేసినా, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రూ.15 లక్షల కోట్లు అని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

కూరగాయల మంట

- **5.08 శాతానికి ద్రవ్యోల్బణం**

న్యూఢిల్లీ : దేశంలో ధరలు ఎగిసిపడుతున్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణానికి కూరగాయలు, పప్పుల ధరలు రెండంకెల స్థాయిలో పెరుగుతూ భారీగా ఆజ్యం పోస్తున్నాయి. అహారోత్పత్తుల ధరలు ఎగిసిపడటంతో ప్రస్తుత ఏడాది జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 5.9 శాతానికి చేరింది. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసు (ఎన్ఎస్ఒ) శుక్రవారం విడుదల చేసిన గణంకాల ప్రకారం.. గత ఐదు నెలల్లో రిటైల్ ద్రవ్యోల్బణం ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి. రిటైల్ ద్రవ్యోల్బణంలో దాదాపు సగం వాటా కలిగిన ఆహార ద్రవ్యోల్బణం సూచీ ఏకంగా 8.69 శాతానికి ఎగిసింది. ఇది గతేడాది జూన్ నెలలో 4.55 శాతంగా ఉంది. గడిచిన జూన్ నెలలో కూరగాయల ధరలు ఏకంగా 27.33 శాతం పెరిగాయి. తృణధాన్యాలు 8.75 శాతం, పళ్లు 7.15 శాతం, పప్పులు 16.07 శాతం చొప్పున భారం అయ్యాయి. గతేడాదితో పోలిస్తే జూన్ నెలలో గ్రామీణ ద్రవ్యోల్బణం 4.78 శాతం నుంచి 5.67 శాతానికి పెరిగింది. పట్టణ ద్రవ్యోల్బణం గతేడాది జూన్‌లో 4.96 శాతంగా ఉంటే.. గత నెలలో 4.39 శాతంగా చోటు చేసుకుంది. ఇటీవల దేశంలో టమాటాలు, ఉల్లిగడ్డలు, బంగాళాదుంపల ధరలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. వీటి ధరలు అమాంతం పెరగడంతో కుటుంబాలపై తీవ్ర భారం పడుతోంది. దేశంలో ఇప్పటికీ రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం ఎగువన ఉన్నందున వడ్డీ రేట్లు తగ్గింపునపై ఇప్పుడే మాట్లాడటం అర్థంలేని చర్య అవుతుందని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం పేర్కొన్నారు.

16 శాతం మంది మహిళలకు ఆర్థిక మద్దతు

రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యత

న్యూఢిల్లీ : రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఆర్థిక మద్దతును అందించడానికి ప్రాధాన్యతను ఇస్తున్నాయని యాక్సిస్ బ్యాంక్ తన రీసెర్చ్ రిపోర్ట్‌లో పేర్కొంది. మహిళల కోసం చేపడుతున్న సంక్షేమ చర్యలు, ముఖ్యంగా ఆదాయ బదిలీ పథకాలతో దేశంలోని 16 శాతం మంది మహిళలకు ఆర్థిక మద్దతు లభిస్తుందని తెలిపింది. 10 రాష్ట్రాల్లోని బడ్జెట్‌లో మహిళలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వగా ఇందులో.. మహారాష్ట్ర టాప్‌లో ఉందని పేర్కొంది. యాక్సిస్ రిపోర్ట్ ప్రకారం.. మహిళలకు ఆదాయ బదిలీలు ఇప్పుడు సంవత్సరానికి రూ.1.8 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇది రాష్ట్రాల ఉమ్మడి స్థూల దేశీయోత్పత్తి (జిఎస్‌డిపి)లో 0.8 శాతంగా, దేశ జిడిపిలో 0.6 శాతంగా ఉంది.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) రీసెర్చ్ నివేదిక ప్రకారం.. మహిళల కోసం పలు పథకాలతో రాష్ట్రాలు మద్దతును అందిస్తున్నాయి. అనేక పెద్ద రాష్ట్రాలు ఇప్పుడు తమ ఆదాయ రాబడిలో పెద్ద మొత్తంలో సంక్షేమ పథకాలకు వ్యయం చేస్తున్నాయి. "పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు రాష్ట్ర ఎన్నికలకు ముందు పలు సంక్షేమ పథకాలను ప్రారంభించగా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు మద్దతును ఇచ్చేలా పలు పథకాలను రూపొందించాయి." అని యాక్సిస్ నివేదిక పేర్కొంది. ఇలాంటి పథకాలకు అధిక మొత్తంలో కేటాయించడం ద్వారా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలకు ఎలాంటి హాని జరగదని పేర్కొంది. ఆ మొత్తం తిరిగి మార్కెట్‌లోకి వస్తుందని విశ్లేషించింది.

గంజాయి సేవించి చోరీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ


గంజాయి సేవించి హైవేపై వెళ్తున్న వాహనంపై గురువారం అర్ధరాత్రి దాడి చేసి చోరీకి పాల్పడిన ముఠాను పోలీసులు పట్టుకున్నారు. విశాఖ క్రైమ్ డిసిపి పి.వెంకటరత్నం శుక్రవారం సాయంత్రం ఎంవిపి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి ఎండాడ సమీపంలో గురువారం అర్ధరాత్రి ఒంటి గంటన్నర ప్రాంతంలో అటుగా వెళుతున్న లారీని ఆపి డ్రైవర్‌పై కొంతమంది దాడి చేశారు. అతని నుంచి రూ.10 వేల నగదు, మొబైల్ దొంగిలించారు. వారిని 24 గంటలు గడవకముందే పోలీసులు పకడ్బందీ వ్యూహంతో ఐదు బృందాలుగా గాలించి పట్టుకున్నారు. విచారణలో భాగంగా మరొక ఏడుగురిని ఆర్‌హెచ్ కాలనీలో అరెస్టు చేశారు.

'మోడీ'నామిక్స్

- బిజెపి పాలనలో ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం
- గరిష్టస్థాయికి నిరుద్యోగం
- భారత్‌లో తగ్గిన పెట్టుబడులు
- ఆర్థిక నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ : పదేళ్ల మోడీ పాలన దేశ ఆర్థిక వ్యవస్థను తిరోగమనంలోకి తీసుకెళ్లిందని దేశంలోని కొందరు ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ మోడీనామిక్స్‌గా మారిందనీ, మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. కొన్ని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని అంటున్నారు. అయితే, ఆర్థిక వ్యవస్థ నష్టానికి మాత్రం కరోనాను కారణంగా చూపుతూ పలు సందర్భాల్లో బిజెపి ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పుకుంటూ వస్తున్నదని తెలిపారు.

మోడీ పాలనలో భారత్‌లో నిరుద్యోగం గరిష్ట స్థాయికి చేరుకున్నదని ఆర్థిక నిపుణులు, మేధావులు, విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. "భారత్‌లో యువతకు నాణ్యమైన ఉద్యోగాలు లేవు. మోడీ హయాంలో పదేండ్లలో గతంలో ఎన్నడూ లేనంత నిరుద్యోగం కనిపించింది. చాలా ప్రభుత్వ గణాంకాలు దీనినే వెల్లడిస్తున్నాయి. గుజరాత్, యూపీ, హర్యానా, రాజస్థాన్‌లకు చెందిన యువత ఇజ్రాయెల్, రష్యాలో ఆ దేశాలు చేస్తున్న ఘోరమైన యుద్ధాల నడుమ ప్రాణాలను ఫణంగా పెట్టి ఉద్యోగాలు చేస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది" అని వారు తెలిపారు. 2014 ఎన్నికల ప్రచారంలో యూపీ, బీహార్‌లలో యువతనుద్దేశిస్తూ మోడీ చేసిన ప్రసంగం ఇప్పుడు గుర్తు తెచ్చుకోవాలన్నారు.



"మీరు నాకు 10 సంవత్సరాలు సమయమివ్వండి. నేను మీ జీవితాలను మారుస్తాను" అని మోడీ అన్నారు. అయితే, భారత్ ఇప్పటికే పదేండ్ల మోడీ పాలనను చూసింది. అయినప్పటికీ, యువత జీవితాలు మారలేదని మేధావులు అంటున్నారు. "భారత్‌లో ఉద్యోగాలు లేవు. దీంతో ఉద్యోగాల కోసం యువత విదేశాలకు వెళ్తున్నది. 1991లో సంస్కరణలు ప్రారంభమైనప్పటి నుంచి 45 ఏండ్లలో అత్యధిక నిరుద్యోగిత స్థాయికి, అత్యల్ప సగటు జీడీపీ పెరుగుదల, తలసరి ఆదాయ వృద్ధికి భారత్ పడిపోయింది" అని చెప్తున్నారు.

మోడీ అధికారంలో ఉన్న దశాబ్ద కాలంలో పెట్టుబడుల్లో అత్యల్ప వృద్ధి నమోదైంది. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు భారత్ అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానమని మోడీ సర్కారు చెప్తున్నప్పటికీ.. దానిని పెట్టుబడిదారులెవరూ నమ్మకపోవటం కారణంగానే ఈ పరిస్థితి ఎదురైందని విశ్లేషకులు చెప్తున్నారు. " వినియోగ డిమాండ్ చాలా తక్కువగా ఉన్నప్పుడు కొత్త పెట్టుబడులు ఎలా వస్తాయి? ఇది నేటికీ చాలా ఆందోళన కలిగించే విషయం. ఎందుకంటే, భారత జీడీపీ వృద్ధిలో దాదాపు 60 శాతం ప్రయివేటు వినియోగం. కొంతకాలం క్రితం ప్రభుత్వం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత దశాబ్దంలో సగటు ప్రయివేట్ వినియోగ వృద్ధి వార్షికంగా కేవలం 3 శాతం మాత్రమే ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త ప్రయివేట్ పెట్టుబడులు ఎలా ఫలిస్తాయి?" అని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా, 2017-18 నుంచి 2022-23 వరకు ఐదేండ్లలో భారతదేశంలో వేతన వృద్ధిలో స్తబ్ధత నెలకొన్నదని సాక్షాత్తూ ప్రభుత్వ గణాంకాలే సూచిస్తున్నాయని అంటున్నారు. ఇన్‌కార్పొరేటెడ్ ఎంటర్‌ప్రైజెస్ విడుదల చేసిన వార్షిక సర్వే ప్రకారం..2011-12తో పోలిస్తే 2022-23లో యువత నిరుద్యోగం (15 నుంచి 29 ఏండ్ల మధ్యవారు) రెండింతలు పెరిగి 12 శాతానికి చేరుకున్నది. ఆర్థిక వ్యవస్థ, నిరుద్యోగం వంటి విషయంలో మోడీ సర్కారు ఇప్పటికైనా ఆత్మ విమర్శ చేసుకోవాలని నిపుణులు అంటున్నారు.

రేపు గంటేడ గౌరునాయుడు 'కథాసంధి'

ప్రజాశక్తి- విజయనగరం

సాహితీ స్రవంతి, సాహిత్య అకాడమీ సంయుక్త నిర్వహణలో ఈ నెల 14వ తేదీ ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు విజయనగరం జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్లో ప్రముఖ కథారచయిత గంటేడ గౌరునాయుడుతో 'కథాసంధి' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో గౌరునాయుడు పాఠకులతో ముచ్చటిస్తారని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు చీకటి దివాకర్ తెలిపారు.

టీనేజ్ ప్రెగ్నెన్సీపై డబ్ల్యూహెచ్‌వో ఆందోళన

న్యూఢిల్లీ: భారత్‌తో సహా ఆగ్నేయాసియా ప్రాంతంలో టీనేజీలో బాలికలు గర్భందాల్చి, శిశువులకు జన్మనివ్వటం పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఇక్కడ ఏటా 15 నుంచి 19 ఏండ్ల మధ్య వయసున్న బాలికలు దాదాపు 60 లక్షల మంది టీనేజ్ బాలికలు జన్మనిస్తారని వివరించింది. కౌమారదశలో ఉన్న గర్భందాల్చటం బాల్య వివాహాలకు దగ్గరి సంబంధం కలిగి ఉన్నదని డబ్ల్యూహెచ్ఓ పేర్కొన్నది. డబ్ల్యూహెచ్ఓ ఆగ్నేయాసియా ప్రాంతీయ డైరెక్టర్ సైమా వాజెద్ మాట్లాడుతూ.. "బాల్య వివాహాలు బాలికల ప్రాథమిక మానవ హక్కులను ఉల్లంఘించ టమే. ఇది వారి ఎంపికలు, శారీరక, మానసిక ఆరోగ్య ఉన్నత ప్రమాణాలను ఆస్వాదించే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ఇది వారి చదువుకు ఆటంకం కలిగిస్తుంది. కౌమారదశలో ఉన్న తల్లులు పాఠశాలకు వెళ్లడం చాలా తక్కువగా ఉంటుంది. ఇది నైపుణ్యాలు, జ్ఞానాన్ని పెంపొందించుకోకుండా అడ్డుకుంటుంది. దీంతో వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించకుండా అడ్డుకుంటుంది" అని చెప్పారు. సౌత్ ఏషియన్ అసోసియేషన్ ఫర్ రీజినల్ కోఆపరేషన్(సార్క్), డబ్ల్యూహెచ్ఓ, యూనిసెఫ్, యూఎన్ఎఫ్‌పీఏ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పై విధంగా స్పందించారు. కౌమారదశలో గర్భం దాల్చటం భవిష్యత్తు తరాలను కూడా ప్రభావితం చేస్తుందన్నారు. 20 నుంచి 30 ఏండ్లలోపు మహిళలతో పోలిస్తే.. యుక్తవయసులోని తల్లులు కూడా ప్రసూతి కారణాలతో చనిపోయే ప్రమాదం చాలా ఎక్కువ అని ఆమె అన్నారు. తల్లి వయస్సు తగ్గటంతో ఈ ప్రమాదాలు పెరుగు తాయనీ, 16 ఏండ్లలోపు యుక్తవయస్కులు 20 ఏండ్లు పైబడిన మహిళలతో పోలిస్తే ప్రసూతి మరణానికి నాలుగు రెట్లు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారని చెప్పారు. అంతేకాకుండా, వృద్ధ మహిళలకు జన్మించిన పిల్లలతో పోలిస్తే యుక్తవయసువారికి జన్మించిన పిల్లలు కూడా మరణానికి సంబంధించి చాలా ఎక్కువ ప్రమాదాన్ని ఎదుర్కొంటారని ఆమె వివరించారు.

అదానీ ఫైలు క్లియర్ !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈ నెల 11న జరిపిన సుడిగాలి పర్యటనలో అదానీ డేటా సెంటర్ ఫైలుకు క్లియరెన్స్ లభించింది. తాజా పర్యటనలో అనేక అంశాలపై అధికారులను బాబు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనుల దశ, భూముల కేటాయింపు, అక్కడ ప్రస్తుతం ఏం జరుగుతుందన్న అంశాలపై దృష్టిసారించినట్లు కనిపిస్తోంది. జగన్ ప్రభుత్వంలో గౌతమ్ అదానీకి ఐటి హిల్ నెంబరు 4పైన 130 ఎకరాలను క్లౌడ్ కంప్యూటరింగ్, డేటా సెంటర్ కోసం కేటాయించిన సంగతి తెలిసిందే. ఎయిర్ పోర్టులో గురువారం సాయంత్రం అధికార యంత్రాంగంతో నిర్వహించిన సమీక్షలో అదానీ ఫైలు గురించి పరిశ్రమల శాఖ, ఎపిఐఐసి అధికారులను బాబు పలు వివరాలు అడిగారు. అన్నింటినీ క్షుణ్ణంగా ఆరా తీశారు. ఎండాడ లా కాలేజీ నుంచి దిగువ రోడ్డులోగల పనోరమ హిల్స్ ఎడమ వైపుగల 287 ఎకరాల ప్రభుత్వ కొండపై అదానీ డేటా సెంటర్ కోసం గతంలోనే 130 ఎకరాలు కేటాయించారు. దీనిపై సిఎం చంద్రబాబు స్పందిస్తూ 25 వేల మందికి ఉద్యోగాలు రాబోతున్నాయని, దీనికి సంబంధించిన క్లియరెన్స్‌లన్నీ చేయాల్సిన అవసరం ఉందని చెబుతూ పలు సూచనలు చేశారు.

నైపుణ్యాభివృద్ధిలో సహకరించండి

- సిఐఐని కోరిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రధాన కార్యదర్శి సౌరవ్ గౌర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

నైపుణ్యాభివృద్ధిలో ప్రభుత్వానికి సహకరించాలని ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సౌరభ్ గౌర్ కోరారు. సిఐఐ ఆంధ్రప్రదేశ్ 'ఇండియన్ ఎకోసిస్టమ్ నీడ్స్ ఇండియన్ మేనేజ్‌మెంట్ ఎథోస్' అనే థీమ్‌తో సెకెండ్ ఎడిషన్ హెచ్‌ఆర్ సెమినార్‌ను శుక్రవారం ఉదయం విశాఖలోని నోవటల్ హోటల్‌లో నిర్వహించింది. దీనికి ఆయన వర్చువల్ విధానంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన నైపుణ్య గణన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని నైపుణ్యత కలిగిన వారిని గుర్తించి వారికి ఉద్యోగ కల్పనకు ప్రభుత్వం కృషి చేయనుందన్నారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సిఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కావాలంటే మరిన్ని పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన అవసరమన్నారు. పరిశ్రమలను, విద్యాసంస్థలను ఒక తాటిపైకి తీసుకువచ్చి ఏ విధంగా విద్యార్థులను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలో ఈ సదస్సు తెలియజేసిందన్నారు.

నెల్లూరులో ఉపాధి సంక్షోభం

- కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ మూసివేత
- 600 అనుబంధ కంపెనీలదీ అదే బాట
- రోడ్డునపడ్డ 10 వేలమంది ఉద్యోగులు
- దిక్కుతోచని స్థితిలో కుటుంబాలు

కృష్ణపట్నం పోర్టు ప్రాంతంలో 96 కంపెనీలు మూతపడ్డ డిఎన్‌జె కాంప్లెక్స్



పి. బాలకృష్ణ

నెల్లూరుజిల్లాలో ఉపాధి సంక్షోభం నెలకొంది. కృష్ణపట్నం పోర్టుకు అనుబంధంగా ఏర్పడిన వందలాది సంస్థల్లో చిన్నా చితక ఉద్యోగాలు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్న వేలాదిమంది రోడ్డునపడ్డారు. కృష్ణపట్నం పోర్టును చేజిక్కించుకున్న అదానీ గ్రూపు కంటైనర్ టెర్మినల్ ను మూసివేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. అధికారికంగా ఒక్క ప్రకటన కూడా చేయకుండా పోర్టు యాజమాన్యం టెర్మినల్ పోర్టును గుట్టుచప్పుడు కాకుండా చెన్నైకు తరలించింది. ఏం జరుగుతుందో అర్థం చేసుకునే లోపే దాని కార్యక్రమాలు నిలిచిపోయాయి. పనులు లేక అనుబంధ సంస్థలు వెలవెలబోయాయి. మరో మార్గం లేక ఒకదాని తరువాత ఒకటిగా దాదాపు 600 కంపెనీలు మూతపడ్డాయి. మరికొన్న కంపెనీలు కూడా అదే బాట పట్టడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ సంస్థల్లో పనిచేస్తున్న దాదాపు 10 వేల మంది ఉద్యోగులు, కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. 'అదాని' మనసు మారుతుందన్న ఆశతో అప్పులతో రోజులు నెట్టుకొస్తున్నారు. అప్పులిచ్చిన వాళ్ళ కూడా నిలదీసే పరిస్థితులు వస్తుండటంతో కుటుంబాలు దిక్కుతోచని స్తితిలో పడ్డాయి. ఇప్పటికే ఉన్న నిరుద్యోగులకు వీరు కూడా తోడు కావడంతో ఉపాధి సమస్య తీవ్రంగా మారింది. ఎన్నికలకు ముందు తెలుగు దేశం పార్టీ నాయకులు టెర్మినల్ పోర్టు తరలింపు అంశాన్ని ప్రశ్నించారు. బాధితులకు అండగా ఉంటామని ప్రకటించారు. అధికారంలోకి రావడంతో ఇప్పుడు వారు ఎలా స్పందిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. కృష్ణపట్నం పోర్టులో 2012 సెప్టెంబర్‌లో కెపిసిల్ కంటైనర్ టెర్మినల్ ను ప్రారంభించారు. చెన్నయ్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, రవాణా ఛార్జీలు ఎక్కువ కావడంతో ఒంగోలు, నెల్లూరు, గుంటూరు, కడప, అనంతపురం, కర్నూల్‌తోపాటు బళ్లారి, బెంగుళూరు, కర్ణాటక ప్రాంతాల నుంచి అనేక రకాల వస్తువులు కృష్ణపట్నం పోర్టు నుంచి ఎగుమతులు జరిగేవి. పోర్టుకు భారీగా ఆదాయం రావడంతో ఆధునిక యంత్రాలను లోడింగ్, అన్‌లోండింగ్‌కు మార్చారు. ఆదాయం కూడా భారీగా చేకూరింది. దీంతో చెన్నయ్, బెంగుళూరు, గుజరాత్‌కు సంబంధించిన అనేక కంపెనీలు ఇక్కడ కార్యాలయాలు ప్రారంభించాయి. కంటైనర్లు బుక్ చేసుకోవడం, కస్టమ్స్ క్లియరెన్స్, శుద్ధిచేయించడం, ఓడకు ఎక్కించడం, దిగుమతి వచ్చిన వాటిని క్షేమంగా వ్యాపారులకు చేర్పించడం తదితర పనులు ఇక్కడ చేసేవారు. ఒక్కో ఆఫీసులో సుమారు 20 నుంచి 150 మంది వరకు ఉద్యోగులు పనిచేసేవారు. వీరిలో అత్యధికులు డిగ్రీ, పిజిలు పూర్తిచేసినవారు కావడం గమనార్హం

మూతపడ్డ కంపెనీలు ...

కంటైనర్ టెర్మినల్‌ను చెన్నైకు తరలించాలన్న నిర్ణయం తీసుకున్న అదాని గ్రూపు ఈ ఏడాది జనవరి నుండి ఒక వ్యూహం ప్రకారం వ్యవహరించింది. కొంచెంకొంచెంగా ఇక్కడ కార్యక్రమాలను తగ్గించివేసింది. కీలకమైన భాగాలను గుట్టుచప్పుడు కాకుండా తరలించివేసింది. దీంతో ఒక దాని తరువాత ఒకటిగా దానిపై ఆధారపడ్డ అనుబంధ సంస్థలు మూతపడటం ప్రారంభించాయి. ఆరు సంవత్సరాల క్రితం చెన్నయ్‌కు చెందిన ఓ రియల్ ఏస్టేట్ వ్యాపారి పోర్టులోని అదాని ఇంటర్‌నేషనల్ స్కూల్ పక్కనే డిఎన్‌జె కాంప్లెక్స్ పేరుతో నాలుగు బ్లాకుల్లో నిర్మించారు. ఇక్కడ సుమారు 96 కంపెనీలు ఆఫీసులు ప్రారంభించారు. ప్రస్తుతం ఒక్క కంపెనీ మాత్రమే మిగిలింది. మిగిలిన వారు కొన్ని నెలల క్రితమే ఖాళీ చేసి వెళ్లిపోయారు. ముత్తుకూరు, పోర్టు పరిసర ప్రాంతాల్లో ప్రారంభించిన దాదాపు 600 కంపెనీలు మూత పడ్డట్టు చెబురతున్నారు. వీటిలో పనిచేసే సుమారు 10 వేల మంది ఉద్యోగులు పనులు కోల్పోయి రోడ్డునపడ్డారు. వీరు కాకుండా

కంటైనర్ టెర్మినల్‌కు సంబందించిన ఉద్యోగస్తులు, లారీ డ్రైవర్లు, ఆఫీసు స్టాఫ్, మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్ల ఉదోగాలు కూడా పోయాయి,

మా జీవితాలు నాశనం చేశారు..



నేను 13 సంవత్సరాల నుంచి పోర్టులో పనిచేస్తున్నాను.. మా జీవితాలు, జీతాలు బాగుండేవి. రూ.85 వేలు నా జీతం. ముత్తుకూరులోనే అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నా. సంతోషంగా ఉన్న మా జీవితాల్లో అదాని రూపం లో ప్రమాదం వచ్చింది. కంటైనర్ టెర్మినల్‌లో పనిచేస్తున్నా, జనవరి 31 నుంచి నిలిచిపోయింది. ఉద్యోగాలు తొలగించారు. అప్పులు చేసుకొని జీవిస్తున్నాం. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఎంబిఎ చదువున్నా నాలాగా సుమారు 10 వేల మంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డాం. ఇది బయట ప్రపంచానికి తెలియకుండా పోర్టు యాజమాన్యం మేనేజ్ చేస్తుంది.

బి.రామారావు ఎంబిఎ

పది కంపెనీల్లోనే 990 మంది

టెర్మినల్ పోర్టు మూసివేతతో మూతనపడ్డ కంపెనీలు, పోయిన ఉద్యోగాల వివరాలనే సేకరించడానికి ప్రజాశక్తి ప్రయత్నించింది. ప్రాథమిక పరిశీలనలోనే పది కంపెనీల్లో 990 మంది ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డటు తేలింది. వీరిలో ఎక్కువ మందికి ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా అప్పటికప్పుడు ఉద్యోగాల నుండి తొలగించినట్లు యాజ మాన్యాలు తెలిపాయి. దీంతో వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆ కంపెనీల వివరాలు

	కంపెనీ	తొలగించిన ఉద్యోగులసంఖ్య
1.	ఫవర్ ఇంజినీరింగ్	150
2.	శ్రావణ్ ఎంటీ యార్డ్	100
3.	ఎసిటి (ఎంటి యార్డ్)	70
4.	జిర్‌కాన్ ఇంజినీరింగ్	50
5.	వివిఎస్ గ్లోబల్	70
6.	గేట్‌వే డిసిట్రీన్ పార్సు	150
7.	సీ బ్రాడ్ సిఎఫ్ఎస్	150
8.	యుపిఐ ప్లేమిర్స్	150
9.	ఎస్‌కెఆర్ గోడౌన్లు	100
10.	ఎంఎస్ గౌడమ్స్	100



టీచర్‌గా మారిన కలెక్టర్

- పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించిన చేతన్

ప్రజాశక్తి - చిలమత్తూరు

శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్‌కుమార్ టీచర్‌గా మారి పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం చిలమత్తూరు మండల పరిధిలోని కస్తూరిబా బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యా బోధన , మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ పదో తరగతి చదివే విద్యార్థులకు సాంఘిక శాస్త్రానికి సంబంధించిన ఫెడరలిజంపై బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనా ఉండాలన్నారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు ఖర్చుచేస్తోందని అందుకు తగిన విధంగా విద్యా ఫలితాలు ఉండాలని అన్నారు. జిల్లాలో వివిధ కార్యక్రమాలలో పాల్గొనే క్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను తప్పనిసరిగా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు తన పరిశీలనలో తేలితే సంబంధిత సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను కూడా తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ భాగ్యలత, కెజిబివి ఎస్ఒ సునీత కుమారి తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం



ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో గోదా వరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో, ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులు శబరి, ఇంద్రావతి, సీలేరు, కిన్నెరసాని, మానేరు, ప్రాణహిత, మంజీర, పూర్ణ, ప్రవర నుంచి గోదావరిలో వరద జలాలు ప్రవహిస్తున్న నేపథ్యంలో నీటిమట్టం గత రెండు రోజులుగా క్రమక్రమంగా పెరుగుతుంది. స్పిల్ వేలోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో స్పిల్ వేలో సాధారణ నీటిమట్టం నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 26.970 మీటర్లు, స్పిల్ వే దిగువన 17.060 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యాంకి ఎగువన 27.050 మీటర్లు, దిగువ కాపర్ డ్యాంకి దిగువన 16.080 మీటర్లు నమెదైనట్లు ఇఇలు టి.వెంకటరమణ, మల్లి కార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 7.080 క్యూసెక్కుల జలాలు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7.080 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.387 మీటర్లకు చేరుకుందని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 20 పంపులు 20 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెలలో ఇప్పటివరకూ 4.015 టిఎంసిల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

ఖాళీ కంచాలతో రాక్ కార్మికుల నిరసన



ప్రజాశక్తి-సామర్లకోట (కాకినాడ జిల్లా)

అక్రమ తొలగింపులకు నిరసనగా రాక్ సిరామిక్స్ గేటు ముందు సిఐటియు ఆధ్వర్యంలో రాక్ సిరామిక్స్ కార్మికులు శుక్రవారం ఖాళీ కంచాలతో నిరసన తెలిపారు. కార్మికుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ గేటు ముందు కార్మికుల పోరాటం 88వ రోజుకు చేరుకుందని అన్నారు. కార్మికులను అక్రమంగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించిందన్నారు. ఐదుసార్లు జాయింట్ లేబర్ కమిషనర్ వద్ద చర్చలు జరిగినా యాజమాన్యం మంకు పట్టుదలతో వ్యవహరిస్తుందన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతుంటే కార్మిక శాఖ అధికారులు ఎందుకు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించలేదని ప్రశ్నించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రికి కూడా కంపెనీ యాజమాన్యం అబద్దాలు చెబుతోందని ఎద్దేవా చేశారు. ఈ నిరసనలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతి కుమార్, చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు, గంగాధర్, క్రాంతి, మంగారావు, అర్జున్ రావు, మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న, ప్రభుదాస్, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్ కుమార్, శివ నారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

తిరుపతిలో 'అతిసార' కలకలం

- ఇప్పటికే ముగ్గురు మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- పిచ్చాటూరులో 35మందికి..

ప్రజాశక్తి - తిరుపతి, పిచ్చాటూరు

తిరుపతి జిల్లాలో అతిసార వ్యాధి రోజురోజుకీ ప్రబలుతోంది. పది రోజుల కాలంలోనే ముగ్గురు మృతి చెందారు. జిల్లాలో 200కు పైగా కేసులు నమోదవడం కలకలం రేపుతోంది. ప్రస్తుతం మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో పాటు శ్రీకాళహస్తి, పిచ్చాటూరు, గూడూరు, తిరుపతి, చంద్రగిరి పరిసర గ్రామాల్లో విస్తృతంగా ప్రబలుతోంది. తిరుపతి రుయాతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులలో రోగుల తాకిడి పెరుగుతోంది. నాలుగు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిలు మంగళంలో డయేరియా పై అవగాహన కల్పిస్తూ పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన చేపట్టాలని పిలుపునిచ్చారు. అయితే మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు మరింత చొరవ తీసుకుని పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టకపోవడంతో అతిసార రోజురోజుకూ పెరుగుతోంది. పిచ్చాటూరు మండలం నీరువాయి హరిజనవాడలో దాదాపు 35 కేసులకుపైనే నమోదవడం గమనార్హం. ఈ నేపథ్యంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి శుక్రవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అయితే ఆ ప్రాంతంలో తాగునీరు కలుషితమవ్వడం, పరిసరాలంతా అపరశు భ్రంగా ఉండడంతోనే అతిసార వ్యాపిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

నీరువాయిలో 35 మందికి...

పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామానికి చెందిన 35 మందికి డయేరియా సోకింది. వీరంతా నగరి ఏరియా ఆస్పత్రిలోనూ, తిరుపతి రుయాలోనూ చికిత్స పొందుతున్నారు. 35 మందిలో 23 మంది రికవరీ అయ్యి ఇంటికి చేరుకున్నారు. 12 మంది నగరిలోనూ, 9 మంది తిరుపతి రుయాలోనూ చికిత్స పొందుతున్నారు. నీరు, ఆహారం కలుషితం వల్లనే వీరు అనారోగ్యం పాలైనట్లు వైద్య అధికారి అహ్మద్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాధారాణిలు డిఎంహెచ్ఒ శ్రీహరికి తెలియజేశారు.

ఆన్‌లైన్ మోసం

- రూ.5.80 లక్షలు స్వాహా

ప్రజాశక్తి-టి.నరసాపురం (ఏలూరు జిల్లా)

ఆన్‌లైన్‌లో మోసగించి రూ.5.80 లక్షలు స్వాహా చేసిన సంఘటన ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలంలోని బొర్రంపాలెంలో వెలుగు చూసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన కొత్త ప్రద్యుమ్న సెల్‌ఫోన్‌కు తన ఆధార్ నెంబరుతో ముంబాయి నుంచి తైవాన్‌కు కొరియర్ బుక్ చేశావంటూ గుర్తు తెలియని ఫోన్ నెంబర్ నుంచి ఒక వ్యక్తి ఫోన్ చేశాడు. ఆ కొరియర్‌తో తన సంబంధం లేదని ప్రద్యుమ్న తెలిపినప్పటికీ తాము పోలీసులమని హర్యాణా, గుర్గావ్, పాట్నాలలో కూడా నీకు ఖాతాలు ఉన్నాయని, వాటిని పరిశీలిస్తున్నామని, నీ ఖాతాలోని 93 శాతం నగదు బదిలీ చేస్తే 15 నిమిషాల్లో మళ్లీ మెనక్కి పంపుతామని అటువైపు వ్యక్తి తెలిపాడు. దీంతో ప్రద్యుమ్న తన ఖాతా నుంచి రూ.5.80 లక్షలను బదిలీ చేయగా అటువైపు నుంచి బదులు రాకపోవడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించాడు. ప్రద్యుమ్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో సమర్పించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఈ ఏడాది తప్పకుండా ఆగస్టు 31లోపు స్కాలర్‌షిప్ పోర్టల్ www.scholarships.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని జి పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. 2020, 2021, 2022 సంవత్సరాలలో ఎంపికైన విద్యార్థులు తప్పకుండా ఈ ఏడాది రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. ఫ్రెష్ / రెన్యువల్ దరఖాస్తులను సమర్పించడానికి ఆగస్టు 30వ తేదీ ఆఖరు అని తెలిపారు. విద్యార్థులు తమ వివరాలను ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా మెరిట్ లిస్ట్ లో ఉన్న విధంగానే ఆధార్‌లో ఉండేవిధంగా సరిచూసుకుని పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తప్పకుండా తన ఆధార్ నెంబర్‌ను తన బ్యాంక్ ఖాతాకు సీడ్ చేయించుకొని డిబిటి ద్వారా డబ్బులు జమయ్యేవిధంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-డెంకాడ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా డెంకాడ మండలంలోని అక్కివరం గ్రామంలో పిడుగు పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అక్కివరం గ్రామానికి చెందిన కంది సోమగారి సూర్యనారాయణ (54) తన పశువులను మేత కోసం పొలానికి తోలుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి పశువులను తోలుకు వస్తున్న సమయంలో ఉరుములు, ఈదురు గాలులతో వర్షం వచ్చింది. అదే సమయంలో పిడుగు పడి అక్కడికక్కడే సూర్యనారాయణ మృతి చెందాడు. స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి సపర్యాలు చేసినా ఫలితం దక్కలేదు. సూర్యనారాయణకు భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. డెంకాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

కేరళ ప్రజల కల సాకారమైన వేళ...!

- విజింజం ఓడరేవు ట్రయల్ రన్ ప్రారంభం
- మొదటి మదర్‌షిప్ శాన్ ఫెర్నాండో రాక

ప్రజాశక్తి ప్రతినిధి - తిరువనంతపురం

కేరళ సముద్ర జలాల చరిత్రలోనే అద్భుతమైన క్షణం ఆవిర్భవించింది. తిరువనంతపురం సమీపంలోని విజింజం అంతర్జాతీయ ఓడరేవుకు మొట్టమొదటి కంటెయినర్ ఓడ వచ్చింది. సహజసిద్ధమైన ఈ ఓడరేవు అభివృద్ధిని, రాష్ట్ర అభివృద్ధి పట్ల వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వానికి గల అచంచలమైన, తిరుగులేని నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యాధారంగా పరిగణించాల్సి వుంటుంది. 300 మీటర్ల పొడవైన అతిపెద్ద భారీ నౌక శాన్ ఫెర్నాండో విజింజం ఓడరేవులో లంగరు వేసింది. ట్రయల్ రన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుదీర్ఘ కాలంగా కేరళ ప్రజలు కన్న కల సాకారమైందని వ్యాఖ్యానించారు. ఓడరేవు అనేది ఆర్థికాభివృద్ధికి అతిపెద్ద ప్రొపెల్లర్ అని పేర్కొన్నారు. విజింజం అంతర్జాతీయ ఓడరేవుతో కేరళ అభివృద్ధి చరిత్రలో కొత్త పుట తెరుచుకుందని, కేరళకు కొత్త అధ్యాయం మొదలైందని తెలిపారు. నిజానికి యావత్ దేశానికే ఇదొక గర్వకారణమన్నారు. ఇటువంటి తరహా ఓడరేవులు ప్రపంచవ్యాప్తంగా చాలా కొద్ది సంఖ్యలోనే వున్నాయన్నారు. దీంతో, అంతర్జాతీయ మ్యాప్‌లో భారత్‌కు స్థానం లభించిందన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ఓడరేవుల్లో విజింజం ఓడరేవు ఒకటి. పెద్ద సంఖ్యలో ఈ ఓడరేవుకు ఇలాంటి భారీ నౌకలు వస్తాయన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద నౌకలకు ఆశ్రయం కల్పించే ప్రదేశంగా ఎదిగిందన్నారు.

'ఇది ట్రయల్ రన్ అయినప్పటికీ, దీంతో ఓడరేవు కార్యకలాపాలు ప్రారంభమైనట్లే. ఇక ఇప్పటి నుండి ఈ పోర్టు పూర్తి స్థాయిలో తన సేవలందిస్తుంది. ఓడరేవులన్నింటికీ మదర్ పోర్ట్‌గా వర్ణించదగిన రీతిలో విజింజం పోర్ట్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇది గర్వకారణమైన క్షణం. ఇది ఇక్కడితో ఆగిపోరాదని' విజయన్ అన్నారు. పోర్టు మొదటి దశ పూర్తయింది. ఇంకా 2,3,4 దశలు పనులు జరుగుతున్నాయని, అవి పూర్తయితే అప్పుడు ఈ పోర్టు పెద్ద నౌకా కేంద్రంగా మారుతుంది. 2045కల్లా ఇది పూర్తవుతుందని తొలుత అంచనా వేశారు. ప్రస్తుతం జరిగిన పనులు తీరు చూస్తుంటే 17సంవత్సరాల ముందుగానే పూర్తి కానుందని, 2028కల్లా పూర్తి స్థాయిలో పోర్టు కార్యకలాపాలు నిర్వహించగలదని తెలుసుకుంటే చాలా సంతోషమనిపిస్తోందని విజయన్ పేర్కొన్నారు. రూ.10వేల కోట్ల మేర నిధులు కేటాయించడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. షెడ్యూల్ కన్నా 17సంవత్సరాలు ముందుగానే పోర్టు సిద్ధమవడానికి, రాష్ట్రం కాంట్రాక్టుపై సంతకం చేయడానికి ఇది వీలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఓడరేవులు శాఖ మంత్రి శర్వానంద్ సోనోవాల్, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. రూపకల్పన, నిర్మాణం, ఫైనాన్స్, నిర్వహణ, బదలాయింపు (డిబిఎఫ్ఓటి) నమూనాలో బహుళార్థ ప్రయోజనాలు కలిగిన, రూ.7600 కోట్ల వ్యయం కాగల ఈ సీ పోర్ట్ ప్రాజెక్టును అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టింది. ఈ ప్రాజెక్టుపై ఏళ్ళ తరబడి చర్చ జరుగుతోంది.

వరుసగా వచ్చిన ప్రభుత్వాలు దీన్ని అమలు చేయడానికి గల వివిధ మార్గాలను పరిశీలిస్తూ వచ్చాయి. 2015లో, కేరళలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అదానీ గ్రూపుతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఒప్పందం మేరకు అదానీ గ్రూపు రూ.2,454 కోట్లు పెట్టుబడులు పెడుతుంది. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌గా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మరో రూ.1635 కోట్లను సమీకరించాల్సి వుంది. కేరళ ప్రభుత్వం 500 ఎకరాల భూమిని అందజేసింది. డిబిఎఫ్ఓటి ఒప్పందం 40 ఏళ్ల పాటు అమల్లో వుంటుంది. కావాలంటే మరో 20 ఏళ్ల పాటు పొడిగించడానికి కూడా నిబంధనలు పొందుపరిచారు.



ట్రయల్ రన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్

మూడేళ్లు.. పదిశాతం పనులు

- కొనసా.....గుతున్న పెనుకొండ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు
- భూమి చదును, పునాదుల నిర్మాణంతోనే సరి..
- నిర్ధేశించిన గడువు పూర్తయినా స్లాబ్ దశ పూర్తికాని వైనం
- కొత్త ప్రభుత్వమైనా పనులను వేగవంతం చేసేనా..?

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణం మడకశిర రహదారిలోని గొర్రెల పెంపక క్షేత్రంలో 48.49 ఎకరాల భూమిని వైద్య కళాశాలకు కేటాయించారు. 2021 మే 31వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వర్చువల్ పద్ధతిలో పెనుకొండ వైద్య కళాశాల నిర్మాణానికి అప్పుటి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు వైద్య కళాశాలల్లో కొన్నిచోట్ల పనులు పూర్తి అయినప్పటికీ పెనుకొండలో మాత్రం నత్తనడకన ఇంకా సాగుతూనే ఉన్నాయి. నిర్మాణ పనులు ప్రారంభం అయ్యి మూడేళ్ల పూర్తి అయినప్పటికీ పనులు వేగం పుంజు కోలేదు. గత ప్రభుత్వం నిధులు విడుదల జాప్యం చేయడంతోనే పనులు పుంజుకోలేదనే విమర్శలున్నాయి.

నత్తనడకనే పనులు

వైద్య కళాశాల నిర్మాణానికి రూ.475 కోట్ల అంచనా వ్యయంతో శ్రీకారం చుట్టారు. 100 మెడికల్ సీట్లు, 504 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నిర్మాణ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ 2021 జూన్‌లోనే పనులు మొదలు పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. టెండర్ల దశలోనే ఏడాదిన్నర సాగింది. టెండర్లు పూర్తి చేసి 2025 ఆగస్టు 2 నాటికి పూర్తి చేయాలని గడువు విధించింది. ప్రస్తుతం 6 బ్లాకులు, 3 ఫ్లోర్లతో మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు ప్రారంభించింది. 250 మంది కార్మికులు ఇక్కడ పని చేస్తున్నా పనులు వేగవంతం కాలేదు. ఇప్పటి వరకూ 10 శాతం పనులు పూర్తి అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. నిర్మాణ పనులు వేగం పెంచినట్లు నిర్మాణ సంస్థ చెబుతన్నా క్షేత్ర స్థాయిలో మాత్రం ఆ పరిస్థితి కన్పించడం లేదు.



వైద్య తరగతులు..పక్కనే వైద్య చికిత్సలు..

పెనుకొండలో నిర్మిస్తున్న వైద్య కళాశాల నుంచి ఏటా 100మంది వైద్య విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుంది. నాలుగేళ్ల తరువాత వారంతా ఇక్కడే రెసిడెంట్ డాక్టర్లుగా పనిచేయాల్సి ఉంటుంది. వీరి కోసం నివాస గృహాలు ఇక్కడే ఏర్పాటు చేయనున్నారు. నర్సింగ్ విధ్యార్థులూ ఇక్కడ శిక్షణ పొందాల్సి ఉంటుంది. దీంతో పాటు రెగ్యులర్ వైద్యులు, సిబ్బంది ఉంటారు. అదే విధంగా రక్త నిధి కేంద్రం, అత్యవసర చికిత్సలు అందిస్తారు.

2025-2026లో ప్రారంభమయ్యేనా?

వైసిపి ప్రభుత్వంలో మెడికల్ కళాశాల నిర్మాణం పనులను 2023 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని నిర్ధేశించింది. నిధుల విడుదల జాప్యం కారణంగా పనులు వేగం పుంజుకోలేదు. కొత్తగా ఏర్పాడిన తెలుగుదేశం ప్రభుత్వం మెడికల కళాశాల నిర్మాణాలపై దృష్టి సారించి, పనులను వేగవంతం చేసి పూర్తి చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందనే భావన ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. శంకుస్థాపన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న 12 వైద్య కళాశాలల్లో 2024లో అడ్మిషన్లు ప్రారంభిస్తామని ప్రకటించారు. పనులు వేగం అందుకోకపోవడంతో 2025-2026 నాటికి కళాశాలను ప్రారంభిస్తామని తేదీని పొడిగించారు. ప్రస్తుతం జరిగిన నిర్మాణ పనులను చూస్తుంటే మరో మూడేళ్లు గడిస్తేగానీ కళాశాలు పూర్తి అయ్యే అవకాశం కనిపించడం లేదు. అది కూడా పూర్తి స్థాయిలో నిధులు వచ్చి, నిరంతరం పనులు జరిగితేనే పనులు పూర్తవుతాయి. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అయినా మెడికల్ కళాశాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

అగ్నిపథ్ స్కీం ద్వారా ఆగ్నివీర్-వాయు సేనలో ఉద్యోగాలకు ఆన్ లైన్ ద్వారా పురుష, మహిళ అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ తెలిపారు. భారత వాయుసేనలో అగ్నిపథ్ స్కీం ద్వారా వాయు సేనలో ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ / ఇంజినీరింగ్‌లో 3ఏళ్ల డిప్లమా, రెండేళ్ల ఒకేషనల్ కోర్స్ పూర్తి చేసుకున్న అభ్యర్థుల నుండి ఆన్ లైన్ దరఖాస్తులను ఈనెల 8నుంచి 28వరకు https:// agnipathvayu.cdac.in వెబ్‌సైట్ ద్వారా స్వీకరిస్తామని తెలిపారు. సైన్స్ విభాగాల ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ ఫిజిక్స్, మేథ్మెటిక్స్ ఇంగ్లీష్ 50శాతం ఉత్తీర్ణత (లేదా) మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, కంప్యూటర్ సైన్స్, ఇన్స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెసిలిజషన్‌తో 3ఏళ్ల డిప్లమా కోర్స్ 50శాతం ఉత్తీర్ణత (లేదా) రెండేళ్ల ఒకేషనల్ కోర్సులు ఫిజిక్స్, మేథ్మెటిక్స్ 50శాతంఉత్తీర్ణతతో పూర్తి చేసి ఉండాలి. సైన్స్ కాకుండా ఇతర విభాగాల ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ 50శాతం ఉత్తీర్ణత (లేదా) 2 ఏళ్ల ఒకేషనల్ కోర్స్‌లో 50శాతం ఉత్తీర్ణత పాసై ఉండాలి. అభ్యర్థుల వయసు 3.7.2004 నుండి 3.1.2008 మధ్య జన్మించి ఉండాలి. శారీరక దారుఢ్యం 152.5 సెంటి మీటర్లు పురుషులకు, 152 సెంటి మీటర్లు మహిళలకు ఎత్తు కలిగిఉండాలి,గాలి పీలిచినపుడు ఛాతి 5 సెంటి మీటర్ల వ్యాకోచం చెందాలి. దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో రాత పరీక్షలు నిర్వహించి, తదుపరి ఫిజికల్ ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించడం ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుంది. ఎంపికైన వారిని నాలుగేళ్ల షార్ట్ టర్మ్ సర్వీస్ ఆగ్నివీర్-వాయు సేనలో సర్వీస్ లోకి తీసుకుంటారని తెలిపారు.

యూనిఫాం.. అందేదెప్పుడు..!

- ఒక్కో విద్యార్థికి మూడు జతలు అందజేయాలని నిబంధన
- 117 జిఒ రద్దుపై సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలలు తెరిచి నెల రోజులు గడిచిపోయింది. విద్యార్థులకు ఇప్పటి వరకూ యూనిఫారం అందని పరిస్థితి నెలకొంది. దీంతో యూనిఫారం ఎప్పటికిస్తారనే చర్చ తల్లిదండ్రుల్లో సాగుతోంది. ఏలూరు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లు 2,087 వరకూ ఉండగా లక్షా 36 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 1,875 ప్రభుత్వ స్కూళ్లు ఉండగా 99 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. నిబంధనల ప్రకారం స్కూళ్లు తెరిచేనాటికి విద్యార్థులకు పుస్తకాలు, బూట్లు వంటి వాటితోపాటు యూనిఫారం సైతం అందించాలి. ప్రతి విద్యార్థికీ ఏడాదికి మూడు జతలు యూనిఫారం అందించాలనే నిబంధనలు సైతం ఉన్నాయి. ఏడాదిపాటు విద్యార్థులు ప్రతిరోజూ యూనిఫారం ధరించడంతో చినిగిపోవడం పరిపాటిగా జరుగుతోంది. స్కూళ్లు తెరిచేనాటికి యూనిఫారం క్లాత్ ఇస్తే వాటిని కుట్టించుకోవడానికి కొంత సమయం పడుతోంది. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. స్కూళ్లు తెరిచి నెల రోజులు దాటినా యూనిఫారం క్లాత్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు గతేడాది ఇచ్చిన యూనిఫారంనే వాడుతున్నారు. దీంతో కొంతమంది చినిగి దెబ్బతిన్న యూనిఫారం వేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పుస్తకాలు, మిగిలిన వస్తువులు విద్యార్థులకు అత్యధిక శాతం ఇచ్చినప్పటికీ యూనిఫారం మాత్రం ఇప్పటి వరకూ విద్యార్థులకు చేరలేదు. విద్యార్థులకు యూనిఫారం ఎప్పటికిస్తారో సరైన స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు యూనిఫారం క్లాత్ అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అదేక్రమంలో గత ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనులకు సంబంధించి సైతం సందిగ్ధత నెలకొంది. రెండో విడత నాడు-నేడు పనుల్లో వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో చాలా పాఠశాలల్లో పనులన్నీ సగం సగం అన్నట్లు తయారయ్యాయి. వెంటనే నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేస్తేనే స్కూళ్లలో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ప్రభుత్వం దీనిపై వెంటనే తగునిర్ణయం తీసుకుని ముందుకు సాగాల్సి ఉంది. యూనిఫారం అందజేతపై ఏలూరు డిఇఒ అబ్రహంను వివరణ కోరగా ఇంకా అదొక్కటే పెండింగ్ ఉందని, వారం రోజుల్లో యూనిఫారం సైతం అందజేస్తామని తెలిపారు.

117 జిఒ రద్దు చేస్తేనే నాణ్యమైన విద్య

గత ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమల్లోకి తెచ్చి విద్యావ్యవస్థను పూర్తిగా గాడితప్పేలా చేసింది. మూడు, నాలుగు, ఐదు తరగతులను హైస్కూళ్లలో విలీనం చేసింది. దీంతో ప్రాథమిక విద్య విద్యార్థులకు అందుబాటులో లేకుండాపోయింది. హైస్కూళ్లన్నీ దాదాపు గ్రామానికి దూరంగా ఉన్న పరిస్థితి ఉంది. మూడు, నాలుగు, ఐదు తరగతులు చదివే చిన్న పిల్లలను ప్రతిరోజూ అంతదూరం ఒంటరిగా పంపించేందుకు తల్లిదండ్రులు భయపడే పరిస్థితి నెలకొంది. దీంతో డ్రాప్‌వుట్స్ పెరగడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. అంతేకాకుండా నూతన విద్యావిధానంలో భాగంగా ప్రభుత్వం తెచ్చిన 117 జిఒతో విద్యావ్యవస్థ అన్ని రకాలుగా దెబ్బతింది. గతంలో 40 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేవారు. మార్పుల పేరుతో ఒకటి నుంచి ఎనిమిది తరగతుల వరకూ 52 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా చేశారు. తొమ్మిది, పది తరగతులకు 60 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేవిధంగా మార్చేశారు. ఇంగ్లీష్, తెలుగుమీడియంకు వేర్వేరు సెక్షన్లు లేకుండా ఒకటే సెక్షన్‌గా మార్పులు చేశారు. టిడిపి కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో 117 జిఒను రద్దు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ జిఒ రద్దు చేస్తే ఉపాధ్యాయుల సంఖ్య పెరుగుతోంది. ఒకే ఉపాధ్యాయుడు ఉండే పాఠశాలలు తగ్గుతాయి. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంటుంది. దీంతో జిఒ రద్దు ఎప్పుడనే చర్చ సర్వత్రా సాగుతోంది. ప్రభుత్వం వెంటనే 117 జిఒను రద్దు చేసి విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని అంతా కోరుతున్నారు.



జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

- యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిపిఎస్ అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం జిపిఎస్‌ను అమలు చేసేందుకు ప్రయత్నించిందని, పోరాటాలు ఫలితంగా తాత్కాలికంగా గతంలో జిఒను విడుదల చేయలేదని తెలిపారు. ఇప్పుడు పాత తేదీతో జిపిఎస్ అమలు చేస్తూ గెజిట్ విడుదల చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇది ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసపుచ్చటమేనని విమర్శించారు. ఈ గెజిట్‌ను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను తక్షణం అమలు చేసి 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానంలోకి తీసుకోవాలని కోరారు. ఈ గెజిట్‌ను రద్దు చేసి తక్షణం పాత పెన్షన్‌ను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, చిరంజీవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ గెజిట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఎపి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వెల్లడించింది. జిపిఎస్ చట్టాన్ని రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష నెరవేరుస్తామన్న ప్రస్తుత ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగులతో చర్చించకుండా జిపిఎస్ అమలు చేయడం సరికాదని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిఎం దాస్, కె సతీష్ తెలిపారు. ఉద్యోగుల ఆకాంక్ష పాత పెన్షన్ విధానం మాత్రమేనని పేర్కొన్నారు.

అల్ట్రాటెక్ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

- బాధితులకు న్యాయం చేయాలి
- ఎపి సిమెంట్ ఫ్యాక్టరీస్ వర్కర్స్ సమన్వయ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడలోని అల్ట్రాటెక్ సిమెంట్స్ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని ఎపి సిమెంట్ ఫ్యాక్టరీస్ వర్కర్స్ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎ.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమిటీ సమావేశం శుక్రవారం విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ.. ఈ నెల 7న యాజమాన్యం నిర్లక్ష్యం ఫలితంగా ఫ్యాక్టరీ సైక్లోన్ పైప్‌లైన్ పేలి ముగ్గురు చనిపోయారని తెలిపారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారని, వీరిలో మరో ముగ్గురు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. సైక్లోన్ పైప్‌లైన్ లీకేజీ విషయమై అనేకసార్లు యూనిట్ హెడ్, సెక్షన్ హెడ్ దృష్టికి కార్మికులు తీసుకెళ్లినా పట్టించుకోలేదని వివరించారు. ఫలితంగానే ఘోర ప్రమాదం జరిగిందని తెలిపారు. ఫ్యాక్టరీల శాఖ, బాయిలర్ శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు చేయడంలేదని విమర్శించారు. ఈ ప్రమాదంలో ఇప్పటికే ముగ్గురు చనిపోయినా ఫ్యాక్టరీ యజమాన్యంపై హత్య కేసు నమోదు చేయలేదన్నారు. తేలికపాటి సెక్షన్లు పెట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు యాజమాన్యం కొమ్ముకాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో యాజమాన్యాలకు అండగా ఉంటూ, కార్మికుల భద్రతను గాలికి వదిలేయడం సరికాదన్నారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ సిమెంట్స్ వేజ్ బోర్డు ప్రకారం కనీసం వేతనం కూడా అమలు చేయడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే అన్ని సిమెంట్ ఫ్యాక్టరీలు, భారీ పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో విశాఖపట్నం, కడప జిల్లాల నాయకులు కోటేశ్వరరావు, బి.మనోహర్ పాల్గొన్నారు.



సమావేశం మాట్లాడుతున్న కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎ నాగరాజు

బిజెపి ఎమ్మెల్యే రాజీనామా చేయకపోతే

ఇస్లాంలోకి మారిపోతాం

- గుజరాత్‌లో కాంగ్రెస్ దళిత నాయకుడి హెచ్చరిక

న్యూఢిల్లీ : గుజరాత్‌లో బిజెపి ఎమ్మెల్యే గీతబా జడేజా రాజీనామా చేయాలని, ఆమె భర్త జయరాజ్ సిన్హాను అరెస్టు చేయాలని ఆ రాష్ట్ర కాంగ్రెస్ దళిత నాయకుడు రాజేశ్ సోలంకి డిమాండ్ చేశారు. లేకపోతే తమ కుటుంబం, అనేకమంది ఇతరులతో కలిసి ఇస్లాం మతంలోకి మారిపోతామని హెచ్చరించారు. తన కుమారుడు సంజయ్‌పై ఎమ్మెల్యే కుటుంబం అక్రమంగా కేసు పెట్టి పోలీసులతో అరెస్టు చేయించిందని రాజేశ్ సోలంకి ఆరోపించారు. రాష్ట్రంలోని జునాగఢ్ నగర కాంగ్రెస్ ఎస్‌సి, ఎస్‌టి సెల్ అధ్యక్షుడిగా రాజేశ్ సోలంకి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మే నెలలో ఎమ్మెల్యే కుమారుడు జ్యోతిరాదిత్య సిన్హాతో డ్రైవింగ్ విషయంలో తన కుమారుడు వాదించాడని, దీంతో సంజయ్‌ను కిడ్నాప్ చేసి రాజ్‌కోట్ జిల్లాలోని గోండాల్‌కు తీసుకుని వెళ్లారని చెప్పారు. అక్కడ తుపాకీతో బెదిరించి బలవంతంగా క్షమాపణలు చెప్పించారని తెలిపారు. ఈ తరువాత మళ్లీ పోలీసు కేసు పెట్టి అరెస్టు చేయించారని చెప్పారు.

ఆగస్టు 15 లోగా బిజెపి ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే రాష్ట్రరాజధాని గాంధీనగర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహిస్తామని, ముఖ్యమంత్రి, గవర్నర్, బిజెపి అధ్యక్షుడికి వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే తాము ఇస్లాంలోకి మారిపోతామని హెచ్చరించారు. మతం మారడం అనే విషయం సమంజసం కానప్పటికీ.. మమ్మల్ని తోటి హిందువులుగా గుర్తించని వారికంటే, నమాజ్ చేసుకునే వారికి తమ కుమార్తెలను ఇచ్చి వివాహం చేయడం తమకు సంతోషంగా ఉంటుందని సోలంకి తెలిపారు.

రాజస్థాన్ ప్రయివేటు వర్శిటీలో

నకిలీ సర్టిఫికేట్ల కలకలం

జైపూర్: ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల్లో అవకతవకలు వంటి అంశాలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. ఈ తరుణంలో రాజస్థాన్‌లోని చూరూలో ఓం ప్రకాశ్ జోగేందర్ సింగ్ ప్రయివేటు యూనివర్సిటీ నిర్వాకం వెలుగుచూసింది. తప్పుడు డిగ్రీలతో పాటు మునుపటి తేదీలతో డిగ్రీలు ఇచ్చిందనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు.. ఇప్పటివరకు జారీచేసిన వేలకుపైగా డిగ్రీల్లో ఎన్ని నకిలీవి ఉన్నాయనే విషయాన్ని వెలికితీసే పనిలో నిమగ్నమయ్యారు. రాజస్థాన్‌లో ఇటీవల నిర్వహించిన ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్ (పిటిఐ) పరీక్షకు వచ్చిన దరఖాస్తుల్లో 1300 మంది ఈ యూనివర్సిటీ జారీ చేసిన డిగ్రీలనే అందజేశారు. అయితే, 100 సీట్లతో కూడిన ఆ కోర్సుకు 2016లో యూనివర్సిటీకి అనుమతి వచ్చింది.

ఈ పరీక్షకు 2020కి ముందు పట్టాపొందిన విద్యార్థులు మాత్రమే అర్హులు. ఈ లెక్కన డిగ్రీలు పొందిన వారికంటే రెట్టింపు సంఖ్యలో అభ్యర్థులు ఆ యూనివర్సిటీ డిగ్రీలు సమర్పించడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో రాజస్థాన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు జోగిందర్ సింగ్ దలాల్ పాత్ర ఉందనే అనుమానాల నేపథ్యంలో స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ ఆయన్ను అరెస్టు చేసింది.

వీసా దరఖాస్తుల కోసం మునుపటి తేదీలతో డిగ్రీ సర్టిఫికేట్లు జారీ చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఆ యూనివర్సిటీ 2013 నుంచి ఇప్పటివరకు 708 పీహెచ్‌డీలు, 8861 ఇంజినీరింగ్ డిగ్రీలు, 1640 ఫిజికల్ ఎడ్యుకేషన్ డిగ్రీ సర్టిఫికేట్లు జారీ చేసినట్లు గుర్తించారు. వీటితోపాటు ముందస్తు తేదీలతోనూ అనేక తప్పుడు సర్టిఫికేట్లు ఇచ్చినట్లు అనుమానిస్తున్నారు. కేవలం 30 మంది సిబ్బందితో ఆ యూనివర్సిటీని నడిపిస్తుండటంపైనా దర్యాప్తు అధికారులు విస్మయం చెందుతున్నారు.





మీకోసం

పెరుగు పుల్లగా ఉంటే అందులో కొద్దిగా పచ్చి కొబ్బరి పేస్టు కలిపితే, పులుపు తగ్గి రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

గతం నేర్పిన పాఠాలతో భవిష్యత్తు నిర్మించుకోవడం ఉత్తమ మార్గం.

అమ్మ

తొలి చూపు అమ్మ
తొలి పలుకు అమ్మ
తొలి గురువు అమ్మ
ఆకలి వేస్తే అరిచే అరుపు అమ్మ
గాయపడితే పలికే పలుకు అమ్మ
ఏడ్చేటప్పుడు చేసే మారాం అమ్మ
కష్టం వస్తే పంచుకునే నేస్తం అమ్మ
బాధ ఉంటే ఓదార్చే అమృతం అమ్మ



నిన్ను నా మాటల్లో
నా సర్వస్వం నువ్వమ్మా ...
నా ఊపిరి ఉత్సవం నువ్వమ్మా ...


అమ్మా,
ఏమని వర్ణించను
నిన్ను నా అక్షరాలలో
ఏమని వివరించను



- సిహెచ్.త్రిశాంతి,
10వ తరగతి,
అరవింద మోడల్ స్కూలు,
మంగళగిరి.

సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలను ఆంగ్లంలో ఏమంటారో పక్కనే ఇచ్చాం. అయితే అక్షరాలు అటూఇటూ అయ్యాయి. సరైన అర్థం వచ్చేలా కాస్త మీరు సరిచేసి రాయరూ!



నేను గీసిన బొమ్మ





ఎ.మనోజ్ చారి,
7వ తరగతి,
జెడ్‌పిహెచ్
దౌల్తాబాద్,
సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రోత్సహిస్తే పతకాలు సాధిస్తా ...

పవర్ లిఫ్టింగ్ క్రీడలో రాణించాలంటే శక్తి, సాధన, నైపుణ్యం ముఖ్యం. సాధనకు నైపుణ్యం, శక్తికి పౌష్టికాహారం తోడైతే ఉన్నత ఫలితాలు సాధించొచ్చు. శక్తికి తగ్గ సామర్థ్యం, సామర్థ్యానికి తగిన నైపుణ్యంతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్‌లో అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ ప్రపంచస్థాయిలో బంగారు పతకమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు మచిలీపట్టణానికి చెందిన జాతీయ పవర్ లిఫ్టర్ దోనె మురళీకృష్ణ. ప్రభుత్వమూ, దాతలూ తగిన సహకారం అందిస్తే అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తానని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నాడు.



దోనె రాధాకృష్ణ, రమాదేవి దంపతులకు మురళీకృష్ణ ఆగస్టు 20, 2001న జన్మించాడు. తండ్రి ప్రయివేటు ఎలక్ట్రీషియన్. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం అతడి సొంతూరు. స్థానిక నవజీవన్ పబ్లిక్ స్కూలులో హైస్కూలు విద్యను పూర్తి చేసిన మురళీకృష్ణ ... ఆ తర్వాత ట్రిపుల్ ఐటిలో సీటు సాధించి ఇడుపులపాయలో 2022లో బిటెక్ పూర్తి చేశాడు. 2018 నుంచి గత ఆరేళ్లుగా పవర్ లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటూ అనేక పతకాలను సాధించారు. పాఠశాల దశ నుంచి మురళికి ఆటలపై ఆసక్తి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులూ అతడిని ప్రోత్సహించారు. దీంతో, పాఠశాల స్థాయిలోనే రాష్ట్రస్థాయిలో 30 వరకూ మెడళ్లు సాధించాడు. 2018లో ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన సబ్ జూనియర్ పవర్‌లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్‌లో మొదటిస్థానంలో నిలిచాడు. అనంతరం దేశ, విదేశాల్లో జరిగిన పలు చాంఫియన్‌షిప్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను కనబరిచాడు.

ప్రపంచ స్థాయి పోటీలకు ...

ఈ ఏడాది ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకూ యూరప్‌లోని మాల్టా నగరంలో ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్-2024, క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్-2024 పోటీలు జరగనున్నాయి. ఈ రెండు విభాగాల్లోనూ పాల్గొనేందుకు మురళీకృష్ణ ఎంపికయ్యాడు. క్లాసిక్, ఎక్విప్డ్ విభాగాల్లో మనదేశం నుంచి సుమారుగా 20 మంది వరకూ హాజరవుతున్నారు. అయితే, ప్రతి ఒక్కరూ ఏదో ఒక విభాగం నుంచే ఎంపికవుతారు. రెండు విభాగాల్లో పాల్గొన్న మురళీకృష్ణ రెండు విభాగాలకూ ఎంపికవ్వటం అభినందనీయం. ఇలా రెండు విభాగాల్లో ఎంపికై పోటీలకు వెళ్తున్నది మనదేశం నుంచి మురళీకృష్ణ ఒక్కడే! పవర్ లిఫ్టింగ్‌లో రాణించటం అంత సులభం కాదు. ఇందులో రాణించాలనుకునేవారు జిమ్‌లో గంటల తరబడి సాధన చేస్తూ, తగిన పోషకాహారం తీసుకోవాలి. సాధన చేసే సమయంలో నెలకు రూ.15 వేలు వరకూ ఆహారానికే ఖర్చవుతుంది. ఇంత కష్టపడి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడళ్లు సాధించే క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహం అందటం లేదు.

యూరప్‌లోని మల్టా నగరానికి వెళ్లి రావటానికి రూ.6 లక్షల వరకూ ఖర్చు అవుతుంది. అంత మొత్తాన్ని సమకూర్చటం మురళీకృష్ణ కుటుంబానికి తలకు మించిన పని. ఈ నేపథ్యంలో దాతల సహకారం కోసం మురళీకృష్ణ కుటుంబం ఎదురుచూస్తోంది. మచిలీపట్టణానికి చెందిన ఆర్‌కె విద్యాసంస్థల అధినేత బండి రామకృష్ణ రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ...

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తే క్రీడాకారులు మంచి ఫలితాలు సాధిస్తారు. కానీ, మన దగ్గర అంత ఆదరణ దొరకటం లేదు. వివిధ స్థాయిలో పోటీల్లో పాల్గొనటానికి కూడా క్రీడాకారులు సొంత డబ్బులు వెచ్చించి వెళ్లి రావాల్సి వస్తోంది. దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. చదువుతూ క్రీడల్లో రాణించే క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం ఎంతో అవసరం. తద్వారా వారు మరింత ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉంటుంది. ఇతర రాష్ట్రాల్లో బాగా రాణించే పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారులను గుర్తించి వారికి ప్రత్యేక తర్ఫీదును అందిస్తారు. ప్రోత్సాహాలు ఇస్తున్నారు. మన రాష్ట్రంలో అలాంటి పరిస్థితి లేదు. మనరాష్ట్రంలో కూడా అలా చేస్తే దేశానికి పేరు తెచ్చిపెట్టేలా పతకాలు సాధించే పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు ఎంతోమంది తయారవుతారు.

- యడవల్లి శ్రీనివాసరావు

పసిడి పతకమే లక్ష్యం

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఇంతవరకూ మనదేశం నుంచి వరల్డ్ గేమ్స్‌లో ఎవ్వరూ బంగారు పతకం తేలేదు. నేను వరల్డ్ చాంఫియన్‌షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించాలని లక్ష్యంతో ఉన్నాను. ఈ క్రీడలో రాణించాలంటే సాధనకు తగిన పౌష్టికాహారం తీసుకోవాలి. స్పోర్ట్ కోటాలో ఉద్యోగం లభిస్తే ఆర్థిక దన్ను ఏర్పడి మరింత ఉన్నతంగా రాణిస్తాననే నమ్మకం ఉంది. ప్రభుత్వం తగిన సహకారం అందిస్తే- నా ప్రతిభను మరింతగా చాటటానికి అవకాశం ఉంటుంది.

- దోనె మురళీకృష్ణ



సాధించిన పతకాలు

2021 మార్చిలో ఉత్తరప్రదేశ్ (గజిపూర్)లో 53 కేజీల పురుషుల జాతీయ జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంఫియన్‌లో ద్వితీయస్థానం (మూడు కాంస్య పతకాలు)

2022 జనవరిలో రాజస్థాన్ (ఉదయ్‌పూర్)లో జాతీయ జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంఫియన్‌లో మొదటిస్థానం (మూడు బంగారు పతకాలు)

2022 ఏప్రిల్‌లో కేరళ (అలప్పుజా) జాతీయ పురుషుల క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్‌లో మొదటి స్థానం

2023 మేలో తమిళనాడు (కుర్తాల్లమ్)లో జాతీయస్థాయి పురుషుల జూనియర్ ఎక్విప్టెడ్ పవర్‌లిఫ్టింగ్ చాంఫియన్ షిప్ 59 కేజీల జూనియర్ విభాగంలో మూడోస్థానం

2024 ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జాతీయస్థాయి పురుషుల క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్ 59 కేజీల సీనియర్ విభాగంలో మొదటిస్థానం

2024 మేలో ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ పవర్ లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్‌లో ద్వితీయస్థానం, మూడు సిల్వర్ పతకాలు

2024 జూన్‌లో రాజస్థాన్ (గంగానగర్) జాతీయస్థాయి పురుషుల జూనియర్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్‌లో ద్వితీయస్థానం

2024 జూన్‌లో జాతీయస్థాయి పురుషుల జూనియర్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంఫియన్‌షిప్ 59 కేజీల విభాగంలో మొదటిస్థానం, రెండు బంగారు పతకాలు.



రామ్‌చరణ్ సినిమాలో శివరాజ్‌కుమార్

రామ్‌చరణ్ నటిస్తున్న ఆర్‌సి16 సినిమాలో కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్ నటిస్తున్నారు. గతేడాది జైలర్ సినిమాలో అతిథి పాత్రలో ఆయన నటించిన విషయం తెలిసిందే. శుక్రవారంనాడు ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆర్‌సి16లోని ఫొటోని మేకర్లు పోస్ట్‌చేశారు. రామ్‌చరణ్-బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాలో శివరాజ్‌కుమార్ భాగమైనట్లుగా ఈ పోస్టర్ లుక్ ద్వారా తెలుస్తోంది. అందులో తెలుగు సినిమాకు స్వాగతమని పేర్కొన్నారు. ఆయన 2017లో వచ్చిన గౌతమి పుత్ర శాతకర్ణి సినిమాలో అతిథిపాత్రలో నటించారు.ఆ తర్వాత కన్నప్ప సినిమాలోనూ నటించనున్నట్లుగా ఊహాగానాలు వచ్చాయి. దీనిపై విష్ణు స్పందిస్తూ హరహర మహాదేవ్ అని ట్వీట్ చేశారు. ఆర్‌సి 16 సినిమా ఆగస్టులో షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం.

కన్నప్పలో ధనస్సు ధైర్యానికి ప్రతీక : మంచు విష్ణు




హీరో మంచు విష్ణు కొత్త చిత్రం 'కన్నప్ప'. ఇటీవలే ఈ సినిమా టీజర్ కూడా విడుదలైన విషయం తెలిసింతే. తాజాగా విష్ణు తన కన్నప్ప సినిమాలో భాగంగా వాడిన విల్లు విశిష్టతను గురించి చెప్పుకొచ్చారు. "కన్నప్ప'లో తిన్నడు వాడిన విల్లు కేవలం ఆయుధం మాత్రమే కాదు. ఆ ధనస్సు ధైర్యానికి సూచిక. తండ్రీకొడుకుల మధ్య బంధానికి సూచికగా నిలుస్తుంది. కన్నప్ప తండ్రి నాధనాథ తన చేతుల్తో తయారు చేసిన ఆ విల్లు కుటుంబ వారసత్వంగా మారింది. ఆ విల్లుతో కన్నప్ప యుద్ధభూమిలో అసమానమైన బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శిస్తారు. కేవలం ఐదేళ్ల వయసున్న కన్నప్ప అనే యువకుడు ఓసారి అడవిలో క్రూరమైన పులిని ఎదుర్కొంటాడు. ఒక సాధారణ కర్రతో పోరాటం చేసి ఆ పులి నుంచి తప్పించుకుంటాడు. అంత చిన్న వయసులో తన కొడుకు ధైర్య సాహసాల్ని చూసి నాధనాథుడు మురిసిపోతాడు. కన్నప్ప శౌర్యానికి ప్రతీకగా ప్రత్యేకమైన విల్లును తయారు చేస్తాడు. ఆ పులి ఎముకలు, దంతాలతో చేసిన ఆ విల్లు బలానికి, ధైర్య సాహసాలకి ప్రతీకగా నిలుస్తుంది. ఆ విల్లుని రెండుగా విరిస్తే యుద్ధంలో పోరాడేందుకు కత్తుల్లానూ ఉపయోగపడేలా రూపొందించారు' అని వివరించారు. న్యూజిలాండ్‌కు చెందిన చిత్ర కళా దర్శకుడు క్రిస్ ఈ విల్లును తయారుచేశారు. ఈ విల్లుతోనే న్యూజిలాండ్‌లో రెండు నెలల పాటు చిత్రీకరించారు. ముఖేష్ సింగ్ దర్శకత్వం వహించారు. మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్ వంటి ప్రఖ్యాత నటీనటులు భాగమయ్యారు. త్వరలోనే కన్నప్ప థియేటర్లోకి రానుంది.

అనంత అంబానీ పెళ్లికి తెలుగు హీరోలు



టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ హీరోలు మహేష్‌బాబు, రామ్‌చరణ్‌తేజ్ తదితరులు ముంబై వెళ్లారు. అనంత అంబానీ- రాధిక మర్చంట్ పెళ్లికి వీరంతా తమ కుటుంబాలతో కలిసి వెళ్లారు. మహేష్ తన సతీమణి నమ్రతాశిరోద్కర్, కుమార్తె సితారతో కలిసి వెళ్లారు. హీరో రామ్‌చరణ్ తన సతీమణి ఉపాసన, కుమార్తె క్లీంకారతో కలిసి వెళ్లారు.

'తుఫాన్' సినిమాను ఆదరించండి



హీరో విజయ్ ఆంటోనీ నటిస్తున్న లేటెస్ట్ మూవీ "తుఫాన్". ఈ సినిమాను ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ బ్యానర్ పై కమల్ బోరా, డి.లలితా, బి. ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. తనను చిన్న చూపు చూసే సమాజం భవితను మార్చిన ఓ వ్యక్తి కథ ఇది. ఓ దీవి నేపథ్యంగా సాగే ఈ సినిమా షఉటింగ్‌ను అండమాన్, దయ్యూ డమన్‌లలో జరిపారు. తుఫాన్ సినిమా నుంచి రిలీజ్ చేసిన పాటలు, ట్రైలర్లకు మంచి రెస్పాన్స్ వచ్చిందనీ, సినిమాకు కూడా ఇదే పాజిటివ్ రెస్పాన్స్ వస్తుందని ఆశిస్తున్నామనీ, ప్రేక్షకులు తమ సినిమాను ఆదరించాలని చిత్ర మేకర్లు కోరారు. విజయ్ ఆంటోనీ, శరత్‌కుమార్, సత్యరాజ్, డాలీ ధనుంజయ, మేఘా ఆకాష్, మురళీశర్మ, పృథ్వీ అంబర్, శరణ్య పొన్వన్నన్, తలైవాసల్ విజయ్ తదితరులు నటిస్తున్నారు.

15 నుంచి 'సర్దార్ 2' రెగ్యులర్ షూటింగ్



హీరో కార్తీ నటించిన 'సర్దార్' సినిమా తమిళం, తెలుగు భాషల్లో హిట్ సాధించిన విషయం తెలిసిందే. దానికి సీక్వెల్‌గా 'సర్దార్2'ను మేకర్లు ప్రకటించారు. ఈనెల 15 నుంచి చెన్నైలో భారీ సెట్స్‌లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్ 2కి దర్శకత్వం వహించనున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ దీనిని నిర్మించనుంది. సర్దార్ ముగింపులో తరువాయి భాగం కంబోడియాలో జరగబోతుందని రివిల్ అయ్యింది. టాప్ టెక్నీషియన్స్ ఈ సినిమాకు పనిచేస్తున్నారు. యువన్ శంకర్‌రాజా సంగీతం అందించనున్నారు. జార్జ్ సి విలియమ్స్ ఫొటోగ్రఫీ డైరెక్టర్, దిలీప్ సుబ్బరాయన్ స్టంట్ డైరెక్టర్. రాజీవ్ నంబియాన్ ప్రొడక్షన్ డిజైనర్. విజయ్ వేలుకుట్టి ఎడిటర్. ఎపి పాల్ పాండి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్. ఎ.వెంకటేష్ సహనిర్మాతగా, ఎస్.లక్ష్మణ్‌కుమార్ నిర్మాతకు వ్యవహరిస్తున్నారు. మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్లు తెలిపారు.

ఫైనల్‌కు అల్కరాజ్, జకోవిచ్

సెమీస్‌లో ఓడిన వేకిక్, మెద్వదేవ్ ● నేడు మహిళల సింగిల్స్ ఫైనల్ ● వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ


అల్కరాజ్


జకోవిచ్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి డిఫెండింగ్ ఛాంపియన్, స్పెయిన్ యువ సంచలనం, 3వ సీడ్ కార్లోస్ అల్కరాజ్‌తో పాటు అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో అల్కరాజ్ 6-7(1-7), 6-3, 6-4, 6-4తో 5వ సీడ్, రష్యాకు చెందిన డానియేల్ మెద్వదేవ్‌పై విజయం సాధించాడు. మరో సెమీస్‌లో 2వ సీడ్ జకోవిచ్ 6-4, 7-6(7-2), 6-4తో ఇటలీ సంచలనం మసెట్టిని చిత్తుచేశాడు. తొలి సెమీస్‌లో అల్కరాజ్ తొలి సెట్‌ను టై బ్రేక్‌లో చేజార్చుకున్న అల్కరాజ్.. ఆ తర్వాత వరుసగా మూడు సెట్లను చేజిక్కించుకొని ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఆదివారం జరిగే ఫైనల్లో మసెట్టి(ఇటలీ), జకోవిచ్(సెర్బియా) మ్యాచ్ విజేతతో తలపడనున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన అల్కరాజ్.. ఈ ఏడాది జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ ను నెగ్గిన ఉత్సాహంలో ఉన్నాడు. రెండో సెమీస్‌లో జకోవిచ్ తొలి, మూడో సెట్‌లలో ఒక్కో బ్రేక్ పాయి ంట్ సాధించగా..రెండో సెట్ టైబ్రేక్‌కు దారితీసింది.

నేడు మహిళల సింగిల్స్ ఫైనల్..

మహిళల సింగిల్స్ ఫైనల్ శనివారం జరగనుంది. 7వ సీడ్ ఇటలీకి చెందిన పొలిని, 31వ సీడ్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రేజికోవాల మధ్య ఈ టైటిల్ పోరు జరగనుంది. క్రేజికోవా తొలిసారి వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్‌కు చేరగా.. 2021లో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను చేజిక్కించుకొంది. ఇక చెక్‌కు చెందిన పొలిని ఈ ఏడాది జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు చేరి రన్నరప్‌తో సరిపుచ్చుకుంది. వింబుల్డన్ గ్రాండ్‌స్మామ్ ఫైనల్‌కు చేరడం ఇదే ప్రథమం. సెమీస్‌లో పొలిని 2-6, 6-4, 7-6(10-8)తో వేకిక్(సెర్బియా)ను, క్రేజికోవా 3-6, 6-3, 6-4తో 4వ సీడ్ రైబకినా(కజకిస్తాన్)ను చిత్తుచేసి ఫైనల్‌కు చేరారు.

సింధు, ప్రణయ్‌లకు సులువైన డ్రా

26నుంచి పారిస్ ఒలింపిక్స్

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో భారత షట్లర్లకు సులువైన 'డ్రా' లభించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య(బిడబ్ల్యుఎఫ్) శుక్రవారం ఐదు విభాగాలకు గానూ నాలుగింటిలో డ్రాలను ప్రకటించింది. మహిళల సింగిల్స్‌లో పివి సింధు, పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్‌లకు గ్రూప్ దశలో తమకంటే తక్కువ ర్యాంక్ ప్రత్యర్థులు ఎదురుకానున్నారు. దీంతో వీరిద్దరు అలవోకగా నాకౌట్ దశకు చేరుకునే అవకాశముంది. పురుషుల డబుల్స్ డ్రాను మాత్రం బిడబ్ల్యూఎఫ్ వాయిదా వేసింది. బిడబ్ల్యూఎఫ్ వెల్లడించిన డ్రా ప్రకారం సింధు గ్రూప్-ఎమ్‌లో ఉండగా.. అదే గ్రూప్‌లో క్రిస్టిన్ కుబా(ఈస్టోనియా), పాకిస్తాన్‌కు చెందిన నబాహ్ అబ్దుల్ రజాక్ ఉన్నారు. అనంతరం 16వ రౌండ్‌లో సింధుకు చైనాకు చెందిన హీ-బింగ్జియావోను ఢీకొట్టనుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ గ్రూప్-కెలో ఉన్నాడు. ఇదే గ్రూప్‌లో లీ డుయో ఫాట్ (వియత్నాం), ఫాబియన్ రొత్(జర్మనీ) కూడా ఉన్నారు. దీంతో ప్రణయ్ సులువుగా ప్రి క్వార్టర్స్‌కు చేరే చాన్స్ ఉంది. ఇక మరో భారత షట్లర్ లక్ష్యసేన్‌కు కఠినమైన డ్రాలో చోటు దక్కింది. ఈ గ్రూప్‌లో మూడో సీడ్ జొనాథన్ క్రిస్టీ కూడా ఉన్నాడు. 19వ సీడ్ అయిన లక్ష్యసేన్ 2020లో జొనాథన్‌ను ఓడించాడు. జూలై 26నుంచి పారిస్ ఒలింపిక్స్ ప్రారంభం కానున్నాయి. ఏడుగురితో కూడిన భారత బ్యాడ్మింటన్ బృందానికి పుల్లెల గోపీచంద్ కోచ్‌గా.. ప్రకాశ్ పదుకొనే మెంటార్‌గా వ్యవహరించనున్నారు.

పురుషుల సింగిల్స్: గ్రూప్-కె: ప్రణయ్(13), లీ-డక్-పాట్, ఫాబియన్ రోత్

గ్రూప్-ఎల్: లక్ష్యసేన్, జొనాథన్ క్రిస్టీ(3), గోర్డన్, జూలియన్

మహిళల సింగిల్స్: పివి సింధు, క్రిస్టియన్ కుబా, ఫాతిమా, అబ్దుల్ రజాక్

మహిళల డబుల్స్: తానీషా-అశ్విని పొన్నప్ప, నామీ మత్సుయామా-చిహారు షిడా(4), కిమ్ సో యంగ్-కాంగ్ హీ యంగ్, సెటియానా-అంగెలా.

క్రికెట్‌కు ఆండర్సన్ వీడ్కోలు

తొలి టెస్ట్‌లో వెస్టిండీస్‌పై ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో ఇంగ్లండ్ ఘన విజయం



లండన్: ప్రపంచ క్రికెట్‌లో ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ ఆండర్సన్ శకం ముగిసింది. వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ఇప్పటికే ప్రకటించిన ఆండర్సన్.. సొంత గడ్డపై లార్డ్స్ టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 114పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ఆండర్సన్ తన కెరీర్‌ను ఘనంగా ముగించినట్లయ్యింది. కెరీర్ ఆఖరి టెస్టులో నాలుగు వికెట్లు తీసిన ఆండర్సన్ సగర్వంగా ఆటకు గుడ్ బై చెప్పాడు. దీంతో ఆండర్సన్ 22ఏళ్ల సుదీర్ఘ కెరీర్ ముగిసింది. ఓ పేసర్ గాయాలను తట్టుకొని, ఫిట్‌నెస్ కాపాడుకొంటూ 188టెస్టులు, 194వన్డేలతోపాటు 19టి20లు ఆడటం అద్భుతమే. 401 మ్యాచ్‌ల్లో ఆండర్సన్ 991 వికెట్లు పడగొట్టాడు. రెడ్ బాల్ క్రికెట్‌లో 704, వన్డేల్లో 269, టీ20ల్లో 18 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. టెస్టుల్లో ముత్తయ్య మురళీధరన్(శ్రీలంక), షేన్ వార్న్(ఆస్ట్రేలియా) తర్వాత అత్యధిక వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా ఆండర్సన్ మాత్రమే. భారత స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే(619), ఇంగ్లండ్ వెటరన్ పేసర్ స్టువార్ట్ బ్రాడ్(604)లు నాలుగు, ఐదో స్థానాల్లో ఉన్నారు. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 121, రెండో ఇన్నింగ్స్‌లో 136 పరుగులకే కుప్పకూలింది.

ఇక్కడే ముగించాలి

- **నేడు జింబాబ్వేతో నాల్గో టి20**
- **సా. 4.30గంIIల నుంచి**

హరారే: జింబాబ్వే పర్యటనలో ఉన్న భారత యువ జట్టు నేడు నాల్గో టి20కి సిద్ధమైంది. ఐదు టి20ల సిరీస్‌లో భాగంగా తొలి మూడు టి20లు ముగిసేసరికి 2-1 ఆధిక్యతలో ఉన్న టీమిండియా.. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ చేజిక్కించుకోవాలన్న దృఢ సంకల్పంతో నేడు బరిలోకి దిగుతోంది. యువ క్రికెటర్లతో ఈ పర్యటనకు వచ్చిన భారతజట్టు తొలి టి20లో చిత్తుగా ఓడినా.. రెండు, మూడు టి20ల్లో ఆతిథ్య జట్టుకు ఝలక్ ఇచ్చి ఆధిక్యతలో నిలిచింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్ పటిష్టంగా ఉంది. మరోవైపు జింబాబ్వే తొలి టి20లో నెగ్గినా.. ఆ తర్వాత రెండు టి20ల్లో ఓడి సిరీస్ చేజార్చుకొనే ప్రమాదంలో పడింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68